ఆంధ్రపత్రిక

సచిత్ర
వారపత్రిక



వెల
4 అణాలు
4-10-50

విషయానుక్రమణిక
4 అక్టోబరు 1950

ఆంధ్రపత్రిక


సంవత్సరచందా
రు. 12-0-0
విడిప్రతిక
4 అణాలు

ప్రతిబుధవారము
ప్రకటింపబడును

Founder: K. NAGESWARA RAO

సంపుటము 43
సంచిక 4

వికృతి సంవత్సర భాద్రపద బహుళ అష్టమి బుధవారము



విశ్వాసప్రకటన

కంట్రోళ్ల నిర్వహణ సక్రమంగా, సవ్యంగా కొనసాగింపవలెననీ, కచ్చితమైన ప్రజాభిప్రాయాన్ని తమ కనుకూలంగా సమకూర్చుకోవాలనీ కేంద్ర పారిశ్రామిక, సరఫరాలమంత్రి హరికృష్ణ మెహతబ్ అభిలాష. —(నేషనల్ హెరాల్డ్)

యుగ పురుషుడు

రాజకీయ, సామాజిక దాస్యబంధాలలో చిక్కి, ఆర్థికదుస్థితిలో దినదినగండంగా బ్రతుకు నెట్టుకుపోయే సామాన్య ప్రజలలో సేవాసక్తి, త్యాగదీక్ష, నియమవర్తన, నీతి రక్తి దీపింపచేశాడు గాంధీమహాత్ముడు. సామాన్య సుఖవినోదాలే అందనిఫలాలై, సమాజసేవ చెయ్యడానికి తీరిక, ఓపిక లేని వారికి దేశసేవ ఎలాచెయ్యాలో అంతర్నగ్నమై ఉన్న దేశభక్తి నేరీతిగా సార్థకపరుచుకోవాలో నేర్పాడు. భారతరాజకీయ రంగంలో ముప్ఫైయేళ్లు అపూర్వ జ్యోతియై ప్రకాశించి, ప్రతిభారతీయునికీ వ్యక్తిత్వాన్నీ, భారతజాతి సమాజ జీవనంలో ఒక వెలుగునూ ప్రసాదించాడు.

సత్యాగ్రహోద్యమాల నెరిగిన వారికి గాంధీ మహాత్ముడు ధర్మ సంస్థాపనార్థం అవతరించిన యుగపురుషుడు. కొత్తగా కళ్ళు తెరిచి కాంగ్రెస్ పరిపాలనా క్రమాన్ని పరిశీలిస్తున్న కొత్త తరం వారికి గాంధీజీకి దేశంపైన కల ప్రభావం తెలియ రాని అద్భుత విషయం.

ఖాదీ ఉద్యమం, నిర్మాణకార్యక్రమం, నిరాహారదీక్ష, సత్యాగ్రహ సిద్ధాంతం, అస్పృశ్యతా నివారణ, హరిజనోద్యమం వీనిని దేశపరివ్యాప్త ప్రచారంలోకి ఎలా తేగలిగాడు గాంధీజీ? ఈ కాంగ్రెస్ వాదు లేనా ఆనాడు గాంధీజీ సిద్ధాంతాన్ని ఆమోదించి, అనుష్ఠించి బలవత్తర సామ్రాజ్యాన్ని గడగడ కంపింప చేసినది? నాటి దేశీయుల పైన గాంధీజీ ఏమంత్రం ప్రయోగించి లోబరుచుకున్నాడు? ఈనాడు దుస్తంత్రాలు రాజకీయకక్షలు ద్వేషాలను పెంచుకొన్న కాంగ్రెస్ వాదులకు ఆ కఠిన నియమనిష్ఠల నెలా నేర్పగలిగాడు? త్యాగమెలా నేర్పారు?

ఏ యుగంలో చూసినా ఒక మానవ ధర్మం కాని, నీతి సిద్ధాంతం కాని మానవ సమాజంలో వ్యాప్తి చెందాయంటే, వాని ననుష్ఠించి ప్రాణంపోసిన దాతలైన మహాపురుషులు కనిపిస్తారు. వారితోనే ఆ ధర్మాలకు, ఆ సిద్ధాంతాలకు చైతన్యం లభిస్తుంది. నిత్య సంఘర్షణతో జీవితంలో కల మాధుర్యాన్ని అనుభవించలేక అసంతృప్తి చెందే మానవులకు ఎప్పటికప్పుడు ఆ మహాపురుషులు సంఘజీవనంలోని క్రమాన్ని దిద్దుతుంటారు. మానవ ప్రకృతిలో కల మార్దవాన్ని, సఖ్యతాభావాన్ని, సంఘజీవన శీలాన్ని, ధర్మాన్ని ఎప్పటికప్పుడు జ్ఞప్తికి తేవలసిన అగత్యం కలుగుతూ వస్తున్నది. అందుకోసమే ఇటువంటి మహాపురుషులు జన్మిస్తూ ఉంటారని గీతావాక్యం.

కారణజన్ముడైన గాంధీజీ మానవ ధర్మాన్ని ప్రబోధిస్తూ భారతీయులనే కాక విశ్వమంతటినీ మేలుకొలిపారు. రాజరికాధికారం నిర్వహించే నాయకుల కీబోధలు చెవిని పడకపోయినా ప్రజాకోటికి గాంధీజీ దేవుడైనాడు:

స్వాతంత్ర్య సంపాదనతో అధికారం చేతి కందగానే త్యాగధనులైన కాంగ్రెస్ నాయకులకు త్యాగశీలాన్ని వినియోగించవలసిన అగత్యం లేకపోయింది. పరిపాలనా నిర్వహణలో చాతుర్యం, పార్టీ ప్రాబల్యాభివృద్ధి కార్యక్రమంలో దీక్ష అవసరమని వారికి తోచింది. ప్రజా విశ్వాసం కలిగిన వారికి పరిపాలనా నిర్వహణలో అంతగా చిక్కులు సంభవించలేదు. అన్యకారణాల వల్ల పెద్ద సమస్యలలో చిక్కుకున్న వారికి ప్రజల సహకారం వేడవలసిన అవసరం లేదు. కాని మత సమస్య విషమించగానే, ఆర్థికదుస్థితి క్లిష్టతరం కాగానే ఒకవంక సోషలిస్టులూ కమ్యూనిస్టుల ధాటికి, మరొకవంక హిందూమహాసభ రాష్ట్రీయ స్వయంసేవక సంఘాలధాటికి తట్టుకోవాలనే ఆత్రం కాంగ్రెస్ పరిపాలకులలో అధికమయింది. పరిపాలనావిధిలో గాని, కాంగ్రెస్ కమిటీల కార్యక్రమాలలో గాని ఈ సమస్యలే ప్రధానమైనాయి. ప్రజల విశ్వాసాన్ని ఎలా నిలుపుకోవాలనే ఆత్రంలో గాంధీజీ బోధించిన నిర్మాణ కార్యక్రమం, అస్పృశ్యతానివారణ, స్వదేశవస్తువుల ఆదరణ సన్నగిల్లినాయి. పరిపాలనా సమస్యలనొకవంక, ప్రజల సహకార సముపార్జన మరొకవంక కాంగ్రెస్ ప్రభుత్వాలకూ, కాంగ్రెస్ కమిటీలకూ ప్రధాన కర్తవ్యాలైనాయి. అధికార వాంఛవల్ల దేశంలో ఏర్పడిన కక్షలు మితిమీరి అన్య సమస్యల ప్రసక్తి అడుగంటింది.

ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోడం కోసం మంచీ, చెడూ ఆలోచించకుండా ప్రజలుకోరే రీతిని పరిపాలన సాగించడం కర్తవ్యంగా పెట్టుకున్నారు. సత్యం, న్యాయం, ధర్మం, అహింసలకోసం గాంధీజీ తన కెవ్వరూ అండగా నిలవకపోయినాసరే దీక్ష పూనేవాడు. ప్రజల్లో పరపతికోసం న్యాయం కూడా ఎప్పుడైతే ద్వితీయంగా పరిగణించబడిందో, అప్పుడే కాంగ్రెస్ పార్టీలో రాజకీయ దుస్తంత్రాలు ప్రారంభమైనాయి. గాంధీజీమృతి చెందక ముందే ఈ ధోరణి కానవచ్చినందువల్ల ఆయన ఖిన్నుడైనాడు. భారతదేశమంతా కోపోద్వేగాలతో కుతకుత ఉడికి పోతున్నప్పటికీ ఢిల్లీ హిందూముస్లిం మతకలహాల సందర్భంలో గాంధీజీ ఏకాకియై తనమాటపైనే నిలబడ్డాడు. కాంగ్రెస్‌వాదులు తాము న్యాయమని తలచిన వానికి ఈనాడు నిలబడలేక పోతున్నారు. అవసరాన్ని బట్టి "ఇప్పటికింట్లా పోనీలే" అనే ధోరణిలో పడ్డారు. అందువలన సత్యం, న్యాయం, అహింస అనే వానికి నేడు మనకాంగ్రెస్‌వాదుల కార్యకలాపాలలో పటుత్వం లేకపోతున్నది. కాంగ్రెస్‌వాదులు లక్షలకొద్దీ బయలుదేరడంతో అవినీతికూడా మితిలేకుండా వ్యాపించింది.

కాంగ్రెస్ ఏ ఆశయాలతో స్థాపించబడినప్పటికీ, కాంగ్రెస్ పేరు చెప్పేసరికి ఈనాడు ప్రతిభారతీయునికీ ఒక గౌరవం, భక్తి కలుగుతవి. ఈ కాంగ్రెస్‌కి కాంగ్రెస్‌వాదులు నానాటికి దూరమై పోతున్నారు. గాంధీజీ ప్రచారంలోకి తెచ్చిన నిర్మాణకార్యక్రమం, ఖాదీ ప్రచారం, హరిజన సేవలు పేరుకి మాత్రం మిగిలిఉన్నాయి. నీతి, ధర్మం, న్యాయం, సత్యం అనేవానిపట్ల శ్రద్ధ మృగ్యమయింది.

సంఘర్షణమయమైన నిత్యజీవితంలో ప్రజలు అన్యాయాలకు, అత్యాచారాలకు, దౌర్జన్యాలకు, మోసాలకు, ఎలా తలొగ్గుతున్నారో, రాజకీయవాదులూ అలాగే దుస్తంత్రాలు అనివార్యమని భావించే స్థితి దాపురించింది. ఏపరిస్థితులలోనూ ధర్మనిష్ఠను విడనాడవలసిన అవసరం లేదనీ, విడనాడడంవల్ల అధర్మమే వ్యాపించగలదనీ గాంధీజీ అభిప్రాయం. లక్ష్యశుద్ధితోపాటు సాధన సంపత్తికూడా సక్రమంగా ధర్మబద్ధంగా ఉండాలని చెప్పారు. కాని అది ఆచరణలో అసాధ్యమని అనేకమంది కాంగ్రెస్‌వాదులు ఈనాడు వాదిస్తారు. ప్రజాపరిపాలకులైన వారే ధర్మనిష్ఠను త్యజించినట్లయితే దేశంలో అరాచకం, అధర్మం ప్రవర్తిల్ల గలదని అందరికీ తెలుసును. కాని ధైర్యంతో, దీక్షతో, ధర్మబద్ధులై ప్రవర్తించేవారు అరుదు. అది గాంధీజీకే చెల్లింది. అంతే కాదు. సామాన్య ప్రజలు కూడా ధర్మబద్ధులై ప్రవర్తించడం కష్టం కాదని నిరూపించారు. అయితే గాంధీజీతోనే ప్రజలలోనూ, నాయకుల లోనూ ఆ విశ్వాసం అంతరించింది. కాని ఆ యుగపురుషుడు మానవ లోకంలో తెచ్చిన చైతన్యం, ఉజ్వలింపచేసిన ధర్మజ్యోతి ధ్రువజ్యోతియై ప్రపంచంలో శాశ్వతంగా ప్రకాశించగలదు.

కాంగ్రెస్ కార్యవర్గ నిర్మాణం

కాంగ్రెస్ కార్యవర్గ నిర్మాణానికి తిరిగి ఈ సంవత్సరం ప్రాధాన్యం వచ్చింది. కాంగ్రెస్ కమిటీలకూ, కాంగ్రెస్ మంత్రివర్గాలకూ మధ్య ఎడం నానాటికీ పెరుగుతున్నదని అందరికీ తెలిసిన విషయమే. అనేక రాష్ట్రాలలో ఈ ఉభయవర్గాల మధ్యనూ తీవ్రపోరాటం కొనసాగుతూవుంది. మద్రాసు, పంజాబ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో కాంగ్రెస్ లోని కక్షల మూలంగా మంత్రివర్గాలు మారాయి. కేంద్రంలో మంత్రివర్గంలోనే రెండు వర్గాలున్నాయని చాల దినాలుగా వినవస్తున్నమాట. ఈ వర్గాలు స్పష్టంగా విభజించబడి ఉండక పోవచ్చును. మంత్రివర్గం సమష్టి బాధ్యతపైనే నిర్వహిస్తూ ఉంటుంది. అందువల్ల తరచు ఈ వర్గాల అభిప్రాయ భేదాలు బహిరంగం కాక పోవచ్చును.

వివిధరాష్ట్రాలలో కక్షలెన్నో ఏర్పడినప్పటికీ, కేంద్రంలో కక్షలకు వ్యక్తిగత వైషమ్యాలే హేతువులు కావు. పరిపాలనావిధానాల పట్ల అభిప్రాయ భేదాలు కూడా హేతువే. ముఖ్యంగా నెహ్రూ పటేల్ గార్ల మధ్య పరిపాలనా విషయాలలో పెద్ద భేదాభిప్రాయాలున్నాయని చెప్పవచ్చును. ఆర్థిక వ్యవస్థ పునర్నిర్మాణం సందర్భంలో సర్వ ప్రజాహిత రాజ్య నిర్మాణం (వెల్ఫేర్ స్టేట్) పండిట్ నెహ్రూ ఆశయమైతే, అమెరికాలోవలె వ్యాపార పారిశ్రామిక స్వేచ్ఛ కల ప్రజాస్వామ్యం పటేల్ ఆశయమని తెలిసిన విషయమే. నెహ్రూ ఆశయాన్నిబట్టి ముఖ్య పరిశ్రమలన్నీ ప్రభుత్వాధీనం కావాలి. పటేల్ ఆశయాన్నిబట్టి ఆ పరిశ్రమలు ధనికుల అధీనంలోనే ఉండాలి. పటేల్ తమ అభిప్రాయాన్ని ఇంత స్పష్టంగా ఉపన్యాసాల్లో చెప్పకపోయినా ఆ ఉపన్యాసాల్ని తరిచిచూస్తే అది బోధపడే విషయమే. ఇదే రీతిగా పాకిస్తాన్‌తో వ్యవహారాలు, సంస్కృత మయమైన హిందీ — ఉర్దూ మయమైన హిందూస్తానీ వివాదాలు, కార్మిక సమస్యలలో ఉభయుల మధ్యనూ అభిప్రాయభేదాలున్నాయి.

అయితే దేశహితాన్ని కోరి పరిపాలనా విషయాలలో ఒకరి కొకరు రాజీ పడుతూ వచ్చారు. చాలవరకు పండిట్ నెహ్రూ విధానమే ఆమోదించబడుతూ వచ్చింది. మంత్రివర్గ నిర్ణయాల నిర్ధరూ శిరసావహిస్తూ వచ్చారు.

కాని కాంగ్రెస్ ఎన్నికలు త్వరలోనే జరగనున్నందువల్ల కాంగ్రెస్ వాదులలోని వివిధవర్గాలవారు తమ తమ అభిప్రాయాల కనుకూలంగా తమ తమ వర్గాలు బలపర్చుకుంటూ కాంగ్రెస్ కమిటీల ఎన్నికల్లో పోటీచేశారు.

సుభాస్ చంద్రబోస్ ఎన్నిక సందర్భంలోనూ, సూరత్ కాంగ్రెస్‌లోనూ తప్ప, వ్యవహారాలలో భేదాభిప్రాయాల ఆధారంగా కాంగ్రెస్ ఆధిపత్యానికి పోటీ జరగలేదు. స్వాతంత్ర్య లబ్ధి అనంతరం వ్యవహారవిధానరీత్యా ఈ సంవత్సరమే మొట్టమొదటి సారిగా అధ్యక్ష పదవికి పోటిజరిగింది. దేశంలో ఈనాటి ఆర్థిక దుస్థితికి ధనిక వాదుల వైఖరే హేతువని ఆచార్యకృపలానీ అభిప్రాయం. అలా కాక, ప్రభుత్వ విధానాలవల్లనే ధనికులకు ఉత్పత్తివృద్ధి చెయ్యడానికి అవకాశం లభించలేదని పటేల్ వర్గంవారి అభిప్రాయం. దేశంలో, ముఖ్యంగా కాంగ్రెస్ వాదుల్లో అవినీతి ప్రబలడానికి కంట్రోల్స్, ప్రభుత్వవిధానాలూ హేతువులని టండన్ వర్గంవారి అభిప్రాయం. అవినీతికి కారణం ప్రభుత్వం శాసనాలను కఠినంగా అమలు జరపలేక పోవడమే కారణమని కృపలానీవర్గం వారి అభిప్రాయం.

ఈ అభిప్రాయ భేదాలతోనూ, వ్యక్తిగత వైషమ్యాలతోనూ కాంగ్రెస్ ఎన్నికల్లో పోటీలు జరిగాయి. టండన్ గారు ఎన్నికవడంతో పండిట్ నెహ్రూకు ఆందోళన కలిగింది. తన పరిపాలనా విధానాల్ని మార్చుకోబోవడం లేదనీ, ఈ విషయమై నాసిక్ కాంగ్రెస్ స్పష్టంగా తేల్చి చెప్పాలనీ పండిట్ నెహ్రూ కోరారు.

ఆ ప్రకారమే నాసిక్ కాంగ్రెస్ పరిపాలనా విధానంలోని ముఖ్యాంశాలన్నిటినీ చర్చించి, నెహ్రూ వ్యవహారాలను పూర్తిగా ఆమోదం తెలిపింది. అంటే ఈ పాక్షిక వైరాలు ఎన్నికలలో కనబడినంత స్పష్టంగా బహిరంగ సభల్లో వ్యక్తం కాలేక పోయినవన్నమాట. కాంగ్రెస్‌వాదుల్ని కూడా పాటించకుండా ప్రజల్లో అత్యధిక సంఖ్యాకులు పండిట్ నెహ్రూను అన్నివిధాలా విశ్వసిస్తారన్న సంగతి కాంగ్రెస్ వాదులకు తెలుసును. అందువల్లనే నాసిక్‌లో కాంగ్రెస్‌వాదులు కిమ్మనకుండా నెహ్రూ పరిపాలనా విధానాల్ని ఆమోదించారు.

పండిట్ నెహ్రూ విధానాల్ని నాసిక్ కాంగ్రెస్ అత్యధిక సంఖ్యాబలంతో ఆమోదించినందువల్ల, ఈ విధానాలకు అనుకూలురైన వారికి కాంగ్రెస్ కార్యవర్గంలో తగిన స్థానమివ్వాలని నెహ్రూ కోరడంలో తప్పులేదు.

వాస్తవానికి రాబోయే ఎన్నికల్లో అభ్యర్థుల్ని ఎంచే విధానంపైనే తీవ్రభేదాభిప్రాయాలు వచ్చాయి. ఈ విషయాన్ని ఇప్పటికి నిర్ణయించకుండా వాయిదావేశారు. దీనిపైన అధ్యక్షులు టండన్‌గారి వైఖరినిబట్టే కాంగ్రెస్ కార్యవర్గంపట్ల పండిట్ నెహ్రూ అవలంబించగల వైఖరి ఆధారపడి ఉంటుంది. టండన్ వర్గంవారు ప్రస్తుతానికి అన్నిటా నెహ్రూ వర్గంవారి విధానాలను ఆమోదించడానికి అంగీకరించినందువల్ల, ఈ క్లిష్టవిషయంలో ఏదో ఒక విధంగా రాజీ జరక్కపోదు. ఈ రాజీ కుదిరి, నెహ్రూ వర్గంవారికి కాంగ్రెస్ కార్యవర్గంలో తగిన చోటు దొరికితే, పరిపాలనా వ్యాసంగం నిరాటంకంగా సాగిపోగల అవకాశం ఉంది.

[సీతారామ్]

గమనిక

సెప్టెంబరు 13 వ తేదీ ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రికలో "ప్రపితామహులు" అనే కథ శ్రీ బులుసు ప్రకాశంగారి పేర ప్రచురింపబడింది. ఇది 1943 జనవరి "భారతి"లోని శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి గారి "తాతలు దిగారు" అన్న కథకు నకలు అని మా పాఠకులు కొందరు మాకు తెలియబరచారు. రెండు కథలనూ మేము పోల్చిచూడగా "ప్రపితామహులు", పాత్రల పేర్లు మినహాగా "తాతలు దిగారు" అన్న కథకు మక్కికి మక్కి అనుకరణ అని తేలింది. ఈ పొరపాటుకు మేము చాలా చింతిస్తున్నాము. అయితే ఎన్నో ఏళ్ళక్రితం ప్రచురణ అయిన కథలను జ్ఞాపకం ఉంచుకోవడం మాకు ఎంతమాత్రమూ సాధ్యం కాదు. అంతేకాక ప్రతి రచనకూడా ఇతరుల రచనకు కాపీ అన్న దృష్టితో సంపాదకుడు పరిశీలించడం భావ్యమూ కాదు. కనుక రచయితలే సన్మార్గవర్తనులై వ్యాసచౌర్యానికి పాల్పడకుండా ఉన్నట్టయితే ఇట్టి అసందర్భాలు జరగవు.

సంపాదకుడు:



పరిపాటి

శ్రీ బి. యస్. వెంకటరామ్

నట్టమధ్యాహ్నం సరీగ్గా పన్నెండు గంటలయింది ఫ్యాక్టరీలన్నీ ఒక్కసారి 'కుయ్'మని కూసినయ్ కూలిజనమంతా ఫ్యాక్టరీల్లోనుంచి రోడ్డుమీదపడి, తండోపతండాలుగా పోతున్నారు అదేసమయంలో, ఆఫీసునుంచి ఇంటికి పోతూన్న క్రిష్టాప్రివ్ వాళ్ళ మధ్య ఇరుక్కున్నాడు "ఈ దారినిఎందు కొచ్చాన్రా బాబూ!" అని విసుక్కుంటూ, సైకిలు నడుపుకుంటూ నానాఅవస్థగా వెళ్తున్నాడు

"ఏమోయ్, క్రిష్టాప్రివ్! ఇదేమిటిదీ, మధ్యాహ్నం షికారా?" నవ్వుతూ హేళనగా పలకరించాడు, అక్కడే కనిపించిన ఓ మిత్రుడు.

"ఏమి షికారో, నా గ్రహచారం! సైకిలుకు పంచరు పడినట్టుంది, సరీగ్గా సమయానికి గాలి పోయింది. పైగా, వీళ్ల మధ్య ఇరుక్కున్నాను. అసలా రోడ్డున వెళ్లాల్సింది!"

ఫర్వాలేదు, మెల్లగా వెళ్దూ! ఇవేళ మధ్యాహ్నం శెలవే గదూ?"

ఇద్దరూ కబుర్లాడుకుంటూ నడక సాగించారు.

అసలు, కిష్టాప్రివ్ ఇల్లు ఆఫీసునుంచి చాల దూరంలో వుంది పైగా, ఆవేళ ఎండగూడా జాస్తీగా వుంది అందుకు తోడుగ, చుర్రుమని ఆకలిగూడా వేస్తోంది అలాంటి సమయంలోనే సైకిలుగూడా చెప్పిన మాట వినలేదు పోనీ, గబగబ నడుపుకొని వెళ్దామంటే, యీ పెద్ద దండు అడ్డు వచ్చింది

ఎలాగో, బ్రతుకుజీవుడా అని యింటికి చేరుకొని, తలుపు కొట్టాడు పదేళ్ల పనికుర్రాడు తలుపు తెరచి, సైకిలు తీసుకొని లోపల వుంచాడు.

కిష్టాప్రివ్ గబగబ గదిలోపలికి వెళ్ళి,

డ్రెస్ మార్చుకొని, స్నానంగదిలోనికి పోయి చేతులూ కాళ్లూ కడుక్కొని, తిన్నగా వంటింటిలోనికి వచ్చాడు.

కాని ఏదీ? .

తను వచ్చిరాగానే, అంతంత అగ్గగ్గలాడుతూ, అన్నీ అందిస్తూ, అన్నీ సిద్ధం జేస్తూ, అంత హడావిడిగా వుండే అర్ధాంగి ఏదీ? ..

అటూ ఇటూ చూచాడు. 'సరసూ' అని పిలిచాడు

పడుకున్నదేమో అని, మళ్లీ పడకగది లోనికి వెళ్లాడు ఊహూఁ. ఎక్కడా కనిపించలేదు!

"బోయ్, మీ అమ్మగారేరీ!" అంటూ వీధిగుమ్మంలో కూర్చున్న కుర్రాణ్ణి కేకేస్తూనే, మళ్ళీ వంటింటిలోకి వచ్చాడు

అంతటా ఒక్కసారిగా దృష్టి ప్రసారించాడు ఓవైపున పళ్లెం, చెమ్బు, గ్లాసూ, పీటా, కుక్కరూ అమర్చివున్నాయి మరో కాస్త పక్కగా తెరచివున్న పాన్‌దాన్, అందులో-కట్టివున్న కిళ్లీ ఉన్నయ్ అక్కడే పీటమీద వుత్తరం ఒకటి వుంది గబాలున తీసి చదువుకున్నాడు.

"ప్రియమైన .. . ..

ఇందాక పదకొండుగంటలకి బసవన్నగుడినుంచి తమ్ముడు వచ్చాడు అమ్మకు చాలా సుస్తీగా వున్నదనీ, నన్ను తీసుకు రమ్మన్నదనీ చెప్పాడు. ఆఫీసుకు మీకు కబురుపంపానని గూడా అన్నాడు. అయినా, మీరు వచ్చాక వెళ్దామనుకున్నాను కాని, తక్షణం వస్తేగాని వీల్లేదని కంగారుపెట్టడంచేత, వెంటనే వెళ్ళడం తప్పిందిగాదు మీరుమటుకు రావడంతోనే భోంచెయ్యండి, లేకపోతే, అన్నం చల్లారిపోతుంది పెరుగూ నెయ్యీ అలమారులో వున్నాయి, వడ్డించుకున్న తర్వాత మళ్ళీ అక్కడే పెట్టేయండి లేకపోతే, పిల్లి తినిపోగలదు. మరి, ఈ రాత్రికి భోజనం అక్కడే! .. తప్పక వస్తారుగదూ? ఎదురుచూస్తూ వుంటాను. పెరుగు వేసుకోవడంమటుకు మరిచిపోకండి!... మరిచిపోకండి! .. మరిచిపోకండి?... ముమ్మారు చెపుతున్నాను.

మీ—సరసు.

అన్నట్టు, మరో మాట భోజనం అయిన తర్వాత, ఆ కుక్కరులో చెమ్బు, గరిటా పడేసి, నీళ్లు పోయండి. లేకపోతే, తోమడానికి అవస్థపడాలి!"

ఉత్తరం చదువుకోగానే, ఎక్కడ లేని కోపం చఱ్ఱున వచ్చింది. ఒక్కసారి అత్తనీ, బావమరిదినీ నాలుగు అనుకొని ఉత్తరం ఫఱ్ఱున చించిపారేశాడు

ఆకలిమటుకు మ్రుమంటూండడంవల్ల, అన్నంమీద అలగలేక, ఆదరాబాదరాగా వడ్డించుకొని, తినడం ప్రారంభించాడు. ముందు నోట్లో వేసుకున్న ముద్దే ముందుకు పోలేదు పాపం! వొంటరి భోజనం .. పథ్యపు భోజనంలాగ వుంది! ఎలాగో బలవంతాన నములుతూ, దృష్టిని ఇటూ అటూ మరల్చాడు; పైకి పోనిచ్చాడు. దండెం, ఆ దండెంమీద చీర—నీలిచీర—కనిపించాయి ఆ నీలిచీరంటే సరసుకు ఎంత ఇష్టం! ఆ రోజారంగు వొంటిమీద యీ నీలిరంగు చీర—సరసుకు ఎంత సొగసునిస్తుంది! నిజంగా ఆ బ్యూటీ. ఆ వండర్ " యింకా యిలాగే యేమేమో తియ్యని వూహలు తమాషాగా ఉరకలువేశాయి!

కాని, ఇటు నోట్లోని ముద్దమటుకు ముందుకు పోలేనంటోంది! ఆనాటి శివుని కంఠంలోని గరళంలాగ—కంఠంలోనే వుండిపోయింది! మరికాస్త బలవంతంచేసి యింకో ముద్దగూడా పంపేసరికి, అది లోపలున్నదానికి చేదోడువాదోడయింది! ఇక గుబుక్కున పులబారేడు! నోట్లోనుంచి అన్నం ముద్ద బయటపడింది. ముక్కులోనుంచి గూడా అన్నం మెతుకులు కొన్ని పడినయ్; కళ్లల్లో నీళ్లు కమ్మినయ్! ఆ చీరనుగురించి అనుకున్నందుకే యీ ఫలితం అనుకున్నాడు. దానికూడా రెండు మూడు గ్లాసులు నీళ్లు తాగి, మళ్ళీ తినడం ప్రారంభించాడు. మెల్లమెల్లగ నములసాగాడు

సరసు ఉత్తరం, కాదు కాదు—పవిత్ర ప్రేమలేఖ—జ్ఞాపకం వచ్చింది అందులోని ఒక్కొక్క వాక్యం, అతిసరళంగా, అమాయకంగా వున్న ఒక్కొక్క పలుకు, అనుకునేసరికి, సరసుమీద జాలి పుట్టింది. 'నిజంగా, సరసుమనసు ఎంత సరళం! వొట్టి వెన్నపూసవంటి మనసు! అన్నీ చక్కగా వండి, కావలిసినవన్నీ కళ్లకు కనబడేలాగ పెట్టి ఓ చిన్న వుత్తరంగూడా వుంచి, అమ్మగారింటికి వెళ్లింది! ఆఫీసు నుంచి రాగానే భోంచేయాలట! చల్లబడిన అన్నం నాకు సహించదనీ, పెరుగు వేసుకోకపోతే, వేడిచేస్తుందనీ, ఎంతో చింత! ఎంతో భయం! రాత్రిభోజనం అక్కడేనట అక్కడంటే అత్తారింట్లో!—బాగానే వుంది! ..'

ఇలాగ ఆలోచిస్తూ ఆలోచిస్తూ ఎలాగో భోజనం పూర్తిచేశాడు తర్వాత, పాన్‌దాన్‌లోని కిళ్ళీ తీసుకుని, పడకగదిలోకి పోయి, ఈజీచెయిర్‌లో మేను వాల్చాడు

కిళ్లీ నములుతూనములుతూ వుండగా, మళ్ళీ ఆలోచన్లు పరుగెత్తాయి "ఇవేళ తమలపాకులు వేసుకునేవేళకి సరసు లేకపోయిందగదా! . నిజంగా, తమలపాకులు చిలకలు చుట్టి, అలా నోటికి అందిస్తూ వుంటే, అబ్బ! .. ఛా! సరసు సరసన లేకపోతే ఎలాగో వుంది! ఏమీ తోచడం లేదు! నిజంగా, అది వుంటేనే నాకు ఆనందం; దానికూడా నేనుంటేనే ఆనందం. మొఖం అంత చేసుకుంటుంది! ఏమైనా సరే, ఇకనుంచి ఇద్దరం కలిసే వుండాలి! ఏదీ, ఎప్పుడూ నాకు యీ అఫీసు గొడవతోటే, ఆ క్లబ్బుగొడవతోటే సరిపోతోంది! రోజూ ఇంతే! పాపం, సరసు మటుకు ఇరవైనాలుగుగంటలూ యింట్లోనే ఒక్కర్తీ మాటుమణిగి వుంటోంది! అలా వుంటే, వెధవది, జీవితాలకి సుఖా లేవీ?... ఇదేం" సుఖదాంపత్యం!! ఛా! ఇంతకాలం నాకీ యోచనే లేదు! ఇక ఏమైనా సరే, సరసు వచ్చాక, నా అపరాధం వొప్పుకొని ఇకనుంచి దాని మనస్సును ఆనందపర్చాలి!

"అది మరీ అమాయకురాలు ఒకనాడైనా ఫలానాచోటుకు తీసుకువెళ్లండని గాని, ఫలానావస్తువు కావాలనిగాని-అడగలేదు! నిజంగా, భర్తలకు సర్వవిధాలా సుఖాన్నే చేకూర్చుతున్న యిలాంటి అర్ధాంగుల్ని యిలా ఇళ్లల్లో బంధించి వుంచడం భావ్యం గాదు! వాళ్లకీ తమకు మల్లేనే ఆనందం, సుఖం-అందేటట్లు భర్తలు ప్రవర్తించాలి అలా చేయడం భర్తల విధి! ముఖ్యకర్తవ్యం!! ఇకనుంచి ఆఫీసునుంచి ఇంటికి రాగానే, క్లబ్బుకు వెళ్లడం మానేసి, సరసును వెంటబెట్టుకొని ఎక్కడికైనా షికారుగా వెళ్లుతుండాలి! తప్పదు! ఇవేళనుంచే యీ కొత్త ప్రోగ్రాం ఆచరణలో పెట్టితీర్చాలి! నిజంగా, యింతవరకూ ఎంత తప్పుచేశాను!. " అని యింకా ఏమేమో అనుకుంటూ వుండగా, చిన్న కునుకు పట్టింది.

మళ్లీ కళ్లు తెరిచేసరికి, గడియారం అయిదు కొట్టింది ముఖం కడుక్కొని, గదిలోకి వచ్చి, డ్రెస్ వేసుకొని, జోళ్లు తొడుక్కుంటూ మళ్లీ ఆలోచించాడు: "నిజంగా, సరసు లేకపోతే ఏమీ బాగా లేదు బసవన్నగుడికి పోయి ఎలాగైనా రాత్రికే పిలుచుకురావాలి అలాగే, దారిలో 'లాల్‌బాగ్'కు షికారుకు తీసుకువెళ్లి చూపించాలి!. '

ఇంతలో సరసు కాఫీకప్పుతో ఎదుట ప్రత్యక్షమయింది!

క్రిష్ణారావ్ ఆశ్చర్యానికి అంతు లేదు. "ఇదేం?" అన్నాడు విస్మయంగా చూస్తూ.

"అబ్బే, ఏమీ లేదు! అమ్మకు అంత ఎక్కువగా జబ్బు లేదండి. ఎప్పుడూ మామూలుగా వుండేదే! నేను రానేమోనని, తమ్ముడు కంగారుపెట్టి తీసుకు

నేటిప్రపంచం:

కొరియా కమ్యూనిస్టుల పరాజయం

దక్షిణ కొరియాలో కమ్యూనిస్టు సేనలు పరాజయం పొంది ఉత్తర కొరియాలోకి పారిపోయినయ్. అమెరికన్ సేనలు భీషణ యుద్ధంచేసి ధ్వంసమైన సోల్ నగరాన్ని ఆక్రమించుకున్నాయి. శిధిల నగరంలో వృద్ధుడైన సింగ్మన్‌రీని తీసుకొచ్చి మళ్ళీ పట్టంకట్టారు.

పశ్చిమ తీరాన ఇంఛోన్ రేవులో అమెరికన్ సేనలు దిగి దండయాత్ర ప్రారంభించినప్పటికి దక్షిణాన పోరాడుతున్న కమ్యూనిస్టు దళాల ప్రతిఘటనశక్తి క్షీణించింది. ఉత్తరాంగంలోనూ నక్తాంగ్ నదీతీరంలోనూ అమెరికన్ సేనలు విజృంభించి సియోల్ నగరం వైపుగా అనుగమించాయి. కమ్యూనిస్టు సేనలు సోల్ నగరంలో తుదిపోరాటం జరిపాయి. అమెరికన్ సేనల్ని సోల్ యుద్ధంలో నిలిపి, ...

...లు ఉన్నను ద్వారా పరీక్షించి, ఏమీ ఫర్వాలేదని చెప్పి, మందిచ్చి ... గంటలు ... అక్కడే వున్నారు ... తోచిందిగాదు ... శనివారం ... ముఖ్యాన్ని ... జ్ఞాపకం వచ్చి, ... చెప్పకోవచ్చునిదా ... వచ్చాను. అసలు అక్కడుండి బ్రతికించింది ... అంటూ ముసిముసిగా నవ్వుతూ, ... చెప్పలేని ... చెప్పతున్నట్లు ... కాఫీ అందించింది.

డ్రాప్లీ ఒక్కసారి సరసుకేసి చూసి, సరసుని నవ్వి, కాఫీ అందుకొని ఆరగించాను. జోళ్లు అప్పటికే తొడుక్కున్నాను గనుక, ఒక-హ్యాట్‌ గూడా ... కొని, ... నిలబడ్డాడు తయారుగా.

"ఎక్కడికి?" అడిగింది సరసు.

"క్లబ్బుకి!" అంటూ నడిచాడు డ్రాప్లీ!

... భర్తవేపు అలానే చూస్తూ వుండిపోయింది సరసు!

(కన్నడానికి అనువాదం: క్వాజి.)

లంచిన అవకాశంలో దక్షిణాన పోరాడిన సేనలన్నీ చెక్కు చెదరకుండా వెనక్కు పరుగుతీసి ఉత్తర కొరియా చేరాయి. చింజూ ప్రాంతంలో యుద్ధంచేస్తూ, పారిపోడానికి దారిలేక చిక్కుపోయిన కమ్యూనిస్టు దళాలు యుద్ధం మాని పల్లె ప్రాంతానికి పారిపోయాయి. ఆ సైనికులందరూ సిపాయిదుస్తులు విడిచిపెట్టి ప్రజల్లో కలిసిపోయారని అమెరికన్ల అభిప్రాయం. అలాగే మిగతా ప్రాంతాల్లో కూడా పారిపోగా మిగిలిన సైనికులందరూ ప్రజల్లో కలిసి పోయివుంటారు.

సోల్ నగరపతనంతో ఇప్పటికి యుద్ధం ముగిసింది అంటే ఏ రంగంలోనూ కమ్యూనిస్టులు అమెరికన్ సేనల్ని ఎదిరించడం లేదు వారికి చిక్కకుండా తప్పించుకున్నారు. అమెరికన్ సేనలు, దక్షిణకొరియన్ సేనలు ఉత్తరకొరియా సరిహద్దు 38 వ అక్షాంశరేఖ వద్దకు చేరినయ్.

ఇంక సరిహద్దుదాటి ఉత్తర కొరియాలో ప్రవేశించాలా వద్దా అనే విషయాన్ని భద్రతాసంఘం కాని ఐక్యరాజ్యసమితి గాని తేల్చలేదు. కాని ఏమిటో అమెరికన్ సేనల ఆజ్ఞల ననుసరించి దక్షిణ కొరియన్ సేన సరిహద్దుదాటి ఉత్తర కొరియాపై దాడి ప్రారంభించింది. అమెరికన్ విమానాలు ఎప్పటి మాదిరిగానే ఉత్తర కొరియాపై విహరిస్తూనే ఉన్నాయి బాంబులు వెయ్యడానికి అక్కడ ఆశ్రయం ఏమీ మిగల్లేదని అమెరికన్ మిలిటరీవార్తలు తెలుపుతున్నాయి.

మిలిటరీ దృష్ట్యా అవసరమని తోచినట్లయితే అమెరికన్ సేనలు సరిహద్దుదాటి ఉత్తరకొరియా ప్రవేశించవచ్చునని ఇదివరలో అమెరికన్ దేశరక్షణశాఖ స్పష్టంగా చెప్పింది. అలముకుంటే అవసరమని తోచడానికి ఆట్టే సేపు పట్టదు. అమెరికన్, బ్రిటిష్, ఫ్రెంచి ప్రభుత్వాలు ఉత్తర కొరియాపైకి దాడి చెయ్యాలనీ, కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని లాంగదీసి ఇప్పుడున్న సరిహద్దును రద్దుపరచాలనీ అభిప్రాయ పడుతున్నట్లు స్పష్టపరిచాయి. అలా దండయాత్ర చెయ్యడానికి భద్రతా

యింపలి జూన్‌లో చేసిన తీర్మానం అనువర్తిస్తున్నదని కొందరు వ్యాఖ్యానించారు.

కొరియా సమస్యపై గత మూడేళ్లుగా ఐక్యరాజ్య సమితి చేసిన తీర్మానాలను అమలు జరపడానికి ఇప్పుడు యత్నించాలని పాశ్చాత్య ప్రభుత్వాల ఉద్దేశం. ఇంతవరకూ సమితి నిర్ణయాలను ఉత్తర కొరియా ప్రభుత్వం ధిక్కరిస్తూ వచ్చింది. అందువల్ల కొరియా అంతటికీ ఒకే ప్రభుత్వాన్ని స్థాపించాలంటే, కమ్యూనిస్ట్ ప్రభుత్వాన్ని తొలగించి తీరాలని వీరి అభిప్రాయం. వీరి ఉద్దేశాలు నెరవేరాలంటే కమ్యూనిస్ట్ ప్రభుత్వం సంధి రాయబారాలకు రావడానికి అంగీకరించడం కష్టం. కాబట్టి యుద్ధం తప్పని సరికావచ్చును.

బ్రిటన్ మరికొన్ని దేశాలనుకూడ గట్టుకుని ఐక్యరాజ్యసమితిలో ఒక తీర్మానాన్ని ప్రతిపాదిస్తున్నది సమితి ఇదివరలో చేసిన తీర్మానాలను అమలుజరపడానికి, అనగా ఐక్యకొరియా రాజ్యస్థాపనకుగాను కొరియా అంతటాగాని, ఉత్తరకొరియాలో మాత్రమే గాని సమితి ఆధ్వర్యంలో ఎన్నికలు జరపాలని బ్రిటిష్ తీర్మానంసూచిస్తున్నది కొరియా ఆర్థిక పునరావాస బాధ్యతనుకూడా సమితికే ఒప్పగించాలని ఈ తీర్మానం సూచిస్తున్నది ఈ సూచన ప్రకారమైతే అసలు ఉత్తర కొరియాతో సంధికి రాయబారాలకి అవకాశం ఏమంతైనా ఉండదు. కాబట్టి ఈ తీర్మానం ఆధారంగా ఉత్తర కొరియాపై దండయాత్రను సమర్థించుకుని, అక్కడక్కడా అమెరికన్‌సేనల్ని గాని లేదా బ్రిటిష్ ఆస్ట్రేలియన్ సేనల్ని గాని నిలిపి, ఐక్యరాజ్య సమితి అధ్వర్యంలో ఎన్నికలు జరిపించడానికి పాశ్చాత్య రాజ్యాలు తలపెట్టినట్లు స్పష్టమౌతున్నది. కొద్దిరోజుల్లో అమెరికాకూడా ఇటువంటి తీర్మానాన్నే ప్రతిపాదించ గలదని ఎఛిసన్ ప్రకటించారు ఈ రెండుతీర్మానాల్ని సమన్వయించి సమితిలో ప్రవేశపెట్టడానికి ఆలోచన జరుగుతున్నది.

కాని ఆసియావాసుల అభిప్రాయం దీనికి పూర్తిగా భిన్నంగా ఉంది అమెరికన్, దక్షిణకొరియన్ సేనలు ఉత్తరకొరియాపై దండయాత్ర చెయ్యరాదని భారతప్రభుత్వ అభిప్రాయమైనట్లు పండిట్ నెహ్రూ చెప్పారు. దండయాత్ర చేసే బదులు, దురాక్రమణదారుల్ని ఓడించినందు వల్ల, ఇప్పుడు శాంతిమార్గాల నన్వేషించి కొరియా దేశసమైక్యతా సమస్యని పరిష్కరించాలని పండిట్ నెహ్రూ అన్నారు ఏ సమస్యనుకాని యుద్ధంవల్లనే పరిష్కరించ పూనుకోవడం వ్యర్థమని చెప్పారు. కాని బ్రిటిష్, అమెరికన్ వర్గానికి ఇది నచ్చడం కష్టం.

ఫార్మోజా *

ఫార్మోజా తీరంలో అమెరికన్ నౌకా బలాల్ని కాపుదలపెట్టి, చీనారాజ్యానికి చెందిన ప్రాంతంపై దురాక్రమణ జరిపాయని పెకింగ్ ప్రభుత్వంచేసిన ఫిర్యాదును చర్చించడానికి అమెరికా ఇదివరకే సమ్మతించింది. ఈ ఫిర్యాదుపై చర్చజరిపే సందర్భంలో, చీనా కమ్యూనిస్టు ప్రభుత్వ వాదాన్ని వినడం నిమిత్తం పెకింగ్ ప్రతినిధుల్ని ఆహ్వానించడానికి భద్రతామండలి నిర్ణయించింది పెకింగ్ ప్రతినిధిని ఆహ్వానించరాదని చియాంగ్ ప్రభుత్వప్రతినిధి వాదించాడు ఆహ్వానించాలనే సూచనకు అనుకూలంగా ఏడుఓట్లు లభించాయి. ఇది కేవలం నియమాలకు సంబంధించినది కాబట్టి భద్రతామండలిలో సభ్యులు వీటో ప్రయోగించటానికి వీలు లేదని మండలి అధ్యక్షుడైన బ్రిటిష్ ప్రతినిధి చెప్పాడు. అందువల్ల చియాంగ్ ప్రభుత్వ ప్రతినిధి వీటో ప్రయోగిస్తున్నట్లు చెప్పినా చెల్లలేదు అయితే ఫార్మోజా సమస్య చర్చను నవంబరు 15వ తేదీ తరువాత చర్చించాలని ఈక్వెడార్ ప్రతినిధి చేసిన సూచన మండలిచేత ఆమోదించబడింది. అప్పటికి అమెరికాలో కాంగ్రెస్ ఎన్నికలు జరుగుతాయి ఎన్నికల అనంతరం అమెరికా చీనాలో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని గుర్తించగలదని సమితి వర్గాలవారు భావిస్తున్నారు. ఇంతేగాక కొరియా సమస్య ఒకవిధంగా ఆనాటికి తేలిపోతుంది.

కొరియా సమస్యను చర్చించేటప్పుడు సమితిలో చీనా కమ్యూనిస్టు ప్రభుత్వానికి స్థానమివ్వడం అవసరమని భారతప్రభుత్వం మొదటినుంచీ వాదిస్తూనే ఉంది కాని రెండూ సంబంధంలేని సమస్యలని ఎఛిసన్ వాదించాడు. భారతదేశం సరిహద్దుల్లో ఉన్న టిబెట్ భవిష్యన్నిర్ణయసమస్యలో భారతదేశం తగిన శ్రద్ధతీసుకోవడం లేదని విమర్శించినప్పుడు అమెరికన్ వర్గాలవారికి, కొరియాసమస్యలో కూడా అదేవాదం వర్తిస్తుందనే యోచన తట్టలేదు. అయితే క్రమక్రమంగా సమితిలో చీనాకమ్యూనిస్టు ప్రభుత్వానికి స్థానం ఇవ్వక తప్పదనే భావం ప్రబలం కాసాగింది దీని ఫలితంగానే ఫార్మోజాసమస్యపై చర్చకు చీనా కమ్యూనిస్టు ప్రభుత్వ ప్రతినిధిని ఆహ్వానించడానికి వీలు పడింది తరువాత సభ్యత్వానికి ఆహ్వానించడానికి కూడా ఆట్టే రోజులు పట్టక పోవచ్చును.

కాశ్మీరసమస్య *

కాశ్మీర్ సమస్యపైన మధ్యవర్తి సర్ ఓవన్‌డిక్సన్ తయారు చేసిన నివేదికపై పండిట్ నెహ్రూ తమఅభిప్రాయాన్ని పత్రికా సమావేశంలో ప్రకటించారు. కాశ్మీరంపట్ల భారతప్రభుత్వ విధానం అయిదు ముఖ్యాంశాలపై ఆధారపడి ఉందని నెహ్రూచెప్పారు 1 కాశ్మీరంపై పఠాన్‌మూకలూ, పాకిస్తాన్ సైన్యాలూ జరిపినది దురాక్రమణ అని గుర్తించబడాలి ఇదిఅంతర్జాతీయ నియమాల ప్రకారం అక్రమం అని గుర్తించబడాలి

2. కాశ్మీర సంస్థాన భవిష్యత్తును నిర్ణయించవలసినది ప్రజలే.

3. కొత్త చిక్కులు రాకుండానే ముందుగా శాంతి యుతంగా ఒక రాజీ పద్ధతి కుదరాలి.

4. భారత దేశం విషయంలో వలెనే కాశ్మీరంలోకూడా ద్విజాతి సిద్ధాంతాన్ని అంగీకరించ బోరు. ఈ సమస్యకూ ద్విజాతి సిద్ధాంతానికీ ముడిపెట్టడానికి వీల్లేదు.

5 కాశ్మీర్ ప్రజల సంరక్షణ, సంస్థానంలో శాంతి భద్రతల బాధ్యత భారత ప్రభుత్వంపైనే ఉంది

భద్రతామండలి తీర్మానాలసందర్భంలో భారత ప్రభుత్వం ఎన్నడూ వాగ్దానాలను భంగపరచలేదని పండిట్ నెహ్రూ చెప్పారు. భద్రతామండలి ఆదేశాలను పాటించడం నిమిత్తం భారత ప్రభుత్వం కొన్ని సందర్భాలలో తమ వాదన విడిచి చోటియ్యవలసి వచ్చింది

పాకిస్తాన్ ఎప్పటికప్పుడు కాశ్మీర్ సమస్యసందర్భంలో భారత ప్రభుత్వంతో పాటు తమకూ సమానస్థాయి కావాలని కోరుతూ వచ్చింది.


కాశ్మీరంలో పాకిస్తాన్ జరిపిన దురాక్రమణ నేరాన్ని మొదట కాశ్మీర్ కమిషన్ గుంభనగా ఒప్పుకుంది. సర్ ఓవెన్ డిక్సన్ స్పష్టంగా అట్టి అక్రమం జరిగిందని అంగీకరించాడు. అయినప్పటికీ శాంతి కోసం భారతప్రభుత్వం కొన్ని షరతులకు అంగీకరించింది. ఇప్పుడు వచ్చిన పెద్ద ఆటంకమల్లా ప్లెబిసైట్ గురించే.

ప్లెబిసైట్ ఎలాజరపాలనే విషయంపైన సర్ ఓవెన్‌డిక్సన్ చేసిన ప్రతిపాదన భారత ప్రభుత్వానికి పూర్తిగా అంగీకారయోగ్యం కాలేదు ప్లెబిసైట్ నిమిత్తం ఆరు మాసాల పాటు షేక్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని తొలగించి సమితి ప్రతినిధులే పరిపాలన నిర్వహించాలని డిక్సన్ చేసిన సూచన నంగీకరించినట్లయితే, పాకిస్తాన్ దురాక్రమణకు తలొగ్గి, దురాక్రమణనుంచి రక్షించబడిన ప్రాంతాన్ని కూడా చేతులారా ఒప్పగించబడినట్లే అవుతుందని పండిట్ నెహ్రూ అన్నారు. అందువల్ల డిక్సన్ సూచన విఫలమయింది. అదీకాక సంస్థానాన్ని విభజించడానికి పాకిస్తాన్ నిరాకరించింది.

డిక్సన్ మధ్యవర్తిత్వం విఫలం కావడంతో తిరిగి పాకిస్తాన్‌లో నాయకులు యుద్ధావేశ పూరితులై ఉపన్యాసా లిస్తున్నారు. మత యుద్ధం జరుపుతామంటూ బెదరిస్తున్నారు. కాని భారతదేశం ఈ బెదరింపులకు లొంగదనీ, పాకిస్తాన్ నాయకులు రెచ్చగొడుతున్న మతావేశాలకు లోను కాదనీ పండిట్ నెహ్రూ స్పష్టపరిచారు. పాకిస్తాన్ ఏవిధంగా ప్రవర్తించినప్పటికీ భారతప్రభుత్వం అన్ని సమస్యలనూ శాంతియుతంగానే పరిష్కరించడానికి స్థిర సంకల్పం చేసుకున్నదని నెహ్రూ చెప్పారు. ఇదే రీతిగా శరణార్థుల ఆస్తి నష్ట పరిహార సమస్యనూ, పంజాబ్ కాలువల నీటిలో తగవునూ పరిష్కరించుకోవాలని భారత ప్రభుత్వం పాకిస్తాన్‌కి సూచిస్తూ వచ్చింది. ఈరెండు సమస్యల్ని పరిశీలించి పరిష్కరించే నిమిత్తం ఉభయదేశాలనుంచీ ఇద్దరిద్దరు జడ్జీలను నియమించాలని భారతప్రభుత్వం సూచించింది. ఈసూచనకు పాకిస్తాన్ ప్రభుత్వం ఇంతవరకూ సమాధాన మివ్వలేదు సెప్టెంబరు 30 తో పాకిస్తాన్‌తో వాణిజ్యపు టొడంబడిక ఆఖరైనందువల్ల తిరిగి ఉభయ దేశాలమధ్యనూ వాణిజ్యాన్ని పునరుద్ధరించాలంటే పాకిస్తాన్ రూపాయి మారకం విలువ సమస్య తేలవలసి ఉంది. పాకిస్తాన్, భారత ప్రభుత్వాలు ఏసమస్య పరిష్కారం నిమిత్తం కాని, యుద్ధానికి దిగబోరని ప్రకటించాలని పండిట్ నెహ్రూ ఇదివరలో సూచన చేశారు.

కేవలం అట్టి ప్రకటనవల్ల ప్రయోజనం లేదని, ఉన్న సమస్యల్నిపరిష్కరించనిదే అట్టి ప్రకటన చెయ్యడానికి సిద్ధంగాలేననీ లియాఖత్ ఆలీ అన్నాడు. అందువల్ల ఆయా సమస్యల పరిష్కారం నిమిత్తం జడ్జీలవల్ల పరిశీలింపజేయాలని భారతప్రభుత్వం ఇప్పుడు సూచించింది. ఈ సూచనకింకా పాకిస్తాన్ ప్రభుత్వం సమాధాన మివ్వలేదు. ఈలోగా పాకిస్తాన్‌లో యుద్ధనినాదాలు మాత్రం చెలరేగుతున్నాయి దీనికితోడు వాణిజ్య ప్రతిష్టంభన తిరిగిఏర్పడింది. భారతదేశం మాత్రం శాంతి మార్గాన్నే అనుసరించ గలదనీ, కానిఅన్యుల దోషంవల్ల ఆ శాంతిభగ్నమైతే ధైర్యస్థైర్యాలతో నిలబడగలదనీ పండిట్ నెహ్రూ స్పష్టపరిచారు.

డిటెక్టివ్ సీరియల్:



ప్లీడరు మాధవరావుగారు లైబ్రరీ గదిలో పచారుచేస్తున్నాడు. ఆలోచన తీవ్రంగా పరుగులు తీస్తోంది. కోర్టుకి బయలు దేరడానికి సిద్ధంగా ఉన్నాడు కాని బయలు దేర లేదు జూనియర్ ప్రక్కనే ఒక్క చిన్న మేజావద్ద కూచుని ఫైల్ తిరగేస్తున్నాడు కొత్తగా వృత్తి నేర్చుకోడానికి చేరాడేమో శ్రద్ధగా ఆసక్తితో పనిచేస్తాడు జూనియర్ రంగారావు చూపులు చురుగ్గా వుంటాయి

పచార్లు చేస్తున్న మాధవరావు గారు ఒక్క క్షణం ఆగి, రంగారావు కేసిచూసి అడిగారు "పదింటికే కాదూ వస్తానని చెప్పింది ? ఇంకా రాలేదేం ? అప్పుడే పావుగంట ఆలస్యమైంది "

"అవునండీ, సరిగ్గా పదింటికే రమ్మన్నాను ఆలస్యమైతే చూడ్డానికి వీలుపడదని కూడా చెప్పాను పోనీ ఈపూట ఆవిణ్ని చూడక పోతేయేం ? మనకి టైమై పోడం లేదూ ?"

"అలాకాక్కాదు చూడాలి ఈకేసేదో చాలా చిత్రంగా ఉంది తప్పకుండా చూడాలి ఎప్పుడో కాని ఇలాటి కేసులు రావు "

"ఇదేం హత్యకేసుకంటె గొప్పదా ?"

"హత్యకేసులో ఏముంది ? చచ్చిన వాళ్ళ గొడవకంటె బతికిన వాళ్ళగొడవే చూడాలి తీరా చచ్చిన వాడు చచ్చింతరవాత చేసే శవపరీక్షలు ఎందుకో నాకు బోధపడదు "

కాస్సేపు మాధవరావుగారు మాట్లాడకుండా అటూ ఇటూ పచారు చేశాడు తరవాత గడ్డంకింద వేళ్ళు మీటుకుంటూ, తనలో తాను మాట్లాడుకుంటున్నట్టు అన్నాడు "ప్రేమ ఎలాగైతే వివాహంలో పరిణతి పొందుతుందో, ద్వేషం అలాగే హత్యలో పరిణతి పొందుతుంది నిజానికి ద్వేషమనేది ప్రేమకంటె ఎంత బలీయమైనది! కొన్ని కొన్ని చోట్ల హత్య జరక్కముందే ఆ ద్వేషం ఏదిక్కుగా మొగ్గుతున్నదో తెలుస్తుంది హత్యను నివారించడానికి అవకాశం ఉంటుంది కాని ఆ దారుణం జరిగిపోయేవరకూ పోలీసులు కళ్లు తెరవరు న్యాయశాసనాలు నోరెత్తవు ఆ ద్వేషాన్ని వెన్నంటి పరిశీలించినట్లయితే మానవస్వభావంలో కొన్ని చిత్రమైన రంగులు బయటపడతాయ్ వృత్తి ధర్మంలో దీన్ని కనిపెట్టి పరిశీలించేవాడెవడు ?"

మరి కొంతసేపు ప్లీడరుగారు మౌనంగా పచారు చేశాడు తరవాత తలెత్తి రంగారావు వంక చూస్తూ,

"ఈ వ్యవహారమే చూడు ఎంత చిత్రంగా వుందో! నువ్వు ఇన్నేళ్ళు న్యాయశాస్త్రం చదివావ్ కాని నిద్రలో నడిచే అలవాటున్న మనిషి, తనకి తెలియకుండానే కత్తి తీసుకుని పడకగది ప్రవేశించి భార్యని హత్యచేశాడే అనుకో. ఇప్పుడు హత్య జరగని మాట నిజమే; భయపడి ఆవిడ పారిపోయింది కాబట్టి. అలా కాకుండా హత్యచేశాడనుకుందాం. ఈహత్యకి భర్త ఎంతవరకు బాధ్యుడు? అతనికి తాను హత్యచేస్తున్నట్లు తెలియదు. ముందు పన్నాగం లేదు. అతన్ని ఎలా దండించడం ?"

"అప్పుడు భర్తకి నిద్రలో నడిచే అల

(17-వ పేజీ చూడుడు)

నవల :



౨

అక్కడి కష్టాలే కోలనిరుద్రుడు పంపిన విజయవార్త వచ్చియుండెను. వ్యాకరణ బ్రహ్మ సేనల మొదటిధాటికే కాళింగసేనలు విచ్చిపారినవి. వారితో నున్న మురారిదేవుడు మాత్రము సాహసించి మార్కొని తల గోల్పోయినాడు. ఆంధ్ర సేనలు కళింగసేనలను సింహాద్రిదాటి నాలుగుయోజనముల మేర తరిమివేసినవి. శీఘ్రముగా శ్రీ రుద్రదేవమహారాజుల దర్శనమునకు విజయోత్సాహముతో కోలనిరుద్రుడు వచ్చుచున్నాడు!

ఆ వార్త వినగానే రుద్రమకు బ్రహ్మానంద మైనది. అది తిక్కన సోమయాజుల యాశీర్వచనమునకు సద్యఃఫలముగా నామెకు భాసించినది. అట్టి పూజ్యుల వాక్కు లమోఘములు!

రుద్రమ్మ యొక్క క్షణకాలము ధ్యానించెను. ఆవల మహారాష్ట్రసేనలు, "జయ హరిహరదేవరాయ!" అని చేయుచున్న జయజయనినాదము లామె చెవుల బడెను. "ఈ కలహ మేల? ఈ జననాశన మేల? ఇది కులకలహము! జ్ఞాతికలహము! రాజ్యలోభముచే దాపురించిన కలహము!"

అంతలో ఆమెకు తిక్కన సోమయాజుల మూర్తి మనోవీధిలో భాసించినది. కురుపాండవసమరసమయమున వ్యాస భగవానులు నిర్లిప్తుడై దాని నాలోకించుచుండెను గదా! నేడు తిక్కన సోమయాజులు తాము వ్రాసిన ఆంధ్రమహాభారత భాగము వినిపించిరి. "అది వా రీనాడే వ్రాసినారట! ఈ మహా యుద్ధ సమయమున వారికి మనస్థితి యెట్లు కల్గినదో! వ్యాసభగవానుల యంశ తప్పక తిక్కనసోమయాజులలో నున్నది!"

అంతలో రుద్రమ్మకు తిక్కనసోమయాజులు వినిపించిన చివరి వాక్యము జ్ఞప్తికి తగిలినది!

"తగనేవి పొగడొందిన రాజున కుర్వి కామధేనువ కాదే!"

"కామధేనువ! ఈ యుర్వి కామధేనువ కాదా నాకు?" ఇట్లామె ధ్యానించుచుండగా వ్యాసభగవానుడే తిక్కన సోమయాజుల రూపమున తన్నా నాడు ఆశీర్వదించినట్లు స్ఫురించినది.

"నాకు ఉర్వి కామధేను వగుటకు ఆరంభించినది!" ఇట్లనుకొనుచు కోలనిరుద్రుని విజయవార్తను మహారాజు తిక్కన సోమయాజులకు ముందు తెలియజేసి, ఆవెంటనే ప్రాసాదాంతర్భాగమునను కోటగోడలపైనను చాటింప బంపెను.

ఆంధ్రగానికులు బ్రాహ్మణయోధులయు వీరశైవయోధులయు సహాయముతో నిప్పటికి రెండు దినములుగా రాజప్రాసాదమును రక్షించుచున్నారు. దాని గోడ లున్నతమైనవే కాని బలిష్ఠమైనవి కావు. అవి మధ్య ఇటుకరాతితో కట్టబడినవి. అవి వర్షములకు కారిపోకుండుటకై రెండువైపులను రాతిపలక లమరించినారు. ఆ యిటుకలు మిక్కిలి గట్టివే కాని తేలికవి. బరువుండవు. నీటిలో వేసిన నవి మునుగక తేలును. కాకతీయ శిల్పులు ఆ యిటుకగోడల నిర్మాణమున నెంతయో నేర్పు చూపించిరి. కాని యవి మహాయుద్ధమును ఓర్చు నుద్దేశముతో నిర్మించినవి కావు. రాజప్రాసాదమునకు సామాన్యరక్ష చేయుటకే అవి ఉద్దిష్టమైనవి. ఆ గోడల నాశ్రయించి యిప్పుడు మహారణము చేయవలసి వచ్చినది! దానిలోపల నున్న యవకాశము స్వల్పము. ఆ కొద్దితావులో నింత పెద్ద జనసమూహ ముండుట మిక్కిలి కష్టముగా నున్నది. పుష్కలముగా నాహారము జలము ఉన్నవి. కాని మరి రెండునా ళ్ళట్లే యున్నచో మహామారివంటి యంటు వ్యాధి యేదో పుట్టుట నిశ్చయము! క్షణక్షణము సైనికుల ధైర్యము దిగజారిపోవుచున్నది. ఆ సమయమున కోలనిరుద్రుని యీ విజయఘోష వారల కొక ధైర్యము కలిగించెను. ఆశాకిరణ మంకురించినది.

మరునాటి యుదయమున మహారాష్ట్రవీరులు విపరీతమైన సాహసము చేసి ప్రాసాదకుడ్యములపై కెగబ్రాకుచుండిరి. వారు హరిహరదేవుని ఆంధ్రసామ్రాజ్యమునకు పట్టము కట్టినవారివలెనే "జయ, హరిహరదేవరాజ, జయ!" అని యుద్ఘోషించుచున్నారు. వారి ఏనుగులయు నిడుమూలములయు తాపులు భీమముగా ప్రాసాద కుడ్యములను కంపింప జేయుచున్నవి. ప్రతితాపుతోపాటు హరిహరదేవరాజుకు జయఘోషయు మిన్నుమిట్టుచున్నది. హరిహరదేవుడే యీ పోరు నడిపించుచుండబోలును!

ఆ తాపులు ముఖ్యముగా ప్రాసాదమున నంతఃపుర ముండు వైపున తీవ్రతరమైనవి. అక్కడనే హరిహరుని జయశబ్దములును అతిశయించినవి. అచ్చట ప్రాసాదముగోడలు భగ్నమగుటకు ముందు బీటలువారినవి. అంతలో నవి సడలిపోవ ప్రారంభించినవి. మహారాష్ట్ర సైనికులు ఆ సందులలోనుండి లోనికి రానాగిరి.

కామసాని యది ముందుగనే నిర్లక్షించినది. వెంటనే అది ప్రతాపరుద్రకుమారుని కుబ్జ కప్పగించి కొద్ది పరివారముతో నేలలో నున్న యొక సొరంగము మార్గముగుండ కోట దాటించు నేర్పాటు

చేసినది. ఆ పని చేసినవెంటనే, అది యంతఃపురపరివారమును మార్చుకొని, అప్పటికే అటువైపు వచ్చుచున్న మహారాష్ట్రసైనికుల నెదిరించెను.

కామసాని ఎనుబదేళ్ళ వృద్ధురాలు. వంగిపోయిన నడుమును ప్రయత్నపూర్వకముగా నది నిలువబెట్టుకొనుచున్నది వడకుచున్న చేతుల నది దృఢము చేసికొనుచున్నది. ఎడమచేతితో డాలు పట్టినది. కుడిచేతితో ఖడ్గము ధరించినది. దానివెంట నున్న పరివారములో కొద్దిమంది స్త్రీలు, మిగిలినవారు పేడులగు విదల్లులు! వారిని మహారాష్ట్రసైనికులు 'జయ హరిహరదేవరాయ, జయ!' అనుచు భయంకరముగా దాకిరి.

ఆ జయనాదము చెవుల బడగానే రోషముతో కామసాని ఆపాదమస్తకము కంపించెను. దానికి ఆవేశము ఆగలేదు. అట్లు జయనాదము చేయుచున్న మొదటివానిని అది తన ఖడ్గపు కొనతో పొడిచివేసెను; రెండవవాని తల తెగవేసెను; మూడవవాని జయనాదము పూర్తి కాకుండనే దక్షిణబాహువు నరికివేసెను చిరకాలముగా దానికి ఖడ్గవిద్య యభ్యస్తమయినందున, బలహీనమై వడకుచున్న దాని చేతులలోగూడ నా ఖడ్గము అప్రయత్నముగా బోలె విలాసముగా పరిభ్రమించుచున్నది. ఆ సమీపముననే సేల సారంగ మున్నదని యెరిగినవారే యట్లు వచ్చుచున్నట్లు దానికి తోచినది. ఇందులో హరిహరుడే ఉండవచ్చును. కాని కవచాచ్ఛాదితులై శిరస్త్రాణములు ధరించినవారిని గుర్తించు టెట్లు?

అంతలో కామసానికి హరిహరుడే ఎదురయ్యెను. అతని ముఖము కనబడకున్న నేమి? అతని ఉనికి, నడక దానికి చిరపరిచితమే! కామసాని క్రోధమూర్తియై 'ఓరీ, పాపి!' యనుచు నాతనిపై విజృంభించెను

కాని దాని మనస్సులో నున్న శక్తి దేహములో లేదు. అప్పటికే అది తూలుచున్నది కన్నులు మూసికొని పోవుచున్నవి. చమురయిపోయిన దీపశిఖవలె నున్నది దాని స్థితి! స్వయముగా హరిహరరాయల నది ఎదుర్కొని పోరాడగలదా? అతని మొదటి వేటుకు దాని ఖడ్గము దూరముగా పడిపోయినది; రెండవ వేటు దాని హృదయములో దిగబడినది ఆ యంతఃపురరక్షణకు ముందు ప్రాణ మర్పించినది కామసాని! ఆ వృద్ధురాలి ప్రాణములు హరించుటను మహా వీరకార్యముతో హరిహరదేవుడు రాజమందిరములో నడుగు బెట్టెను!

అంతఃపురరక్షకులకును అతడు హరిహరు డని తెలిసిపోయినది. సారంగమును సమీపించుటకే వా రట్లు కలియుచున్నా రని వా రూహించిరి. మధ్య నింకను రెండు ద్వారము లడ్డమున్నవి. వా రా రెండును దాటి ముందుకు వచ్చి వచ్చుచున్న వీరులతో తలపడిరి.

వారు స్త్రీలును పేడులనే గాని మహాభయంకరులు! అందును ఆ పేడులు జాలి తెలియనివారు. ఐన నేమి? హరిహరునివెంట మహారాష్ట్రసేనలు క్షణక్షణము ఎక్కువైపోయి లోనికి జొరబడుచున్నవి. వారిని నిలువరించుట యచ్చటి రక్షకులకు సాధ్యమగుట లేదు!

ఆ క్రిందటిరాత్రియే అన్నమంత్రి ప్రాకారసంచారముతో ఆవైపుగోడ బలహీనస్థితిలో నున్నదని నిర్ణయించి యుండెను. ఆ భాగము ఎప్పుడు విచ్చిపోయిన నాక్షణమే అటు కదలుటకు ఐదు వందలమంది బ్రాహ్మణవీరులను ఆదేశించి సిద్ధముగా నుంచెను. వారిలో నొక వందమందికి గోవిందశర్మ నాయకుడు! ఆ యువకవి యా యుద్ధములో మిగుల నేర్పు కనబరచుచు, అన్నమంత్రి మెప్పు వడయుచుండెను.

అన్నమంత్రి పార్శ్వరక్షకు లగు ఇద్దరు బాలవీరులలో పెద్దవాడు గోవిందశర్మతో పరిహాసకము లాడుచుండును:

"గోవిందశర్మా, మీ వాక్కు కవిత్వములో ప్రసరించెడు కంటె, మీ బాహువులు రణరంగములో నేర్పుగా ప్రసరింపగలవయ్యా!"

కాని యిప్పుడు పరిహాసమాడు సమయము కాదు. ఆ ఐదు వందలమంది బ్రాహ్మణవీరుల కగ్రేసరుడై ఇప్పుడు స్వయముగా అన్నమంత్రీశ్వరుడే వచ్చినాడు! ఈ బ్రాహ్మణవీరుల రాకతో మహారాష్ట్రవీరుల విజృంభణము కొంచెము వెనుకపట్టినది

హరిహరదేవుడు అన్నమంత్రిని, అన్నమంత్రి హరిహరదేవుని గుర్తించినట్లున్నారు! వా రుభయులును ఒకరితో నొకరు తలపడినారు! తేజశ్శాలు రగు వారు పోరుచుండ మిగిలినవారు మంత్రముగ్ధులవలె ఒకటి రెండు నిమేషములపాటు రిచ్చవడి నిశ్చేష్టులై వారి యుద్ధము చూచుచు కన్ను లప్పగించి నిలిచిరి

వారు తలపడినదాది హరిహరుడు అన్నమంత్రీశ్వరుని జంపివేయుటకే ఉంకించుచుండెన. అన్నమంత్రి యాత్మరక్షణ చేసికొనుచు హరిహరుని నిరాయుధుని జేయుటకే యత్నించుచుండెను. కాని ఎంత ప్రయత్నించినను అన్నమంత్రి కది సాధ్యము కాకుండెను హరిహరుని విజృంభణమును ఎక్కువయినది. ఎన్నియోమారులు అన్నమంత్రి హృదయభాగము అరక్షితమై యున్నట్లు చూపరకు తోచుచుండెను

ఈమారు స్పష్టముగా అన్నమంత్రీశ్వరుల విశాలవక్షస్స్థలము అనాచ్ఛాదితముగా నున్నది. మెరపు మెరసినట్లు బలమైన ఘాతముతో హరిహరుని ఖడ్గ మావైపుకు వచ్చుచున్నది. అన్నమంత్రి హరిహరునిచేతిలో హతము కానున్న ట్లున్నాడు అది చూడలేక బ్రాహ్మణవీరు లందరు హాహాకారము లొనర్చుచు కన్నులు మూసికొనిరి. ఏకకాలమున రెండు శబ్దములు దిక్కులను చీల్చియే వేసెను! ఆ రెండుశబ్దములును చీల్చు శబ్దములే!

హరిహరుని ఖడ్గము అన్నమంత్రి హృదయమున స్పృశించుటకు ముందుగనే ఆతని చర్మ మడ్డు తగిలినది. బలముతో విసరిన హరిహరుని వేటుకు ఆతని ఖడ్గము అన్నమంత్రి పలకలో దిగబడినది అది యాతడు వెనుకకు లాగివేయు నవకాశములోపలనే అన్నమంత్రి ఖడ్గము హరిహరదేవుని కంఠమును తెగవేసెను! హరిహరదేవుని శిరస్సు త్రెస్సి, పడిపోయియున్న కామసాని పాదములముందు పడి, రక్తధారలతో నభిషేక మొనర్చెను!

ఇది యంతయు ఒక రెప్పపాటుకాలములో జరిగిపోయినది. ఆ సైని రెండు బలములు తారసిల్లినవి. హరిహరుని పార్శ్వరక్షకు లిద్దరు అన్నమంత్రిపై కవిసిరి. ఇప్పు డన్నమంత్రి యలసినట్లున్నాడు. ఆ బడలిక యాతని శరీరమునకంటె మనస్సు నావేశించిన ట్లున్నది. శ్రీ రుద్రదేవమహారాజుల యభిషేకమునకు పూర్వము, కాకతీయసామ్రాజ్యమునకు చక్రవర్తి యగునని అందరు తలంచుచుండిన ఆ హరిహరదేవుడు, తన చేతులతో నిట్లు తల తరుగబడి పడియుండుట చూడ, నెవరికి జంకు కలుగదు! ఆ జంకుతోపాటు అన్నమంత్రి కుత్సాహమును కలిగినది!

అన్నమంత్రి మనస్సులో నా క్షణమున గలిగిన యాందోళనతో హరిహరుని పార్శ్వరక్షకుల ఖడ్గములకు తన ప్రాణము లర్పించి యుండెడివాడే! కాని యాతని పార్శ్వరక్షకు లగు బాలవీరు లిద్దరును వారిని నరకివేసి అన్నమంత్రి ప్రాణము లా క్షణమున గాపాడిరి.

అన్నమంత్రిమనస్సు మరుక్షణముననే కుదుటబడెను. ప్రాకారములోనికి జొరబారిన మహారాష్ట్రవీరులపైకి తన వెంట నున్న బ్రాహ్మణవీరులను పురికొల్పుచు నాతడు విజృంభించెను. ఆ బ్రాహ్మణవీరులును యుద్ధమునకు అపరిచితులైనను సుశిక్షితులవలెనే ప్రవర్తించుట అన్నమంత్రికే యాశ్చర్య మొదవించుచుండెను.

ఇది యిట్లు జరుగుచుండ నావల ఒక మందిరములో గౌరమ్మ తన యిద్దరు కోడండ్రతోడను మనుమరాలగు బాలతోడను ప్రసంగించుచున్నది. వారికి రాజప్రాసాదములోనికి శత్రువీరులు ప్రవేశించినవార్త యింకను తెలియదు. ఆ గదిలోనికి ఆయుధపాణు లగు మహారాష్ట్రభటు లిరువురు ప్రవేశించిరి. అది చూచి యంతఃపురములోనికి పరపురుషులు ప్రవేశించి రను భావముతో, గౌరమ్మ వారిపై కోపముతో నిప్పులు కురియు దృష్టితో చూచుచు, 'ఎవరురా యది?' యని యడిగెను. ఆమె ధీరగర్జన కా భటు లిరువురు నులిక్కిపడి ఒక్క యడుగు వెనుకకు వేసిరి. వారు తెప్పిరిలి ముందుకు సాగుచుండగా గోవిందశర్మ వారి నిద్దరను తనచేత నున్న శూలముతో గోడకు గ్రుచ్చివేసెను. అతని వెంటనున్న బ్రాహ్మణభటులు ఆ కళేబరముల నావలికి త్రోసివేసిరి. కవాటము బంధించి యప్రమత్తులుగా నుండు'డని యచ్చటివారిని నిర్దేశించి గోవిందశర్మ ఐదుగురు భటులను బయట కాపుంచి వెడలిపోయెను.

అంతఃపురమువైపున విచ్చిన ప్రాకారకుడ్యముగుండ ప్రవేశించిన మహారాష్ట్రులతో, ఆ బ్రాహ్మణవీరులు మధ్యాహ్నము వరకు పోరినపిమ్మట, నంతవరకు లోనికి ప్రవేశించినవారి నందర వారు వధించి యామార్గము నిరోధింపగలిగినారు.

కాని ప్రాణములేని రాతిగోడ చేయవలసిన నిరోధము, ప్రాణులగు మనుష్యులతో పెట్టినగోడ ఎంతసేపు చేయగలదు? అక్కడ సందు కలిగినదని తెలియగనే, మహారాష్ట్రసేనాప్రవాహ మావైపునకే మరలినది. వెంటనే అన్నమంత్రియు శూలధారులగు నారువేలమంది బ్రాహ్మణవీరులను అంతఃపురరక్షణకై యక్కడ జీవత్కుడ్యముగా జేసి కాపుగా నుండ నియోగించెను.

మూడు జాములైనది! ఏమి కారణమోగాని, చిత్రముగా, మహారాష్ట్రసేనల యౌద్ధత్యము తగ్గిపోయినది. అది చూడ నగరనాయకులకే యాశ్చర్యమైనది. నగరరక్షణమునకై ఈ నాడెంతో బ్రాహ్మణరక్తము చిందినది. ఆ రక్తబిందువులనుండి శత్రుబాధకము లగు నమానుషశక్తు లేవైన నుద్భవించి మహారాష్ట్రసేనల నావల మార్కొనుచున్నవా? ముందున్న సేనలు ముందున్నవి; కాని వెనుకనుండి మహారాష్ట్రసేనలు ముందుకు వచ్చుటలేదు!

సాయంత్ర మగుచున్నది! ఈ రాత్రి రాజప్రాసాదమును శత్రువుల యొత్తిడినుండి రక్షించుట దుస్తరమని నగరనాయకులు నిశ్చయించిరి. ఎవ రెవరిని ఏ యే రహస్యమార్గముల సురక్షిత ప్రదేశములకు చేరవేయుటో, ఎవ రెవరు తుదివరకు నిలిచి పోరాడుటో నిశ్చయమైనది. శ్రీ రుద్రదేవమహారాజులు ఎంత చెప్పినను వినక, తన నగరనాయకులతోపాటు చివరవరకు పోరాడువారిలో నుండుటకే నిశ్చయించిరి. వారు ఆత్మరక్షణకై పారిపోవుట కిచ్చగింపలేదు. అపాయ మెక్కువగుచున్న కొలదియు వారి వీరోత్సాహమును ఎక్కువగుచున్నది!

సాయంత్ర మయినది. మహారాష్ట్రసేనలు వెనుకకే తగ్గుచున్నవి! ఏమి యీ మాయ? కనుకట్టుగా నున్నదే!

రాత్రి జాము ప్రొద్దుపోయినది! మహారాష్ట్రసేనలు శిలాప్రాకారము వెనుకకు పోయినవి. రాజప్రాసాదమునకును శిలాప్రాకారమునకును నడుమ నొక్క యాదవ వీరుడును లేడు! ఏమిది!

అర్ధరాత్ర మైనది! మహారాష్ట్రసేనలు పుట్టకోట బయటికి చేరినవి. ఏమి యీ యద్భుతము! కోటలోనివారిని ప్రలోభపెట్టి బయటికి రానిచ్చి ఒక్కసారి విజృంచుటకు ఎత్తిన పన్నుగడయా?

తెల్లవారినది. మహారాష్ట్రసేనలు తమ స్కంధావారము నంతయు నెత్తివేసి పలాయనోన్ముఖముగా నున్నవి!

ఏమిది? తెల్లవారువరకును కోటలోనివారికి కారణము తెలియదు. రెండు మూడు దినములనుండి బయటినుండి యే వార్తయు రాకుండ శత్రువులు నిరోధించియుండిరి. తమ్ము ముట్టడించిన సేనలు నిష్కారణముగా నింత యాకస్మికముగా వెనుదీయుచుండుట, కోటలోనివారికి మోసమనియే తోచెను. ఆ యూహతో రాజప్రాసాదము నెవ్వరును విడిచిపోరా దని మహారాజు లాజ్ఞాపించిరి. గూఢచారులు మాత్రము రహస్యమార్గముల నిజమారయ బయలువెడలిరి.

తెల్లవారునప్పటికి చారులు నిజవార్త తెచ్చిరి! "మనము రక్షింపబడితిమి!"

ఆ మాటలు రాజప్రాసాదమున నల్గడల ప్రతిధ్వనించెను. పాలిపోయినవారల ముఖములలో నెత్తురు చిమ్మినది! "రక్షింపబడితిమి! రక్షింపబడితిమి!"

ఎట్లు?

ఆవల తిక్కచమూపతియు గోనగన్నారెడ్డియు తమ యాశ్వికబలములతో రెండువైపులనుండి మహారాష్ట్ర సైనికస్కంధావారమును తాకి చెండాడుచున్నారు. రాత్రియంతయు భయంకరముగా యుద్ధము సాగినది. తెల్లవారునప్పటికి వారి పదాతిబలములును కలసికొనగలవు! అంబదేవుడును కొంతసేనను పంపినాడు. అదియును సమీపించినది!

ఆనాటి సూర్యోదయముతోపాటు ఏకశిలానగరమున స్థైర్యసూర్యోదయ మయ్యెను. వార్తలు ధ్రువపడినవి. ఆ వెంటనే శూలధారు లగు నారువేల బ్రాహ్మణయోధుల కగ్రేసరుడై అన్నమంత్రి నగరద్వారములు వెలువడి మహారాష్ట్రసేనలను తాకెను. మూలబలముతో రుద్రమయు నాతనివెంట తోడుగా సాగినది.

వా రుభయులకును వీరశైవబలము అండగా మహోత్సాహముతో బయలుదేరినది!

కథానికః

చేసినపాపం

శ్రీ మంత్రిప్రగడ వెంకటరమణ

"ఇదుగో షావుకారూ, మర్యాదగా చెప్తున్నా, నా మాటిను. ఇదుగో నీ సొమ్ము. నాసరుకిచ్చేయి." అన్నాడు, అచ్చెన్న పొంగుతున్న ఆవేశాన్ని అదుముకుంటూ.

"ఏమిట్రోయ్ నీగోల? నీకొక్కడూ చెప్తా ఏఁరుకు? అవతలకు పోతావా? బుద్ధి చెప్పాలా?

"ఐతే ఇక మాటల్తో కుదరదన్నమాట"

"చూస్తా వేరా పోతన్నా?" అన్నాడు కళ్ళెర్రజేస్తూ తన బంట్రోత్తో.

అసలే కోపంతో మండిపడుతూన్న అచ్చెన్న, సాహుకారుమాట వినడం తడవుగా, ఉరికిపడ్డాడు కొట్లోకి. సాహుకారు ముందున్న బంగారాన్ని కాస్తా చేజిక్కించుకున్న అచ్చెన్న పారిపోదామనుకున్నాడు. కాని క్షణంలో పోలీసుల చేతిలో అచ్చెన్న ఖైదీ అయ్యాడు.

సూర్యాస్తమానం కావచ్చింది. ఖైదీలంతా భోజనాలు ముగించుకుని, పక్షుల్లా గూళ్ళల్లో చేరుకుంటున్నారు. అచ్చెన్నకు మాత్రం భోజనం సహించలేదు. గదిలోకి ప్రవేశించాడు. ఎందుకో ఆందోళన ప్రారంభమయింది. అంతవరకూ పహారా ఇచ్చినవారు డ్రస్సులు మార్చుకుని ఇళ్లకు పోతున్నారు. క్రొత్తగా డ్యూటీకి వచ్చినవారు దుస్తులు ధరించుకున్నారు. అప్పుడే 8 దికొట్టారు. అంతా నిశ్శబ్దంగా ఉంది. క్రమంగా ఖైదీలంతా నిద్రా దేవతకు వశులై విశ్రమించుతున్నారు. ఒకటి తరువాత ఒకటి గంటలు గడచిపోతున్నాయి. అచ్చెన్నకు మాత్రం నిద్రపట్టలేదు. అతని మనోసాగరంలో ఆలోచన తరంగాలు చెలరేగిపోయాయి. ఆ గదిలో ఇంకా ఖైదీలున్నారు. కాని అంతానిద్రాదేవత ఒడిలో సుఖంగా విశ్రమించుతూ, ఈ ప్రపంచాన్నే మరచిపోయారు. రాత్రి సుమారు పన్నెండయింది. ఇంతలో మరోఖైదీ లేచి ప్రక్కనున్న మట్టి మూకుడులో మూత్రవిసర్జన చేస్తున్నాడు. అదిచూచి "ఛీ, ఛీ అదేటయ్యా ఆ పని" అన్నాడు అచ్చెన్న. అచ్చెన్న అమాయకత్వానికి చాల జాలి కలిగిందతనికి.

"ఇంకా నిద్రపోలేదేం? ఇంతరాత్రయింది?"

అచ్చెన్నకు ఆ మాటే వినబడినట్లు లేదు. అతడు మళ్ళీ తన ఆలోచన్లో మునిగిపోయాడు.

అతని అవస్థ చూచిన ఖైదీకి మనస్సు ఉండబట్టలేదు.

"ఏం జేసినావయ్యా, ఈగతి పట్టింది నీకు?" అన్నాడు. ఆ స్వరంలో మిళితమై యున్న సానుభూతికి అతనిపయిన అచ్చన్నకు గౌరవం ఏర్పడింది. అంత ఆప్యాయంగా ఇతరులు తన్ను పలుకరించడం, ఎరుగడు.

"బాబూ, నువ్వన్నా సుఖంగా నిద్రపో, నాకథంటే నువ్వు కూడా బాధపడతావు."

"అలా అనకు, అందరం కట్టాల్లో ఉన్నోళ్ళమే. మనక్కలిగిన కట్టం ఇంకోళ్లతో చెప్పుకుంటే కొంతన్నా బాధ తగ్గుద్ది' నేనూ నీలాగ బాధల్లో మునిగినోణ్ణే.

"ఐతే ఇను. నేను మిల్లులో కూలోణ్ణి. ఓరోజు ఆమిల్లులో ఒకకూలోడు పడిపోయినాడు. ఆడికాళ్ళు సెక్రంకిందడి తెగిపోయినయి. కూలోళ్ళందరం కలసి, ఆడికి వైద్యం సేయించాలని, బతికున్నంతకాలం నెల కిరవై రూపాయలు ఇత్తుండాలని యాజమాన్ని కోరాం. అతగా డిన్లేదు. ఇరవై రూపాయిలుమాత్రం ఇయ్యబోయినాడు. మేమంతా పనికట్టిపెట్టేసి కూకున్నాం. కంట్రాక్టరు సరుకు సప్లయికాలేదని మిల్లు యజమానిమీద నట్టానికి దావా తెత్తానని గొడవసేత్తానని బెదిరించాడు. దాంతో యజమానికి కంగారుచ్చుకుంది. కొత్తోళ్ళ నెట్టుకున్నాడు. నౌకరీ పోయినోళ్ళలో నేనొకణ్ణి.

"అయ్యో, పాపం."

"ఇంకేటుంది? ఎక్కడికెళ్ళినా ఎవుడూ నౌకరి ఇయ్యడే! మిల్లోళ్ళంతా ఒకటే కదంటయ్యా."

"మరి కాలం ఎలా...

"మరి కాలం ఏటి? ఉన్నకాడికి అమ్మి బెట్టేసి తినేసినాం. కరువులో అధికమాసం అన్నట్లు మాయాడోళ్లు నీళ్ళోసుకున్నారు. తిండి సాలక జబ్బుచేసింది. పేదోళ్ళకేసి డాక్టర్లు సూత్తారా? ఇటుసూత్తే పత్తులు—అటు జబ్బు. ఇంక పాలెలాగుంటాయి సెప్పు— ఇక కుర్రోడి గోలకి సుట్టుపక్కలోళ్ల తలోమాట. ఉపకారం సేసినోళ్ళు ఒకరూ లేరు. మరేటనుకుందో మాయాడది...

"ఏం నాయనా - అలా కంటనీరెట్టుకుంటున్నావ్?"

"ఏముంది బాబా. నూతిలోకి గంతేసింది. ఆ సప్పుడిని మా బావమరిది సటాల్ని తీద్దాంగదా అని ఆడూ నూతిలోనికి గంతేసినాడు. మరాడి తలకి ఏటి' తగిలిందోగాని మా గొప్ప గాయం తగిలింది. ఇద్దరూ అందలే పాణం...

"పోన్లే నాయినా.. నీకంత బాధగా ఉంటే"..

"ఇంక బాధేటి బాబా..ఒకటే బాధ"

"అయ్యో - ఎంత పాపమయ్యా" మరి నువ్వన్నా..

"నన్నేటి సెయ్యమన్నావు బాబా? అటు సంటోడికి పాలు లేవు. ఇటు బాలింతరాలికి తిండి లేదు. ఏదో రెండునూకలు తెద్దారి గదా అని ఊళ్లోకి పోయాను. కాని నాకు ముక్తైత్తటం తెలిసి సత్తై గా—కనబడినోళ్ళనల్లా అడిగేద్దారని దగ్గిరి కెళ్లేవోణ్ణి - తీరా దగ్గిరికెళ్ళేప్పటికి బడియా మేసేది.

"సంటి పిల్లాణ్ణి ఏం జేశావు?"

"మా సెల్లెలు మాకాడే ఉంది. అదే?"

"అయితే జైలు గతి ఎలా పట్టిందీ... అన్నాడు చుట్టందిస్తూ.

"బాబా ఇది మాత్రం అడక్కు.?

"ఎర్రోడా! నేనూ జెయిల్లోనే ఉన్నానా?"

"ఔను అయితే చేసినపాపం చెప్పే పోద్దంటారు పెద్దలు. మొన్న ఏటతోచక, పోనీ ఏదన్నా కూలిపని దొరుకుద్దేమో అని యీధిలోకి పోయాను. దమ్మిడీ కూలి దొరకలేదు. అలాగొత్తుంటే ఓ సంటి కుర్రోడు యీధిల కుంకున్నాడు. అణ్ణిసూసి ఎత్తుకున్నాను. ఎవరూ కనబడలేదు. రెండడుగులుముందు కేసినాను ఆడిమెళ్ళో బంగారు గొలుసుంది బాబా నీకు సెప్పకేం అది సూడ్డంతోటే మనసు సెదిరింది. మెల్లగా అదికాస్త తీసేశాను.

"ఆఁ!" అన్నాడు ఖైదీ ఆశ్చర్యంతో.

"ఆ కుర్రాణ్ణి భద్రంగా దింపేసి బజాట్లో కెళ్ళి షావుకారుకు అమ్మసూపాను. ఆడు నాకేసిసూసి పదిరూపాయిలు సేతిలెట్టి ఎల్లమన్నాడు. "అనేటయ్యా తూసి, ధరకట్టమన్నాను. "వెళ్ళవోయ్ గొడవచెయ్యకు" అన్నాడు" ఆఁ-యీడు మనసంగతి కనిపెట్టేడ్రా అనుకుని అందినకాటికి దక్కుడనుకొని ఇంటికి బయల్దేరాను.

"ఎంతపని చేశావయ్యా - పాపం ఏం జేస్తావు- లేమి ఎంతపనైనా చేయిస్తది".

"బాబా రూపాయిలందుకున్నానేమో, ఇక ఆలోచనేటి? బజారంతా కొనెయ్యాలనుకున్నాననుకో, మా సెల్లికి కోక. నాకు పంచగుడ్డ - మా కుర్రోడికి పాలబుడ్డి-అన్నీ బేరమాడేశాను. అయితే ఏవీ కొనలేదులే. మన కెందుకీ బాధ ఆ రూపాయలు సెల్లికిత్తే అదే సూసుకుంటదనుకుని తిన్నగింటికి పోయాను. గడపల అడుగెట్టాను. సూద్దునుగదా అంతా సెత్తురే. ఒళ్ళు జల్లుమంది. మా మేనకోడలు కుర్రది "అమ్మ ఆచుపత్రిలి కెల్లింది" అంది. అన్నా! కుర్రోడికేటో అయిపోయిందనుకొని అలాగే పరుగెత్తాను-

"ఏటయింది కుర్రోడికి"

"మా కుర్రోడు మా సెల్లెలు సంకలో ఉన్నాడు-పక్కనే మంచం. దానిమీద ఇంకో కుర్రోడు. అప్పుడే కట్లు కట్టారు, ఏటయిందని కంగారుగా మా కుర్రోడు ఒళ్ళు తడుముతుంటే "అన్నే మన కుర్రోడుకేటీ అవలేదన్నాది. అదిగో సూడు" అంటూ మంచం మీద కుర్రోణ్ణి సూపించి పాపం ఎవరి కుర్రోడో? ఆ తల్లి ఎలాఒదలేసిందోగాని, మన యీధిల ఏడుత్తా ఒక్కడూ నడుత్తా ఉంటే దూడ తొక్కేసింది పాపం అంది. మరికాస్త దగ్గర కెల్లి సూశానుగదా! బాబా నా ఒళ్ళు పట్లు తప్పిపోయింది.

"ఏఁ"

"ఆ కుర్రోడు నేనెత్తుకున్న కుర్రోడే!

"అన్నన్న! ఆఁ!"

"నాకు మరేటీ తోచలేదు. ఛీ ఎదవపని సేశాన్రా అనుకున్నా. ఎంటనే ఆ షావుకారు కొట్టుకెళ్ళా". . అంటూఇంకా ఏదో చెప్పబోతున్నాడు జెయిలు తలుపులు తెరుచుకున్నాయి "లెండి పదండి" అంటూ వార్డర్లు బయటకు రమ్మన్నారు. అంతా సందడి

"ఓహో తెల్లారిపోయిందయ్యో" అన్నారు ఇద్దరూ ఒక్కసారే.

"గుడ్ మార్నింగ్ డాక్టర్!" అంటూ మూర్తి "మా అబ్బాయికి ప్రాణదానం చేశారు" అన్నాడు కృతజ్ఞత తెలుపుతూ.

"క్షమించాలిమూర్తిగారూ, ప్రాణాదానం చేసింది నేను కాదు. సమయం మించిపోకుండా మీ అబ్బాయిని ఆస్పత్రికి చేర్చిన ఆ స్త్రీకే చెందుతుంది, యీ గౌరవం."

డాక్టరు అన్నమాటకు మూర్తి భార్యకు పట్టరాని కోపం వచ్చింది. అసలాముండ అన్నేగా ఇంతమట్టుకు తెచ్చిపెట్టింది. అంది భర్తవంక చూస్తూ.

"సెలవు"అంటూ కారెక్కాడుడాక్టరు.

"నువ్వన్నది నిజమే. కాని అన్న తాను చేసిన అపరాధానికి ఆరు మాసాల శిక్ష పొందాడుగా"

"ఆ వెధవకు నన్నడుగుతే ఆ శిక్షచాలదు

"మరి వాడి చెల్లెలు నీబిడ్డ ప్రాణం కాపాడిండికదు? పద పాపం ఒక్కసారి చూచి వద్దాం" అంటూ ఇద్దరూ ప్రయాణమయ్యారు

మూర్తి భార్యతో సహా అచ్చెన్న ఇంటికి చేరారు. తెంపులేనిజనం. అందరి మొహాలు కళాహీనం అయివున్నాయి. మధ్యఅచ్చెన్న చెల్లెలు ఆ ప్రక్కన ఒక చంటిబిడ్డడు. ఆరు సం॥రముల బాలిక. ఈ ప్రపంచాన్నే విడచి ధరిత్రిపై సుఖనిద్రను పొందుతున్నారు.

చార్లీచాప్లిన్ ప్రతిభ

ఈ సంవత్సరం మార్చి ఆరంభంలో "డెయిలీ వెరైటీ" అనే హాలీవుడ్ పత్రిక 25 ఏళ్లకు పైబడి సినిమారంగంలో పనిచేసిన 200మంది స్త్రీపురుషులను, గత 50 సంవత్సరాలలో వెలువడిన ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు, నటి, దర్శకుడు, నిర్మాతా ఎవరని ప్రశ్నించగా, వారు చార్లీచాప్లిన్‌ను ఉత్తమనటుడుగా పేర్కొన్నారు


టాకీలు రాకపూర్వమూ, వచ్చినతరువాతా చార్లీచాప్లిన్ నిర్మించిన చిత్రాలు ఇప్పటికికూడా అమెరికాలో అతి విజయవంతంగా నడుస్తున్నాయి చాప్లిన్ తయారు చేసిన "సిటీలైట్స్" అన్న చిత్రం ఇటీవల మళ్లీ విడుదల అయినప్పుడు దాన్ని సమీక్షిస్తూ "టైమ్" పత్రిక "ప్రపంచంలో ఏ ఇతరవ్యక్తిమొహామూ గుర్తించలేనంతమంది చార్లీచాప్లిన్ మొహం గుర్తించగలరు" అన్నది ఇందులో అతిశయోక్తి ఏమీ లేదు అన్ని దేశాలవారూ, జాతులవారూ, సంస్కారాలవారూ, వయసులవారూ, అభిరుచులవారూ చార్లీచాప్లిన్ చిత్రాలు చూసి ఆనందించినట్టుగా ఏ ఇతర సినిమా చిత్రాన్నీ చూసి ఆనందించలేరు సార్వజనీనమైన కళ ఏమిటో చాప్లిన్ అర్థంచేసుకున్నాడని చెప్పవచ్చు ఒక్క విజయవంతమైన చిత్రం తీయటానికి నానాఅగచాట్లూ పడే మన నిర్మాతలు వరసగావిజయపరంపర సాధించిన చాప్లిన్ రహస్యం తెలుసుకోవడానికి ఆత్రపడవచ్చు ఒకవిధంగా ఆ రహస్యం చాప్లిన్‌వ్యక్తిలో ఉన్నది, అందుకనే, దేన్నయినా డబ్బుతో కొనగల హాలీవుడ్ మరొక చాప్లిన్‌ను తయారుచేయలేకపోయింది ;

చాప్లిన్ విలువలు

చాప్లిన్ చిత్రాలలో కొన్ని మూలసూత్రాలు లేకపోలేదు వాటినిగురించి కొంత మనకు తెలుసుకోవడం అసాధ్యం కాదు

చాప్లిన్‌చిత్రాలలో ప్రధానంగా ఉండే రసాలు హాస్యమూ, కరుణా చాప్లిన్ ధరించే పాత్ర—అతని చిత్రాలలోని ప్రధానపాత్ర—దరిద్రుల ప్రతినిధి అయి ఉండికూడా మధ్యతరగతి మనస్తత్వం కలవాడు చాప్లిన్ చిత్రాలకు చెందిన కథలన్నీ ఈ పాత్రదృక్పథంతో రచించబడినవే

చాప్లిన్ సామాన్యంగా తన చిత్రాలలో



విజయావారి "పాతాళభైరవిలో" మాంత్రికుడు (ఎస్. రంగారావు), తోటరాముణ్ణి (ఎన్. టి. రామారావును) పాతాళభైరవి వద్దకు తీసుకుపోతున్నాడు



విజయా వారి "చంద్రహారంలో" నాయికాపాత్ర ధరిస్తున్న జూనియర్ శ్రీరంజని

ధరించే పాత్రకు శ్రమపడటం ఏమీ ఇష్టం లేదు ఆకలి ప్రేరేపిస్తేనే గాని పని చెయ్యడు మామూలు మధ్యతరగతివాడల్లేనే ఈ పాత్ర చెయ్యా కాలూ కదిలించకుండా హాయిగా జీవించాలనీ, మధ్యతరగతి మర్యాదలూ అవీ లోకానికి ప్రదర్శించాలనీ, శాంతియుతమైన స్వర్గం ఒకటి కల్పించుకుని అందులో తన ప్రియురాలితో ఒంటరిగా జీవించాలనీ కలలు కంటాడు ఇతను పోలీసులనూ, బలశాలులనూ తప్పించుకు తిరుగుతాడు; అతని దృష్టిలో అవి తనకు విహితమైన శక్తులు కావు అవకాశం దొరికితే వ్యాపారం—అట్టే పెట్టుబడి లేని వ్యాపారం—చెయ్యటానికి ఈ పాత్రకు అభ్యంతరం లేదు కాని వ్యాపారంలో "నేరం" ఇమిడిఉన్నదని ఇతను స్పష్టంగా గుర్తిస్తాడు ఇది అందరూ సులభంగా గుర్తించగల పాత్ర, అర్థం చేసుకోగల పాత్ర

చార్లీ చాప్లిన్ చిత్రాలలో "మంచి పోలీసులూ," "వంచన లేని వ్యాపారమూ" చూడలేం

"కిడ్" అనే చిత్రంలో చాప్లిన్ ఎవరో వదిలివేసిన పిల్లవాణ్ణి పొరపాటున అంటించుకుని వదిలించుకోలేకపోతాడు ఆ పిల్లవాణ్ణి ఎవరి గడపమీదో వదిలిపెట్టి పోదామనుకుంటూ చాప్లిన్ పోలీసుకంట పడతాడు వెంటనే ద్రోహంచేస్తున్నవాడల్లే పిల్లవాణ్ణి తీసుకుపోయి పెంచుకుంటాడు ఇద్దరి పొట్టా గడవగలందులకు చాప్లిన్ కిటికీలకు అద్దాలు వేసే వ్యాపారం ప్రారంభిస్తాడు మోసం లేకుండా ఈ వ్యాపారం సాగదు చాప్లిన్ పెంపుడు కొడుకు అద్దాలు పగలగొట్టటమూ, చాప్లిన్ కొత్త అద్దాలు వేసి డబ్బు పుచ్చుకోవటమూ సాగు కొంత కాలం వస్తుంది చాప్లిన్కు మాలి

చెయ్యక జరగదు ఇళ్లముందు పడ్డ మంచు ఎత్తిపారెయ్యటానికి పారతో బయలుదేరతాడు ఒక ఇంటి వాకిలిముందు ఎత్తిపారెయ్యటానికి కూలి మాట్లాడుకుంటాడు ఈ ఇంటిముందు మంచు ఎత్తి పారతో భుజం మీదగా పక్క ఇంటిముందు పోస్తాడు పక్క ఇంటివాళ్లుకూడా కూలి ఇచ్చి చాప్లిన్‌ను మంచు ఎత్తిపారెయ్యటానికి నియోగిస్తారు మళ్లీ ఈ ఇంటిముందు మంచు ఎత్తి ఇంకా అవతలగా ఉన్న ఇంటిముందు పోస్తాడు తీరా చూస్తే అది పోలీసుస్టేషనవుతుంది చాప్లిన్ కాలికి బుద్ధి చెబుతాడు మోసం వ్యక్తికి ఎట్లా లాభించేదీ, పేదవాడు మోసంచెయ్యటానికి ఎటువంటి అవాంతరాలు సంఘంలో ఉన్నదీ ఈ చిత్రంలో చాప్లిన్ చూపిస్తాడు

వ్యాపారాన్ని గురించి 1925లో "కిడ్" చిత్రంలో ప్రదర్శించిన అభిప్రాయాలనే చాప్లిన్ 1948 లో "మస్యూవెర్డూ"లో మరింత సమగ్రంగా ప్రదర్శించాడు ఈ చిత్రంలో చాప్లిన్ హాటావ్యాపారస్తుడు ఈ వ్యాపారానికి కావలిసిన మూలధనాన్ని చాప్లిన్ డబ్బున్న స్త్రీలను పెళ్లాడి, హత్య చేసి సంపాదిస్తాడు ఆర్థికకాటకంలో వ్యాపారం పోతుంది అనంతరం ప్రాణమే పోతుంది వెర్డూకు

"సిటీ లైట్స్" చిత్రంలో చాప్లిన్ ఒక ధనికుడి స్నేహం సంపాదిస్తాడు కాని ఆ ధనికుడు తాగిఉన్నప్పుడు తప్ప చాప్లిన్‌తో స్నేహంగా ఉండడు ఇంత ధనికుడి స్నేహితం ఉన్నా చాప్లిన్ తన ప్రియురాలి అంధత్వం నయంచెయ్యటానికి దొంగతనం చేసి జైలుకు పోవలసివస్తుంది

ఒక్క ముక్కలో చెప్పాలంటే చాప్లిన్ చిత్రాలలో ఉన్న విలువలు అనాథప్రజలు సులభంగా గుర్తించేవి ఏ విలువలపై జీవితం నడుస్తున్నదని మధ్యతరగతివారు భావిస్తారో అవి మామూలు మనుష్యులకు అందుబాటులో ఉండేవి కావు వాటి వెనుక ఎంతో దుర్మార్గం ఉన్నది

చాప్లిన్ శిల్పం

చాప్లిన్ చిత్రాలలో వాస్తవికత్వానికి చోటు లేదు అందుచేతనే అవి ఏ నీతినీ నేరుగా బోధించవు అంతమాత్రంచేత వాటిలో జీవితసత్యం లేకపోలేదు ఆ జీవితసత్యాన్ని చాప్లిన్ స్వాప్నికశిల్పంతో పొదుగుతాడు స్వాప్నికజగత్తులో వాస్తవికత ఉండదు అందులో నవ్వూ, ఏడుపూ తప్ప ఇతరభావాలకు అంత ప్రాధాన్యం ఉండదు

చాప్లిన్ తన చిత్రాలలో ఉపయోగించే స్వాప్నికశిల్పానికి ఎన్ని ఉదాహరణలైనా ఇవ్వవచ్చు అతని చిత్రాలలో రక్తపాతం ఉండదు "మాడర్న్ టైమ్స్" చిత్రంలో యంత్రంలో చిక్కుకుపోయిన కార్మికుడికి ఒక్క గాయంకూడా కాదు. రక్తపాతం చూపటానికి మంచి అవకాశం గల "గ్రేట్ డిక్టేటర్" లో గాని, "మస్యూవెర్డూ" లో గాని చాప్లిన్ ఒక్క చుక్క రక్తం చూపడు అతని చిత్రాలలో దారుణసంఘటనలున్నప్పటికీ అవి ప్రత్యక్షంగా చూపబడవు ప్రేక్షకుల ఊహకు వదలబడతాయి । చాప్లిన్ వాస్తవికజగత్తుగురించి చిత్రాలు తీస్తూకూడా ప్రేక్షకులకు వాస్తవికజగత్తును జ్ఞాపకం చెయ్యడానికి జంకుతున్నట్టు కనిపిస్తాడు కాని ఈవిధంగా వాస్తవప్రపంచాన్ని దూరంగా ఉంచడంవల్ల చాప్లిన్ ప్రేక్షకుణ్ణి ఒకవిధమైన అర్థసుషుప్తిలో—మైకంలో—ఉంచగలుగుతాడు



విజయా వారి "పాతాళభైరవి"లో రాజుగారి బావమరిది (రేలంగి)ని తోటరాముడు (ఎన్. టి. రామారావు) సత్కరిస్తున్నాడు

దాగిన ద్వేషం

(8-వ పేజీ తరువాయి)

వాటుందనీ, హత్యచెయ్యాలనే ఉద్దేశం అతనికి లేనేలేదనీ జూరీ సమక్షంలో నిరూపించవలసి ఉంటుంది. అదెల్లా నిరూపించడం? హత్యచెయ్యడం కోసమే అతనలా నిద్రలో నడుస్తున్నట్లు నటిస్తున్నాడేమో?"

"అతనికి నిద్రలో నడిచే అలవాటుందనీ, నిద్రపోతూనే వసారా అలమార్లో ఉన్న కత్తి తీసుకుని వెళ్ళాడనీ, ఇంట్లోవున్న ఈ మేనగోడలు నిరూపించలేదూ? ఈమె సాక్ష్యం పలుకుతుందీ."

"ఈవిడసాక్ష్యాన్ని మాత్రం జూరీ నమ్మవద్దూ"

"ఏం ఎందుకు నమ్మరు? ఆమె అబద్ధం చెప్తోందని ఎందుకనుమానించాలి?"

"అబ్బే ఆవిణ్ణి చూస్తే అలా నమ్మించగలదా అని నా సందేహం"

"ఏం ఎందుకని?"

"ఆ అమ్మాయి అదో మోస్తరుగా వుంటుది."

"మేనగోడలు మంచి రూపవతి అని విన్నానే."

"రూపవతే. గులాబి రంగు ఛాయ, పొంకం కలశరీరం, కాంతివంతమైన ముఖం, చలాకీచూపులూ, గులాబిపువ్వులా రెపరెపలాడుతూ ఉంటుంది. అలంకరణ కూడా అనుగుణంగానే వుంటుంది."

"వయస్సేపాటి?"

"ఇరవైకి లోపే"

"చదువుకుందా?"

"బి. ఏ. చదువుతూ మానేసింది"

"బాగా గారాబంగా పెరిగిన పిల్లా?"

"అంతే ననుకుంటాను"

"అయినా సరే. అంత చక్కని యువతి జూరీని నమ్మించలేకపోతే ఇంక మన వృత్తెందుకంటాను."

"ఇంతలో లైబ్రరీ గదిపక్క పెద్ద హాల్లోకి ఎవరో వచ్చారు. అక్కడ గుమాస్తా పలకరించి ఏదో అడుగుతున్నాడు,

"లోపలికి రమ్మను" అన్నాడు మాధవరావుగారు బిగ్గరగా. ఈ మాటలు ఎత్తైన గదిలో ప్రతిధ్వనించాయి. ప్రతిధ్వని మణిగిపోయే టంతలోనే ఒక చక్కని యువతి విసవిసావచ్చి లైబ్రరీ గది ప్రవేశించింది. ఆమెను చూడగానే రంగారావు చెప్పిన వర్ణన సరిగ్గా అతికినట్లు అనిపించింది. ఒంటినంటిపట్టుకున్న సిల్కు చీర, సిల్కు జుబ్బా ఆమె ఒయ్యారాన్ని ద్విగుణీకృతం చేస్తున్నాయి. ప్రతి చిన్న కదలికలోనూ ఒక విధమైన చాంచల్యం కనిపిస్తోంది.

ఆమె అటూ ఇటూ వెనకాముందూ బెరుకు చూపులు చూసుకుంటూ ప్రవేశించింది. రంగారావు చూపిన కుర్చీలో కూర్చోబడింది. మాధవరావును చూసి ఒక్కసారి చిరునవ్వు నవ్వింది. కాని నవ్వినంతలోనే ఆ నవ్వుమాయమై తీవ్ర యోచనా భారం ఆమె విశాలఫాలానికి వింత అందం తెచ్చిపెట్టింది. సంకోచం ఆమె చూపుల్లో స్పష్టమౌతూవుంది.

మాధవరావు తన పెద్ద మేజా వద్ద కుర్చీలో కూర్చున్నాడు. "సంకోచించకండి. అతను మా జూనియర్. మీరు చెప్పేవన్నీ వ్రాసుకుంటాడు. ఏవిషయమూ ఇతరులకు తెలుస్తుందనే భయంఅనవసరం." అన్నాడు. జవాబుగా నవ్వుకాని చిరునవ్వొకటి నవ్వింది.

"మీ పేరేనా కమల? మీరు మీ మేనమామ కేసుకోసం వచ్చారు. అంతేనా?" అన్నాడు మాధవరావు."

ఆమెతలూపింది.

"ఆయన వయస్సెంత?"

"ఏభైఉంటాయి."

"ఆయనపేరు దుర్గయ్యగారు."

మళ్ళీ తలూపింది.

"మీకు తల్లి దండ్రులు లేరు."

"లేరు"

"మీ రెన్నాళ్ళనించి మీ మేనమామవద్ద ఉంటున్నారు?"

"మూడేళ్ళనించి"

"సరే. మీ మేనమామకేసుకోసం మీ రెందుకొచ్చారు? ఆయన రాలేడా?

"వస్తాడు. ముందుగా మీకో విషయం చెప్పడం అవసరమని వచ్చాను."

"ఏమిటది?"

"మా మామకి నిద్రలో నడిచే అలవాటుంది."

"ఎన్నాళ్ళనించి?"

"ఏడాదినించి ఆరంభమయ్యింది."

"అయితే ఏం జరిగింది?"

"అసలు దాంతోనే ఆరంభమైనాయి కష్టాలన్నీ."

"................"

"నిజానికి ఆయన చాలా మంచివాడు. ఉదారబుద్ధి కలవాడు. ఆయనవల్ల ఏలోపం లేదు. అసలాయన మంచితనమే ఈ బాధలకి కొంత కారణం"

"అదంతా ఇప్పుడెందుకు. చెప్పదలిచిందేదో త్వరగా చెప్పెయ్యండి"

"మా అత్త ఒట్టి గయ్యాళి. రెండో పెళ్ళి పెళ్ళాం. భాగ్యముందికదా అని తల్లి దండ్రు లిచ్చారు మా మామకి. కాపగాని కొచ్చిందో లేదో తగువు లారంభించింది. మా మామ ఆవిడ కేమీ లోటు చెయ్యలేదు. ఆవిడ కోరిన హిరణ్యాక్షవరాలన్నీ తీర్చాడు. అయినా నైజం అటువంటిది."

"అసలు మీ కావిడంటే మొదలే పడదేమో?"

"నాకు ఆవిణ్ని చూస్తేనే ఒరకు అసహ్యం."

"ఇంక ఆవిణ్నే గయ్యాళి అనెందుకనాలి?"

"ఆవిడంతే. అన్నగా రొకడున్నాడు కొర్టుపక్షి. వాడే దీనికంతకీ మూలం. కాపరాని కొచ్చిన ఏడాదిలో మామతో తగువులాడి ఆవిడ పుట్టింటి కెళ్ళిపోయింది. మనవర్తికోసం దావా వేసింది."

"ఏమయింది దావా?"

"ఏదీ తేలకముందే దావా మానుకుంది. మామ నెలకి అయిదువందలిస్తానన్నాడు."

"అంత భాగ్యవంతుడా మీమామ."

"అవును. పెద్దవ్యాపారం, ఆస్తీవున్నాయి. ఆవిడ అన్నగారి దృష్టి మామఆస్తిపైనే వుంది. ఇప్పుడు మనవర్తికి దావా మానుకొని మామకి మనస్సు స్థిమితంలేదని చెప్తూ, ఆస్తిపైనసంరక్షకత్వంకోసంతయారవుతోంది."

"అయితే మీమామ చేసిందంతా అబద్ధమంటావా?"

"ఏమిటది?"

"ఆవిణ్ని కత్తితో పొడిచి చంపడానికి ప్రయత్నించాడని మొదట మనవర్తికోసం దావా వేసింది. అంతేనా."

కమల తెల్లబోయింది.

"అది నిజమనుకుంటున్నారా?"

"మరేమనుకోవాలో చెప్పండి."

"నేను చెప్పానుకదా, మా మామకి నిద్రలో నడిచే అలవాటుందని. ఒకరోజు రాత్రి నిద్రలో లేచి అటూ ఇటూ తచ్చాడుతూ, వసారా అలమార్లోవున్న చురకత్తి తీసిన మాట నిజమే. కాని అతనేం చెయ్యలేదు. ఆవిడలేచి తన్ని చంపేస్తున్నాడని నానాగోలాచేసి ఇరుగు పొరుగు నలుగుర్నీ లేపి చూపించింది. అప్పుడే మెలకువొచ్చి మామ తెల్లబోతూ చేతిలో కత్తితో అలాగే నిలబడి పోయాడు. దాంతో అందరూ అత్త చెప్పింది నిజమే ననుకున్నారు."

"ఏమో, మీ అత్తని చంపడానికే మీ మామ నిద్రలో నడుస్తున్నట్లు నటించి అదో ఎత్తు వేస్తున్నాడేమో"

"అబ్బే అదేం లేదు. తరవాత మామ డాక్టర్ని కూడా చూశాడు. నరాల బలహీనతకి మందు పుచ్చుకోవాలనీ, కొన్నాళ్ళు బెంగుళూరులో విశ్రాంతి తీసుకోవాలనీ డాక్టర్ సలహా ఇచ్చాడు."

"అందుకే ఇక్కడి కొచ్చారన్నమాట."

"అవును."

"ఇప్పుడుకూడా మీమామ నిద్రలో నడుస్తున్నాడా ?"

"ఆ నడుస్తున్నాడు. వెన్నెలరోజుల్లో మరీనీ. నిద్రలో నడిచేవాళ్లకి వెన్నెల మంచిది కాదుట."

"అదెల్లా తెలుసు మీకు ?"

"దాన్నిగురించి పుస్తకాలు చదువుతున్నాలెండి ఈమధ్య."

"ఓహో ! అయితే రాత్రివేళ నిద్రలో నడుస్తున్నట్లు మీమామకి తెలుసునన్న మాట."

"తెలుసును. కాని ఇప్పుడు తగ్గిపోయిందనుకుంటున్నాడు. నిజానికి తగ్గలేదు. నేను ఆయనతో ఆమాట చెప్పనూ లేదు."

"సరే ఇప్పుడేం చెయ్యాలి ?"

"ఏమీ లేదు. అదేదో మా మామే చెప్తాడు. కాని ఇటువంటి అలవాటున్నట్లు ఆయన మీతో చెప్తాడో లేదో నని అనుమానంవేసి ముందుగానే మీకు చెప్పడానికొచ్చాను. ఆయనకా అలవాటుందని ఒక డాక్టర్ వద్ద మెడికల్ సర్టిఫికెట్ తీసుకోవలసిన అవసరంఉంటుంది."

"అయితే నా కొక్క ప్రశ్నకి సరైన సమాధానం చెప్పగలరా ?"

"ఆ.. "

"నిజంగా మీ మామకి మీయింట్లో ఎవరిమీదైనా తలకి మించిన ద్వేషం ఉందా?"

ఆమెనోట మాట రాలేదు. తడబడుతూ "ఏం చెప్పను?" అంది.

"ఉందని చెప్పు."

"అహా! అల్లా చెప్పలేను."

"మరెల్లా చెప్పాలి?"

ముగ్గురూ ఒక్కసారి ఉలికిపడ్డారు. వసారాలో ఎవరో గబగబా మాట్లాడుతున్నారు. కమల చవాల్న లేచి నిలబడింది. "మామయ్య వచ్చినట్లున్నాడు. నే వెడతాను. ఈ ముందుగడపదాటి వెడతాను. నేనొచ్చినట్లుగాని, నాకు మీరు పరిచితులేననిగాని మామయ్యకు తెలియకూడదు." అంటూ గబగబా వెళ్లిపోయింది.

వసారాలో నుంచి దుర్గయ్యగారు లైబ్రరీ గదిలో కొచ్చాడు. "పాపం మీరు పనిలో ఉన్నట్టున్నారు. ముందుగా చెప్పిరావలసింది. కాని నా ఆందోళన మీరు గ్రహించే ఉంటారు. అదీ కాక నేను ఆట్టే సేపు నిలబడలేను." అంటూ కుర్చీలో కూలబడ్డాడు.

మనిషి తసబడుతున్నాడు. చిక్కిపోయి బక్కగా ఉన్నాడు. దవడ ఎముకలు బైటపడ్డాయి. కళ్ళు గుంటలు పడ్డాయి. ఆవేశం, చిరాకు, భయం ఒకదానివెంట ఒకటి తెరమీద వెలుగునీడల్లా మారుతున్నాయి. ఏదో పెద్ద తప్పిదంచేసి బాధపడుతున్నట్లు కనిపించాడు. మాటల్లో, కదలికలో తొట్రుపాటు కనిపిస్తోంది. కుర్చీలో నిలకడగా కూచోలేకుండా ఉన్నాడు.

ఉన్నట్టుండి తీవ్రంగా దడపట్టుకుంది. మాధవరావు తదేకంగా పరీకిస్తున్నాడు. పళ్లు చేతులు, బిగుసుకున్నాయి. వేళ్ళు కొంకర్లుపోతున్నట్లున్నాయి. రెండు క్షణాల్లో దడ తగ్గిపోయింది. వెంటనే ఏదో మాట్లాడబోయాడు.

"కొంచెంసేపు విశ్రాంతి తీసుకోండి" అన్నాడు మాధవరావు.

కొంతసేపైన తరవాత మాధవరావు అడిగాడు. "ఏం పని మీదొచ్చారు తమరు?"

"చెప్తా. నేను చాలాచిక్కుల్లో పడ్డాను డాక్టరుగారూ. అదను చూసి అందరూ నాపైన కత్తిగట్టారు. నాభార్య మనోవర్తికి దావా వేసి ఇప్పుడు మానుకుంది. నాకేదో మనస్థిమితం చెడిందంటూ నా ఆస్తినికాజేసి తన అన్నగారి కప్పగించాలని చూస్తోంది. ఆధారంలేక వీధుల్లో తిరుగుతున్న స్నేహితుణ్ణి తీసుకొచ్చి నా వ్యాపారంలో చోటిచ్చి పైకి తెచ్చినందుకు వాడు వాటాదారై ఇప్పుడు నాకు అపకారం తలపెట్టాడు. అనారోగ్యంవల్ల బాధపడుతూ ఇక్కడికిరాగా చూసి వ్యాపారమంతా నా నాహంగా మాచేశాడు. నా ఆరోగ్యంరోజు రోజుకీ తీసి కట్టవుతోంది. నాకు చివరికి మూర్ఛపట్టుకుంటుందని భయం వేస్తోంది."

"మీ వాటాదారిప్పుడేం కావాలంటాడు?"

"ఏముంది ? తినగలిగినంత తిని, సర్కారుకి పన్ను కట్టకుండా ఇప్పుడు నన్ను డబ్బు తెమ్మంటున్నాడు. పైగా వాటాలు పంచేస్తే తనదారిని తను పోతానట్ట నాతో మాట్లాడా లన్నాడు. సరే నన్నాను. కూడా ఎవర్నో తీసుకొచ్చాడు. వాడి స్నేహితుడు కాబోలనుకున్నాను. తీరా చూస్తే వాడో ప్లీడరు. వాడి తరఫున వ్యవహారం తీర్చిపెట్టడాని కొచ్చాడు."

"మీకూ మీ భార్యకీ తగువెందుకొచ్చింది ?"

"ఎందుకేమిటి ? గయ్యాళి. పైగా అన్నగారి సలహా. వాడి బతుకంతా కోర్టుల్లోనే గడుపుతాడు. మొదట్నించీ వాడి దృష్టి నా ఆస్తిమీదే ఉంది. గయ్యాళి చెల్లెల్ని ఇట్టే లోబరుచుకున్నాడు."

"మనవర్తికి దావా వేసినప్పుడే తెముల్చుకోలేక పోయారా ?"

"తెముల్చుకోకేం ? కోరుకున్నా రెంతచెప్తే అంతా ఇస్తానన్నాను. కాని ఇప్పుడది అక్కర్లేదంటుంది."

"పోనీ ముందే ఏకమొత్తంగా కొంత ముట్టచెప్తే ఊరుకుంటుందేమో ?"

"ఏమో తెలీదు. నేను దేనికైనా సిద్ధమే. ఆవిడ రాజీ కొప్పుకుంటే సరి."

"రాజీకి ఒప్పుకోదని మీకు అనుమానం ఉందా?"

"గట్టి అనుమానమే."

"కారణం"

"నాకు మనస్సు స్థిమితంలేదని, నాఆస్తిపైన సంరక్షకత్వం కావాలనీ ఆవిడ వాదిస్తోందిప్పుడు."

"దానికేంలెండి అంతదాకావస్తే డాక్టర్ సర్టిఫికెట్ తీసుకోవచ్చును. మీకు ఇప్పుడెవరైనా వారసులున్నారా?"

ఈ ప్రశ్నతో దుర్గయ్య మనస్సు బాధపడింది. ముఖంలో కోపం ద్వేషం రెట్టించాయి "ఆఉన్నారిద్దరు. నాతమ్ముడొకడు, మేనగోడలు. పాపం నా కోసం చదువు మానుకొని నా యోగక్షేమాలు చూస్తున్నది నా మేనగోడలొక్కత్తే. నాతమ్ముడికినన్ను గురించి ఏమీ పట్టదు. కూతురూ కొడుకులూ లేనిలోటు తీర్చేది మా కమలే."

"ఆమెకింకా వివాహం కాలేదా?"

"లేదు. చదువుకున్నది. నలుగురిలోనూ నిర్భయంగా తిరిగి మర్యాద సంపాదించుకుంది. ఇష్టమైనవాణ్ని చూసుకుని పెళ్ళి చేసుకుంటుంది. మా పొరుగున ఒక అతను అద్దెకున్నాడు. టెన్నిస్, హాకీ బాగా ఆడగలడు. అతనిపేరు రామచంద్రరావు. కమలకి అతనితో మంచి స్నేహం. అతన్నే పెళ్ళిచేసుకుంటుంది. నాకోసమని కూడా ఇక్కడికొచ్చాడు."

"అతని కుద్యోగంలేదా?"

"లేదు. కాని ఏదో ఆస్తి, బ్యాంకులో డబ్బావున్నట్టున్నాయి."

"అతనికి మాత్రం మీ ఆస్తి మీద ఆశ లేదా?"

"అబ్బే అత నల్లాంటివాడు కాడు. పైగా నేను వీలురాస్తేకదా మేనగోడలికి నా ఆస్తిలో భాగం వచ్చేది ? మా కమలకి కూడా అటువంటి ఆశలేదు."

"మీ తమ్ముడు ?"

"వొట్టి బిఖారి. స్వంత సంపాదన కానీ లేదు. నా దగ్గిరున్నన్నాళ్ళు తిండీ బట్టా పెడతానంతే."

"ఆయన పేరు ?"

"సన్నేశ్వరరావు. అసలు వీళ్ళెవ్వరికీ

(40-వ పేజీ చూడుడు)

కథానిక:

నిట్టూర్పుగాడ్పులో నెత్తావి

శ్రీ వంగల వేణుగోపాలాచార్య

అప్పుడే తెల్లవారుతోంది. వాతావరణమంతా శాంతిగా, చల్లగా ఉంది. రామం నిద్దర మంచం మీద అల్లాగే పడుకొని తన చిట్టి తమ్ముడితో ఆడుకుంటున్నాడు. ఇంటిలోపలినుంచి కాఫీ వాసన ముక్కుకి కొడుతోంది దాంతో తమ్ముడిని దింపి, రామం లేచి గూకట్టు సర్దుకుంటూ, దొడ్లోకి వెళ్ళేడు నోట్లో వేపపుల్ల పెట్టికొని అల్లాగే కూర్చున్నాడు రామం. ఇంకా బద్ధకం సరిగా వదల్లేదు ఒరే! కాఫీచల్లారి పోతోందని తల్లి వేసిన కేకతో, రామం యీలోకంపడి, దబదబా మొహం కడిగేసికొని, తుడుచుకుంటూ వంటింటిలోకి వచ్చాడు కాఫీసేవ అయ్యాక, డ్రస్సు వేసికొని వీధి అరుగుమీద కూర్చున్నాడు రామం

వీధిలో జనం యింకా మసలటం లేదు పొద్దున్నే వచ్చే పాకీవాళ్ళుమాత్రం వాళ్ళ పని వాళ్ళు చకచకా చేసికుపోతున్నారు. రామం, నిర్లిప్తంగా వీధి వంక చూస్తూ అల్లాగే కూర్చున్నాడు ఎదురింటి తెల్లగోడలు ఎదురెండవల్ల ధగధగలాడుతున్నాయి ఇడ్లీల సుబ్బయ్య 'యిడ్లీ యిడ్లీలం'టూ అమ్ముకుపోతున్నాడు. కూరగాయలతట్టలవాళ్ళు ఒక్కొక్కళ్ళే వీధిలోకి దిగుతున్నారు చిట్టితమ్ముడు అరుగు కింద మట్టితో గూడుకడుతూ ఆడుతున్నాడు అందరూ ఏదో విధంగా పనుల్లో మగ్నులైయున్నారు. ఎవరికీ తీరిక లేదు మరి తనేం చెయ్యాలి?

ఈ ప్రశ్న చాలసార్లు యిదివరకు వేసికున్నాడు రామం కాని, మామూలుగానే మెదడంతా, గాలించి సమధానందొరక్క, నిస్పృహగా యివతలికి వచ్చేసిందా ప్రశ్న 'ఏంచెయ్యను' మెల్లిగా గొణుక్కున్నాడు రామం

'ఉద్యోగం చెయ్యాలి,' 'ఎవరిస్తారు ఉద్యోగం', 'ఎక్కడికెళ్ళాలి,' 'ఎవరి నాశ్రయించాలి,' తనెన్ని అప్లికేషన్లు పెట్టాడు. ఎన్ని యింటర్వ్యూలకి,' వెళ్ళాడు ఇంటర్వ్యూలు జ్ఞాపక మొచ్చేటప్పటికి రామం మొహంలో నిరాశాపూరితంగా చిన్న నవ్వు వెలసింది. ఇంటర్వ్యూలకి, నిజంగా ఒక పిచ్చివాడిలా తిరిగాడు రమ్మన్నచోటికి, వద్దన్నచోటికల్లా వెళ్ళాడు. ఎంతో డబ్బు వమ్ము చేశాడు. క్రొత్తలో. ఫలానా చోటికి యింటర్వ్యూకి వెళ్లి వచ్చానని 'సగర్వంగా చెప్పకొనేవాడు. రోజూ పోస్టుజవానుకోసం చూసేవాడు. అతడు తన యింటివైపు చూడకుండా వెడుతుంటే ఉస్సురనేవాడు రేపైనా తప్పకుండా వస్తుంది ఇవాళైనా పోస్టు చెయ్యరా అనుకుంటూ ఊహాగానంలో కాలంగడిపేవాడు. ఇప్పుడా యింటర్వ్యూలమీద కూడ నమ్మకం పోయింది.

'గిన్నె తెండి అమ్మగోరూ' అని పెరుగుది వేసిన కేకతో రామం ఉలిక్కిపడి, యీ యిహంలోకి పడ్డాడు చిట్టి తమ్ముడు మెల్లిగా పెరుగు గంపవద్దకి చేరాడు. తల్లి పెరుగు పోయించుకొని వెళ్ళడంతో. చిట్టి తన చిన్నచేయి జాపి, అందులో పడ్డ పెరుగు బిళ్ళవంకజూస్తూ, అరుగుకిందకి వెళ్ళాడు కొంచెం తట్ట ఎత్తండి, అబ్బాయిగారూ, అని పెరుగుది అంటే, రామం మెల్లిగా లేచి, తట్ట దాని నెత్తికెత్తి, మళ్ళీ అరుగు చివరకి వెళ్లి, నుంచున్నాడు ఇంతలో పేపరు కుర్రాడు సైకిలు మీద పేపరు అందించి రివ్వున వెళ్ళిపోయాడు. రామం ఆతృతగా పేపరు విప్పి రెండో పేజీ దీక్షగా మొదల్నుంచి తుదిదాకా చూశాడు ఒక్క నిట్టూర్పువదిలాడు రామం. విసుగ్గా పేపరు యింట్లోకి విసిరి మెల్లిగా లైబ్రరీకి దారి తీశాడు. దారిలో సత్యం ఎదురుపడ్డాడు

'ఏరోయ్! యీ మధ్య దర్శనాలు లేవు' అన్నాడు సత్యం

'భలే! ఊళ్లో లేంది నువ్వేగా' అని రామం అంటే,

'అవునురా, వెధవ ఉద్యోగం యీ క్యాంపులో ఆయన పనులు, ఆఫీసు పనులు చూసేటప్పటికి తలప్రాణం కాళ్ళకొస్తోంది.

'ఆ' అంటే క్యాంపు. ఊఁ అంటే క్యాంపు. నీప నేనయం. రాజులా కాలుమీద కాలేసికొని.. ... అంటూ అల్లుకు పోతున్నాడు సత్యం. రామం వంచిన తలెత్తకుండా వస్తానురా, వేళయిందంటూ, మెల్లిగా లైబ్రరీ చేరాడు. అక్కడ రిటైర్డు తాసీల్దారు పురుషోత్తంగారు కనపడి ఏమోయ్, ఎక్కడైనా . . . అంటూంటే యింకా ఏంలేదండి వస్తానంటూ రామం గిరుక్కున వెనక్కు తిరిగి మళ్లీ బజారులో పడ్డాడు. అంగడివీధంతా కిటకిట లాడుతోంది.

ఎవర్ని చూసినా, ఏదో పనితొందరలో ఉన్నట్టు, హడావిడిగా వెడుతున్నారు అందరి మొహాల్లోను, ఏదో వింతకాంతి ధైర్యం తొణికిసలాడుతున్నాయి. మరి యింతా చదివిన తన గతి యిల్లా అయిందేం? ఎవరు కనబడ్డా 'మీ అబ్బాయి ఏంచేస్తున్నట్టు' అనడం, తండ్రి ఆ! ఉంటున్నాడు. చూస్తున్నను ఏదైనా వీలుగా ఉంటే . . అని నసగడం, వాళ్ళు తనని అదో రకంగా చూడటము, తనని శూలాలతో కాల్చి పొడిచినట్టుగా ఉంది. తనకి యిరవైమూడేళ్ళు వచ్చాయి. ఎల్లాగో B A పూర్తిచేశాడు మొన్నటికి మొన్న తల్లి భోజనసమయంలో, 'వాళ్ళబ్బాయికి కేవోపని అయిందిట నిన్ను చూద్దామని వచ్చాడు యిందాకా! అని అంటూంటే ఆ మాటలు తన గుండెల్ని లాగేస్తున్నాయని ఆ యిల్లాలికేం తెలుసు...అవును... అందరు ఏదోరకంగా ఉద్యోగాలు చేస్తున్నారు. మరి తనేం చెయ్యనన్నాడా. చివరికి గుమాస్తాగిరికికూడ సిద్ధమయ్యాడే.. తను పెద్దపెద్ద ఆశలకికూడ పోలేదే.. మరి ఎక్కడా దొరక్కపోతే తనేం చేసేదీ. 'చేతకానివాడవని' ఆత్మ ఘోషించింది.

పోనీ దేశాలు తెగించిపోతే...వెంటనే శాంతవిగ్రహం కళ్ళకట్టినట్టయింది. శాంతకి తనంటే ఎంత ప్రేమ! ఒక్క క్షణం తను

(25-వ పేజీ చూడుడు)



(ఎడ్లబళ్లు వరిగాత్తు తున్నట్లు గజ్జల, మువ్వలచప్పుడు. ఎహేయ్! ఎహేయ్! అని బళ్లులోలేవాళ్ళ కేకలు.)

కుర్రవాడు: మామోయ్! అల్ల బళ్లన్నీ, యనకపడ్డయ్ కానీ, ఇంక కొంచెం మెల్లింగానే పోనియ్!

పెద్దవాడు: ఇంకొంచెం లగూమీదనే పోదాంలే.

కుర్ర:. యెద్లు జూడు మామా! నురుగులు కక్కుతుండయ్.

పెద్ద: యెద్లేందిరా? మూడేళ్లుకూడా నిండని కోడెల్ని పట్టుకుని?

కుర్ర: యేవోలే. నురుగులు కక్కుతుండయ్.

పెద్ద: ఆటి తీరే అంత! కాడి కట్టినపట్టినుంచీ నురుగులు కక్కుతుంటయ్. అసలీ మజ్యన ఊరికెనే కట్టేసి ఉండయ్. కొస్త లగెత్తిస్తే కాలు సాగుద్ది ఎహేయ్! ఛల్! ఛల్! క్చ! క్చ!

(మువ్వలు, గజ్జెలు, మరీ వేగంగా మోగుతయ్.)

కుర్ర: అరె! భల్ మజాగా పోతుండయ్యో! మామా! యెనకపడ్డ బళ్లు అగపడ్డంలా.

పెద్ద: హేయ్! హేయ్! చల్! చల్! చల్! కోడెలూ! మహారాజుల కోడెలూ! మాణిక్యపు కోడెలూ! హేయ్! హేంగ్!

ఓ. గుర్రా. లా. గోపి. రెడ్డీ దాచే
పల్లికె దానా పెతీవా!
ఓ గుర్రాలా గోపిరెడ్డీ
దాచే పల్లికె దానా పైతివా!
శేరు శేరు రొయిండి మురుగుల్
సేతులాకూ బెట్టుకోనీ
కట్టవ మీదా వస్తావుంటే
కామందు నీవనుకుంటిర కొడకా
వయ్యారి కొడకా, బంగారు కొడకా ‖
దాచే ‖

ఆ పక్కన ఒక సేనూ, ఈ పక్కన ఒక సేనూ
నడుమలోనా నాపసేనూ సందున నిన్నూ
నలుగురు బట్టె
చరికిరి కొడకా, వొయ్యారి కొడకా ‖
దాచె ‖

ఎక్కేదీ యెల్లగుర్రం
కట్టేదీ కాయిపంచా
సుక్కవంటి నీ సక్కదనమూ
సూడ కన్నులూ లేవుర కొడకా
బంగారు కొడకా, చిన్నారి కొడకా ‖
దాచ ‖

ఓ గుర్రాలా గోపిరెడ్డీ.

కుర్ర: యేంటి మామా ఆ పాట?

పెద్ద: యేం? బాగా లే?

కుర్ర: ఓభల్ మజాగానే ఉందిగాని.. ఐతే ఆ గోపిరెడ్డెవురు?

పెద్ద: మా పల్నాటోడే!

కుర్ర: అది నువ్ జెప్పాలా! అసలాయన కదేంది?

పెద్ద: గుర్రాల గోపిరెడ్డి యిప్పటికి అరవై, డెబ్బయ్ యేళ్ల కిందటివాడు ఆల్లవూరు పిల్లుట్ల

కుర్ర: అయితే?

పెద్ద: గోపిరెడ్డికి యీరారెడ్డిని తమ్ముడుండేవాడు. ఆల్ల మేనమామ పేరు యల్లమంద

కుర్ర: ఆఁ హాఁ!

పెద్ద: ఆల్లంతా పెద్దమోతుబర్లు గోపిరెడ్డిది మహాపెద్ద యిగ్రహంలే! పగల్ దవిటే అనే పెద్దగుర్రం—తెల్లడిది—ఎక్కి బలే జోరుగా సవారిజేసేనోడు అడిగినోడికి లేదనకుండా యేదయినా యిచ్చేశేటోడు సాలా మెతకగుండేవాడు. పట్టుబడితే భల్లూకప్పట్టే!

కుర్ర: ఊహూఁ!

పెద్ద: ఆల్ల ఊరికి దగ్గర్లోనే మన్నె సుల్తాన్ పాలెం అని ఒకూరు వుంది దాని కరణం గోపాలకిష్టయ్య గోపిరెడ్డోళ్లకు సముజీగా నిలిసేవోడు ఆల్ల కెప్పుడూ తగాదాలే!

కుర్ర: అప్పుడేమయింది?

పెద్ద: ఆ రోజుల్లో యీ గుంటూరు జిల్లాలో వున్న యావత్తు గ్రామాల్నీ యెంతల కాలంలో మేతకోసం పల్నాటికి తోలేవోళ్లు. గోపిరెడ్డి, గోపాలకిష్టయ్య అన్ని జీవాల్నూ చెరిసగం గుత్తకుతీసుకుని గ్రామాను వేసి, పుల్లరి వసూలుచేసే వాళ్లు.

కుర్ర: ఆఁహాఁ!

పెద్ద: రెండు పార్టీలవాళ్లూ అన్ని గొర్లనూ తామే మేపాలని తగవులాడుకునేవాళ్లు సివరి కది. దొమ్మీలకాడికి వచ్చింది అట్టా ఉండగా

(టక టక కర్రమీద కర్రవేసి కొడుతున్న చప్పుడు)

గోపిరెడ్డి: అరేయ్ యీరయ్యా! యీ వరస నువ్వొక్కడివే సాధకం జెయ్యరా.

వీరారెడ్డి: అడుగు సరీగా బడుతుందో లేదో చూస్తున్నా!

గోపి: ఆ ఒకటి, రెండు, మూడు, గిరికే ఒకటి, రెండు, మూడు, గిరికే అఁ అదే! ఒకటి, రెండు, మూడు, గంతు. ఒకటి, రెండు మూడు, గంతు గంతులో కొంచెం పైకి లెగవాల!

(మనిషి వస్తున్నట్లు కిర్రుచెప్పుల చప్పుడు)

కొత్తమనిషి: యేంరోయ్! గోపయ్యా యీరయ్యకి ఏదో యిజ్జెలు జెపుతుండవ్!

గోపి: ఇదుగో యల్లమందిమామా! యిజ్జలనేవి ఒకళ్లకి జెప్పకపోతే అట్టానే పోతయ్ గదా!

యల్ల: హేయ్! యేం దాస్తావు లేవయ్యా అల్లుడా!

గోపి: అఁ! నీకు తెలియంది ఏముంటది లే మామా!

యల్ల: యేం మళ్ళీ పుల్లరి రోజులు వచ్చినయ్యా నా?

గోపి: అదేలే! యేదో జాగర్తమీద ఉంటం. మంచిదేగా?

యల్ల: మామూలు జాగర్త యెప్పుడూ వుండద లేదులే నువ్వేదో పెద్దయెత్తే

ే [శ్రవ్యనాటిక]

...మూడి

...ంచంద్రరావు



వ్ ! గూడెం కాడ వాళ్ళంతా గరిడీలు జేస్తుంటారు

గోపి ఒక్క చణం ఓపికపట్టుమామా ! నీకే తెలుసుద్ది

(కాలవిరామం మంద లు నడుస్తున్నట్లుగా గిట్టల కొమ్ముల శబ్దం గంటల మోత గొడ్ల అరుపులు వగైరా—)

వీరా ఏయ్ ! ఆగండి ! యెవురి దామంద ?

కొత్తమనిషి : గోపాల శెట్టయ్యగారి మందను పోతుండాం

వీరా యాడనుంచి ?

కొత్త సత్తెనపల్లి, ంటూరుసీమలనుంచి

వీరా మందలో యెన్ని గొడ్లుంటాయ్ ?

కొత్త యెనిమిది ఒంద లుదాకా ఉంటయ్

...ట్లు యెనక యింకా రావటంలా ?

కొత్త ఆ ! దగ్గిర దగ్గిర ఇంకా పది ందలుదాకా వస్తుండై

గోపి మరి దాన్లో నీళ్లుండయ్యా ?

కొత్త : అదే కొంచెం నిక్కు గా ంది. మామూలుగా నీళ్లు నిక్కే సోట్లు ెలామటుకు యెండిపోయినయ్

గోపి రాళ్లవాగుకాడ సెలమలు ...తో నీళ్లు బడలావి

కొత్త : ఏదో కొద్దిగా బకు తుండయ్‌గానీ. అసలే బక్కగొడ్లు. నీటిమొగం వాచిఉంటయ్ ఆటికి తోడు కా నా దూరం నుంచి రా వా లాయ్.

గోపి: అయితే యనకొచ్చేమందలకు నీళ్ల యొద్దడి మోపే నన్నమాట.

కొత్త: అన్నమాటే! మీ దే వూరు?

గోపి: యీాడే లేండి పిల్లుట్ల నన్ను గోపిరెడ్డంటారు.

కొత్త: అంటే గుర్రం గోపిరెడ్డిగారా?

గోపి: ఔను

కొత్త: మేంకనమదారినుంచి ముందు రాకపోతే మీారే ముందయ్యేవోరు.

యల్ల: అందుకోసమే యీాడ నిలబడ్డాం

కొత్త: సరే మే మింక సాగిపోతాం

(మంద కదిలిన చప్పుడు)

గోపి అయితేమామా, సంగతి ఇంటున్నావా?

యల్ల: ఆ! యింటూనే ఉంటా!

గోపి: మరేం జేద్దామంటావ్?

వీరా: యేంది చేసేది?

యల్ల: యేమీాలా. నాగులేటిదాకా నీళ్ల యొద్దడి ఉంటది! ఇంక మనమందలు యనకపడితే నీళ్లకు కటకటలాడాల్సిందే.

వీరా: అవును మరి

యల్ల: అందుకని మన మందల్ని ముందుకు తోలుకురమ్మంటాను గోపయ్యా.

గోపి: అవును అదే!

యల్ల: ముందున్న మందల్ని నెగ్గా నెగుగా కొట్టేసి మన మందల్ని తోలకరమ్మంటావా?

వీరా: అదేంది మామా? తగూలకి దింపతావేం?

యల్ల: మరి యనకాల ఉన్న మందలు ముందు ట్టా వస్తయ్? అడ్డదాంట పగురులమీాద తోలకరావాలె

వీరా అంత పగురునకి గొడ్లు నిలుస్తయ్యా?

యల్ల: అందుకోసరే నీళ్ల యొద్దడి మాములు దాంబడే నీళ్లు లేవే, అడ్డదాంబడి యాడనుంచి వోస్తయ్?

గోపి: ఒరి నంతమటుకే.

వీరా: అంటే?

గోపి: అయినకాడికి తరుముకురావటమే! నిలబడగల గొడ్లు నిలుస్తయ్ నిలబడలేనివి రాలిపోతయ్

వీరా: అరేం లాభం?

గోపి: యెనకొచ్చిమాత్రం యేం లాభం? ఉన్న కాసిని నీళ్లనీ ముందొచ్చే మందలు తాగిపోతే, మొత్తం మందలన్నీ నీళ్ళు లేక సావాల్సిందేగా?

వీరా: ఆటికి అంత దప్పిక ఉండదుగా, లగెత్తిన గొడ్లకుమల్లే!

యల్ల: అది కాదులే యీారయ్యా, నువ్వూరుకో! గోపయ్యా నువ్ జెప్పింది బాగానే ఉంది. కద్దోటా నడిపిద్దామంటావ్?

గోపి: యిను. తూర్పునించి వొచ్చే గొడ్లు పల్నాట్లోకి రావాలంటే మూడే దార్లు. మొదటిది కచ్చలబోడు కొండల, గుత్తికొండలకి మజ్జె ఉన్న నెమలిపురం కనుమ. రెండోది గుత్తికొండ కొండలకీ, కారెంబోడి కొండలకీ మజ్జ ఉన్న గుత్తికొండ కనుమ మూడోది కచ్చలబోడు కొండలకీ, సింతపల్లి కొండలకీ మజ్జ ఉన్న పాపయపాలెం కనుమ

యల్ల, వీరా: ఆఁ! అంతే!

గోపి: మన మందల్ని అడ్డదాంట తరుముకొచ్చి కనములకి అడ్డేశామంటే దారి పొడుగూతా మనమే ముందవుతాం,

యల్ల నిజమే అయితే యనక మందలు మన్ని తరుముకొచ్చి కలగలుపుగా తొక్కిస్తే?

గోపి: అందుకనేగా మన గరిడీలు! మందయనకాల మనం నిలబడితే, యెవడు, యెన్ని గుండెలతో కలగొక్కిస్తాడు? మామా! మీారు గుట్టావాళ్లను కూడగట్టుకుని, గుత్తికొండకాడికీ పాపయ పాలెంకాడికీ పొండి. నేను నెమిలిపురం కనుములోంచి ఒస్తా.

యల్ల ఆ!! యీారయ్యా! పోదాం పద

(స్వల్ప విరామ సూచన)

యల్లమంద అదుగో! మనోళ్లంతా యేదో కుశాలుమీాదుండారు

(జనం కేకలు, నవ్వులు)

ఒకగొంతు ఓయ్ నర్సయ్యా! నువ్వ మజ్జన రెడ్డిగారిమీాద కట్టిన పదం పాడు.

2 వగొంతు ఓ యినండయ్యా!

రెడ్డొచ్చె, రెడ్డొచ్చె, రెడ్డొచ్చెనండీ
గుర్రాల్ గోపిరెడ్డీ యిచ్చేసె నండీ ॥రె॥
జొమిలి చేతికి లేని రెడ్డి మారాజా
అడిగితే లేదనని రెడ్డిమా ప్రెభువా
బీద బిక్కికి తండ్రి రెడ్డి మారాజా
ముసిలి ముతకకు తల్లి రెడ్డి మాప్రెభువా ॥రె॥
గుండె తీసిన బంటు మా గోపిరెడ్డీ
అరితేరిన రౌతు మా గోపిరెడ్డీ
పట్టు విడవడు పో! మా గోపిరెడ్డీ
పట్టు విడవడు! పో! మా గోపిరెడ్డీ ॥రె॥

యల్ల: భల్ పదం గట్టావే నర్సయ్యా! రెడ్డిగారి కొత్తిశాలుమాదాన కన్నేశావా యేంది?

జనం: అంతే! అంతే! (నవ్వులు)

యల్ల: సరేగానీ మీారంతా రెడ్డిగారి సొమ్ము దింటమేగాదు ఇప్పుడు ఆయనకు ఒక పనిజేసిపెట్టాలె

జనం: యనకాడతామా యేంది? ఆయన కాలితో సెపితే మేము తలకాయలతో చేస్తాం.

యల్ల. అయితే......

(విరామసూచన గొడ్లమందల శబ్దం.)

గోపి: పది జాములయింది ఈడకు వచ్చి. యనకవాళ్ల మందలు యేమయినట్టూ? ఆచ్చర్యంగానే ఉంది ఈ గుట్టెక్కి చూద్దాం అదుగో మనోళ్లే లగెత్తుకుని వొస్తున్నారు .

(జనం వచ్చిన కలకలం)

గోపి: యీారయ్యా! యేంటది లగెత్తుకొస్తుండారు?

వీరా: (రొప్పుతూ) యేముంది? పాపయపాలెంకాడ తోసుకొచ్చారు.

గోపి: ఆఁ?

యల్ల: మనోళ్లు నువ్ జెప్పినట్టు కనుములకి అడ్డంగా మందల్ని నిలేశారు. కాని గోపాలకిష్టయ్య ముటా మొనగాడు. యెంకయ్యనాయుడు ఒక సిత్రం జేశాడు.

గోపి యేందయ్యా ఆ సిత్రం?

యల్ల: యేముంది? ఒక యెద్దుని—యేనుగంతదాన్ని తీసుకొచ్చి ఒళ్లంతా జేవురురంగు పూశారు తలకి రాచ్చసుడి బొమ్మను తగిలించారు నా సామిరంగా. దాని తోక్కి తాటాకుమట్ట గట్టి, నిప్పు ముట్టించి వదిలారు.

గోపి: ఉఁహూ!

వీరా: ఆ దెబ్బకి యెక్కడి గొడ్లక్కడే లగూ—మల్లెయ్యటానికి వల్లిన ముటా వాళ్లని కుమ్మి పారేసినయ్

గోపి. అయితే మన మందంతా సెదిరిపోయిందంటారా?

యల్ల. మరేం జేస్తాం?

గోపి. అగోరించకపోయ్యారా? సరే సిగ్ ముటావాళ్లా! మీారు పొయ్యా గుత్తికొండకాడున్న మందనూ, యీా మందనూ తోలకపొండి

(జనం వెళ్లిపోతారు)

యల్ల: అయితే యిప్పుడేం జేద్దామంటావ్ గోపయ్యా?

గోపి: నువ్వూ, యీారయ్యా కలిసి సెదిరిపోయిన మందని కూడగొట్టుకురండి. ఆళ్ల మందలో యేటకయినా కలుపుకున్నారేమో నిలేసిసూడండి నే నా దెబ్బలో ఆళ్లమంద నొకదాన్ని కొట్టుకపోతా.

వీరా. మళ్లీ ఆళ్లమందజోలెందుకు?

గోపి: యేం?

వీరా: అయిన నష్టం సాలదూ?

గోపి నష్టాన్ని పూడిసేందుకలే

వీరా: మందని కొట్టుకరావటమంటే ఊరికే అవుద్దా?

గోపి: యేం కాక?

వీరా: యెంతెమందికి నూకలు జెల్లుతయ్యో?

గోపి: అంటే?

యల్ల : ఇదుగో యీారయ్యా! నువ్ జెప్పే దేందో పంచ్ లిపి బెట్టినట్టుగా జెప్పు.

వీరా : యినండయ్యా, మనం జేసేదేమో అన్నాయం. ఇప్పటికే సాలా గొడ్లు సచ్చి పోయినై. మ తా వాళ్లు సాలామందికి దెబ్బలు తగిలినై. యిప్పుడు మందని కొట్టుకు పొయ్యాలమంటే కచ్చలు పెరుగుతయ్. నన్న కొరుజనం సాలామంది సచ్చిపోతారు.

యల్ల : పుట్టింతరవాత యపు ర యి నా సావాల్సిందే. యవురయినా శిలేసుకుని కూసుంటారా?

వీరా : మామూ! నీ మెట్ట యేదాంతాలు కట్టి పెట్టు.

గోపి : ఆయితే యేందిరా ను వ్వ నేది?

వీరా : అనవుసరంగా మట్టా వాళ్ల ను జంపటం నాకిష్టంలా.

గోపి : సంపుతా మేంది? అయినా మన సొమ్ము తింటున్నోళ్లు——

వీరా : అదే నే జెప్పేది గూడా! మన సొమ్ము తింటూ, మన బిడ్డల్లాగ ఉంటూ, మన్ని నమ్ముకొన్న ఆ బక్క జనాన్ని బలేస్తామా?

గోపి బలేందీ? వొట్టెప్పుడు అల్లకి మనం బువ్వ పెడుతున్నాం అవసరం వొస్తే అల్లు యనకాడకుండా మపపని జెయ్యాల

యల్ల కాకుంటే? అల్ల వొళ్లన్నీ మన వొణ్ణంతోనే పెరిగినయ్

వీరా నాయమయిన పనికయితే అల్లు యనకాడాలని నేనుమాత్రం జెపుతానా? యేదో మనం దుష్టపు ఆలోశనతో అల్లని సావమంటే యెట్టా?

గోపి దుష్టపాలోశన యేంది? నష్టం యెట్టా పూడుద్దనుకున్నావ్? మన రాజులంతా అట్టా జేసినోళ్లేగా! రాస యేమారెడ్డి, అల్లంతా రాజ్జాలెట్టా యేలా రను కున్నావ్?

యల్ల • అవును గోపయ్యా తృప్తి లేక బ్రామ్మడు జెడితే, తృప్తిపడి రాసవాడు జెడ్డాడంట పాండవులు దిక్కులంతా యెందుకు గెలిశా రంటావ్?

వీరా యుద్దాలు చేసిపాండవు లేంబావు కున్నారు? ఐరాగ్యంతో కొండలు పట్టి పొయ్యారు ఇదుగో అన్నోవ్! యీా యల్లమంద నీపాలిటికి శకునిమామ లాగా దాపరించాడు

గోపి అయితే నువ్ మాతో రావా?

వీరా లేదన్నా! మనగొడ్లను రచ్చించు కునేవరకూ నీకోసం పాణాలయినా వదుల్తా కాని దురాగతానికి దిగితే—— యెవిరివు దారి అల్లదే!

గోపి యేందిరా యిబిషణాయ్?



'అగ్నిపరీక్ష'లో లక్ష్మీకాంతం రఘురామయ్య

వీరా : యేవయినా దిట్టు కాని ఈ పని మానెయ్

గోపి నువ్వంట్రా నాకు జెప్పేది? ఇంక సాలు నీ మొగం జూపించమాక ఊc! నడు!

(మనిషి వెళ్ళిన చప్పుడు)

గోపి గుడ్డొచ్చి పిల్ల నెక్కిరిచ్చుద్ది దురాగతాలంట! దురాగతాలు! అవతలోణ్ణి కొట్టందే రెండో వాడు బలపడేదెట్టా?

యల్ల యీాడు పోయ్యి అల్లకి మన ఆలోచశన జెప్పడుగదా!

గోపి ఓయ్ నిమిశంలో ప న్నాగం మారుద్దాం నువ్వు కొన్ని గొడ్లను తీసుకుని మామూలుగా గుర్రాల దారెంటనే అళ్ళ మందతోపాటుగా పో! గుర్రాల బాటనుంచి పొందుగల బాట సీలే చోటికి కొంచెం పైగా అళ్ళమందను సెదరగొట్టు ఆ అడావుడిలో నేను అళ్ళ మందని పొందుగల కాడికి కొట్టుకపోతా!

యల్ల ! పొయ్యా?

గోపి నైజాంలోకి తోలేసరి తరవాత తీరిగ్గా తెచ్చుకోవచ్చు

యల్ల చబ్బాష్! భలే యెత్తేశావ్! మరయితే నీబగల్ దివిటీకి జీను తగిలించాల్సిందేగా?

గోపి ఆ!

(కొంల విరామం గుర్రపు డెక్కల మోత మంద నడిచె శబ్దం)

గోపి ఉష్! అప్పుడే దానేపల్లి వచ్చేసింది ఈ ఊపులో కిష్ట దాటేనేగాని బంలా మంద యీా పరుసుమీద నిలభడితే మళ్లీ కదల్దు చల్! క్ర్! క్ర్!

(దూరాన గుసగుసలు)

1 వ గొంతు అరేయ్! యిదుగోరా గోపిరెడ్డి! మన మందను తోలకపోతున్నాడు

2 వ గొంతు ఏమయితే నేం చివరికి జిక్కాడు

3 వ కానీ, అడి యెదటపట్టం మాటలే నట్రా?

4 వ యేమయినా ఈడనే అణ్ణి కొట్టెయ్యాల! సెయ్ జారిపోతే, అగుర్రాన్ని మనం అందుకోలేం

1 వ దారిలో ఉచ్చుపన్ని గుర్రాన్ని పడెయ్యాల

2 వ పంట గోసిన చేన్లో ఉచ్చు యేస్తే గుర్రం కనిపెట్టుద్ది

3 వ అదుగో అడ పంటగోసిన గొంపు సేల మజ్జ నాపసేనుంది అందులో ఉచ్చు యేస్తే అవుపించదు

4 వ అడి కెందుకు ఒస్తాడు?

3వ ఒక దూడను లాక్కొచ్చి సెవ్ గోసేద్దాం ఆ అరుపులు యిని ఒస్తాడు,

(స్వల్ప విరామం)

గోపి పొద్దు బోతుంది తొందరగా నడవాల చల్! చల్! క్ర్! క్ర్!

(దూరాన దూడ అరుపు)

గోపి యేం ద ది? ఆ నాపసేనులో దూడని మెకం పట్టినట్టుంది

(గుర్రం కొంతదూరం నడిచి దభాలున

పడ్డ చప్పుడు. గ్రురం అరుపు. జనం గలభా. కొట్టండి కొట్టండి అని కేకలు.)

గోపి: అబ్బా! సచ్చానరో! (కేక)

జనం. పాయిండి సైసలా! ఇంక పోదాం రండి.

(స్వల్ప విరామం.)

గోపి: అబ్బా! అబ్బా! (మూలుగు.)

(మనుషులు వస్తున్న శబ్దం.)

వీరా: యెవు రక్కడ మూలిగేది?

గోపి: యెవురు? యిభిమణాయ్! కళ్లు కల్లబడ్డయ్యంట్రా!

వీరా: ఓరన్నోవ్! యేందిరా! యాడ దగిలింది దెబ్బ?

గోపి: నీకు తెలీకుండానే జరిగిందట్రా యిభిమణాయ్? ఉండక్కడ! నన్నంటుకోమాక!

వీరా: నాకేం తెలీదన్నా! సురజాల సల్లయ్యసామి ఒట్టు. ఇదుగో యీళ్ళకుగు.

3 వ గొంతు: లేదు గోపయ్యా! మీవోడికేం తెలీదు.

గోపి: ఆ?

3 వ: అహా! మీ వోడికేం తెలీదు. గొల్లెను యెతుక్కుంటూ మేమే వచ్చి నిక్కడ చూసి కొట్టాం.

గోపి: మరి ఈడు ఇక్కడేం జేస్తుండాడు.

వీరా: నువ్ మందలో—

గోపి: నువ్వుండు. ఆడిని జెప్పనియ్.

3 వ: ఈ అబ్బాయి నీకేం ద్రోగం జెయ్యలేదు, గోపయ్యా. మేము రంగడుతో కనమదాటిం దరవాత మీవోళ్లు దొమ్మీచేశారాయె. అప్పుడు నిన్ను తరమకొచ్చాం.

గోపి: ఈ డెక్కడ అవుపించాడు?

3 వ: నిన్ను కొట్టేసి పోతుంటే, దాగెంట ఒస్తున్నాడు ఆయన్నికూడా కొడదామని మీది కెళ్లాంగాని నిలవలేక పోయ్యాం.

మిగతావాళ్లు పారిపొయ్యారు. నేను, దెబ్బతిని చిక్కిపొయ్యా!

గోపి: నువ్వీడి కెందుకు వచ్చావురా?

వీరా: దొమ్మి జరిగిందని యిని ఆడికడితే నువ్ లేవు. అళ్ల గొడ్లుకూడా లెవ్వు. అందుకని యెతుక్కుంటూ వొచ్చా.

గోపి: యల్లమంద మామ?

వీరా: దొమ్మి చేసినోళ్లని సాలామందిని ఆడికి యాటకొసం వొచ్చిన సిపాయీళ్లపట్టకపొయ్యారు. అళ్ల పెళ్ళాం బిడ్డలు లబో దిబో.

గోపి: నా పగల్ దివిటీ యాడుంది?

3 వ: బరిసెపోటుకి సచ్చిపోయింది.

గోపి: అయితే మా వాడు ద్రోగం చెయ్యలేదంటావా?

3 వ: లేదయ్యా! కారం పూడి యీరుళ్ల సాచ్చిగా.

గోపి: అరెయ్ యీరయ్యా! నేను సాలా పొరబాటు చేశా.

వీరా! అంతా జేస్తూనేవుంటారులే. యిప్పుడు జెప్పన్నా యాడ దెబ్బ దగిలిందో?

గోపి: కుడి పక్కని బరిసె దిగబడ్డది. అబ్బ!... అబ్బా! అమ్మో!... కొంచెం మంచినీళ్లుండయ్‌రా?

వీరా: ఆ! యిదుగో తాగేటికాయ.

గోపి: అబ్బా! అమ్మో!

వీరా: యేమయ్యా! దాసేపల్లికి మోసుకుపోదాం పద.

గోపి. నన్ను కదిలియ్యబోకండి. ఇంక లాబం లేదు.

వీరా: అదేందన్నా! దాసేపల్లిలో మంచి రణవైజ్జుడున్నాడు.

గోపి: రణవైజ్జుడూ లేడు, రుణవైజ్జుడూ లేడు ఇంక ఆయాసం ఒస్తుంది. ఒక మాట జెప్పనియ్.

వీరా: ఆ!

గోపి: మన ముటావాళ్ళ సంగతి నువ్ జెప్పింది నిజమే. మన దురాగతాలకు ఆళ్ళు అల్లాడుగూపెదు.

వీరా: అది తరవాత చూద్దాంలే.

గోపి: ఇంక ఒకటే తరవాత—వల్లకాట్లోనే..... ఊపిరుండంగానే తప్పు దిద్దుకోవాల .... యీరయ్యా! నా ఆస్తంతా బెట్టి...ముటావోళ్ళపిల్లలకీ.. ఇంకా దిక్కులేనోళ్ల పిల్లలకీ ..సత్రం బెట్టించరా... నా ఋణం తీరుద్ది ..అబ్బా! అమ్మో!

వీరా: యేమయ్యా! చిన్నంగా కాళ్లు బట్టుకుని యెత్తు.

గోపి: అమ్మో! అమ్మో! (కేక)

3 వ: యీరయ్యా దించు! దించు!

వీరా: అన్నా! అన్నా! అమ్మో! అన్నోవ్!

(గద్గదస్వరంతో రోదనధ్వని)

... .

పెద్దవాడు: యీ విదంగా దరమరాజని పించుకున్న గోపిరెడ్డి దురాశతో కూలి పొయ్యాడు. అళ్ల తమ్ముడు తన ఆస్తికూడా యేసి దిక్కులేని పిల్లలకు సత్రం బెట్టించాడు.

బొమ్మరిల్లు:

★ తమాషా ప్రశ్నలు ★

ఫోటో ఎవరిది?

ఒకడు ఒక ఫోటోకేసి చూపిస్తూ చుట్టూ వున్నవారితో "నాకు అన్నదమ్ములెవ్వరూ లేరు. కాని ఈ ఫోటోలో వున్న మనిషి తండ్రి నా తండ్రికి కొడుకవుతాడు." అన్నాడు. ఆ ఫోటో ఎవరిదో చెప్పండి?

పన్నెండు గంటలు

రామ్మూర్తి, వాడి చెల్లెలు లీల ఇంట్లో కూర్చుని చదువుకొంటుండగా గోడకివున్న గడియారం 12 గంటలు కొట్టడం మొదలుపెట్టింది. రామ్మూర్తి ఆగంటలు వింటూ తన చేతికివున్న రిస్టువాచీని చూస్తున్నాడు. గంటలుపూర్తయింతర్వాత చెల్లెల్ని ఏడిపించటానికి ఒక ప్రశ్న వేశాడు, "గడియారం 6 గంటలు కొట్టేటప్పటికి 30 సెకండ్లు పట్టింది. 12 గంటలూ కొట్టేసరికి ఎన్ని సెకండ్లుపడుతుంది?" "60 సెకండ్లు" అని లీల చటుక్కున జవాబు చెప్పింది. ఆ జవాబు రైటా, కాదా? ఎందుచేతో చెప్పండి.

పదిహేను లడ్డూలు

ఒక కాగితం సంచీలో 15 లడ్డూలు వున్నాయి 15 గురుపిల్లలు తలా ఒక లడ్డూతీసుకున్నారు. సంచీలో ఒక లడ్డూమిగిలింది. ఎల్లా మిగిలిందో కనుక్కోండి.

(సమాధానాలువచ్చేవారం)

నిట్టూర్పుగాడ్పులో నెత్తావి

(19 వ పేజీ తరువాయి)

కనపడకపోతే జేలయిపోయేది ఇంకా మామగారు ఉత్తరం రాయలేదేమి చెప్మా యింకా పురుడు రాలేదేమో, అనుకున్నాడు రామం. తనూ ఒక తండ్రి కాబోతున్నాడు. యీ భావం మొదట్లో మెదలగానే రామం మొహంలో ఒక వింత కాంతి గోచరించింది. కాని అది క్షణికం. తనూ తండ్రి అయినా యింకా తను తండ్రి నంటిపెట్టుకొని ఉండటమా ఇప్పుడే యిన్ని వాదులు ముందుముందు భరించగలనా రామంలోని ఆత్మాభిమానం ఒక్కసారి పెల్లుబికింది. తను సంపాదించాలి ఏదైనా ఉద్యోగం సంపాదిస్తే కాని శాంత మొహం తిరిగి చూడకూడదు.

మోటారుకారు హారన్ మోతతో, తుళ్లిపడి చూశాడు రామం 'అడె కడవళె ఎన్నయ్యా పైత్యమా' అంటూ ఆ అరవ డ్రైవరు కారు తిప్పుకొని దాటి వెళ్ళిపోయ్యాడు. రామం నిలబడి చుట్టు చూశాడు రైల్వేస్టేషను హడావిడిగ కనపడుతోంది పక్కనే జట్కాలు, బస్సు వరుసలుదీర్చి ఉన్నాయి చేతి వాచివంక చూసి ప్యాసింజరు టైము అయిందనుకున్నాడు రామం. ఇందులో వెళ్ళిపోతే. ఎక్కడికి ... రైలు తిన్నగా మద్రాసులో దిగబెడుతుంది. జేబు తడుముకున్నాడు. మూడు రూపాయల చిల్లర రాలింది టిక్కెట్టుకయినా సరిపోగు ఏమయితే అయిందని ప్లాటుఫారంమీదికి వచ్చాడు అప్పటికే రైలు వచ్చేసింది అటూ యిటూ తిరుగుతున్నాడు రామం

'రామం! ..రామం! రామం!...... ఎవరబ్బా తన్ని పిలుస్తున్నదని రామం వెనక్కి తిరిగి చూశాడు తన మామగారే! అరే! చాల హఠాత్తుగా వచ్చారే! దిగండి అంటూ కిటికీలోంచి ట్రంక్ అందుకొని కింద పెడుతూ అటూ యిటూ చూశాడు. రైలు తలుపు పట్టుకుని నిరసంగా శాంత దిగుతోంది. రామం వెళ్లి శాంతని జాగ్రత్తగా కిందకి దింపాడు. శాంత మొహం పాలిపోయింది. కళ్ళు తుకు దిగాయి. కంటికింద నలుపు యింకా నీరసస్థితిని సూచిస్తోంది. రామం ఒక్కసారి మామగారివైపు చూశాడు ఆయన మొహం తిప్పుకొని వచ్చే కన్నీటిని ఆపుకుంటూ గార్డు చూపే పచ్చజెండావైపు చూస్తున్నాడు. శాంతవైపు ఒకసారి చూశాడు. కాలి బొటన వేలు నేలకి రాస్తూ పమిటికొంగుతో మొహం కప్పుకొంది శాంత. రామానికేమీ పాలుపోవటములేదు. వచ్చిన పోర్టరుకి పెట్టి నెత్తికెత్తి ముగ్గురూ స్టేషను దాటారు. బండి మాట్లాడి శాంతని మెల్లిగా బండిలో ఎక్కించాడు రామం బండి మెల్లిగా సాగుతోంది. తన మొహం ఎవ్వరూ చూడలేక పోతున్నారు. ఇల్లు రాగానే తల్లి ఎదురొచ్చి యిన్ని మిరపకాయలు తిప్పి, శాంతని లోపలికి తీసికెళ్ళింది. చిట్టి తమ్ముడు అన్నయ్య మీదికి వచ్చాడు మామగారు పడక కుర్చీలో మేనువాల్చి, వాసాల వంక దీర్ఘంగా, గంభీరంగా చూస్తున్నారు.

తమ్ముడిని దింపి, వంటింటి గుమ్మంలోకి వెళ్లాడు రామం. శాంత అత్తగార్ని కావలించుకొని దుఃఖిస్తోంది. తల్లికూడ అలాగే ఉంది రామం వనుదిరిగి తనగదిలోకివచ్చాడు కిటికీ తలుపు తెరచి, తీక్ష్ణమైన ఎండచేత మెరుస్తోన్న మైదానం వంక చూస్తూ ఆలోచిస్తున్నాడు అంతలో యేగో తోచిందా తనికి బాధతో మొహం ముడుతలు పడినట్లు అయింది నిజంగా అంత పని జరిగి ఉంటుందా అనుకున్నాడు రామం ఏముంది, తన బిడ్డ లేదు. తల్లికి అపవాదులు తప్పించడానికే బిడ పోయిందేమో అనుకున్నాడు రామం. ఎక్కడినుంచో దుఃఖం పొంగిపొరి వస్తోంది. ఆగటం లేదు. రెండు చేతులతో మొహాన్ని కప్పుకొని అల్లాగే కూలబడ్డాడు రామం.

భోజనాలయినాక శాంత వచ్చింది. వాడిన మొహం యింకా తేరుకోలేదు. రామం శాంతని దగ్గరికి తీసికుంటూ గద్గదకంగా పోనీ యింత జరిగితే ఒక్క జాబు వ్రాయించలేదే? ఎంత బాధపడ్డావో అని ఓదార్చాడు

ఇంతలో పోస్టుబంట్రోతు వచ్చి కేక వేశాడు బిక్కమొహంతో ఒకమూల కూరుచున్న చిట్టితమ్ముడు ఒక్క గంతులో గుమ్మంలోకి వచ్చి యిచ్చిన కవరందుకున్నాడు కొత్త దస్తూరీ చూసి ఎవరబ్బా అనుకుంటూ తన పేరనే వచ్చిన కవరు చింపి చూశాడు అది ఒక ప్రయివేటు కంపెనీ నుంచి వచ్చింది ఇదివరకు జరిగిన యింటర్వ్యూలలో తను సెలక్టయినట్టు, వారం రోజులలోగా వచ్చి మేనేజరుగా ఛార్జి పుచ్చుకోమని వ్రాశారు వేడిగా బరువుగా ఒక్క నిట్టూర్పు వదిలాడు రామం నీరసంగా. ఆ ఉత్తరం చూసిన రామానికి ఏడవాలో, నవ్వాలో తెలియటము లేదు.

ఒకచేత్తో ఆ ఆర్డరు పట్టుకొని, శూన్యంగా శాంతవైపు చూస్తూ అల్లాగే నిలబడిపోయాడు రామం



బొమ్మరిల్లు

గాంధీతాత

"మోహన్"

(గాంధీగారు 1869 వ సంవత్సరం అక్టోబరు 2 వ తేదీన పుట్టారు ఆయన మన దేశానికి ఎన్నో కష్టాలు పడి చివరికి స్వాతంత్ర్యం సాధించారు. కృష్ణుడు, రాముడు మొదలైన పూర్వపు మహాపురుషుల పుట్టినరోజు పండుగలు ఇన్ని వేల ఏళ్ల తరవాత ఈ నాటికీ ఎల్లా చేసుకుంటున్నామో, అల్లాగే గాంధీ మహాత్ముడి పుట్టిన రోజుపండుగ కూడా ఎన్నో వందల ఏళ్లదాకా చేస్తూనే వుంటాము.)

ఓ భారతీయ బాల బాలికలార!
ఒక్కసారి పాడండి మనసార—
"మా గాంధితాత కన్నుల కాంతిధార
మా కెప్పుడుదారిచూపు ధ్రువతార.
మరణించడు గాంధితాత ఏనాటికీ,
మరల మరల అవతరించి దేశానికి
స్వాతంత్ర్యపు రాజబాట చూపుతాడు,
శాంతి అనే పూలతోట తెరుస్తాడు."
ఓ భారతీయ బాల బాలికలార!
ఒక గొంతై పాడండి మనసార—
"జయ జయ జయ ఓ శాంతిదూత!
జయ జయ ఓ స్వరాజ్యదాత!
మరువలేము యుగాలకైన నీ అమరగాధ,
మా గుండెల నిండింది నీ ప్రేమబోధ.
జయ జయ జయ మా గాంధితాత!
జయ జయ జయ మా భాగ్యధాత!"

అద్భుతమైన ఉంగరం

శ్రీమతి పల్లెల కమలాదేవి

అనగనగా ఒక వూరిలో ఒక రాజున్నాడు. ఆతనికి ముగ్గురు కొడుకులు. మూడోవానిపేరు రూపసింహుడు. ఒక రోజున రాజుగారు ముగ్గురుకొడుకులకు ఒక్కొక్కరికి 2 వేల రూపాయలు యిచ్చి ఇల్లా అన్నాడు. "అబ్బాయిలూ! మీరు నేనిచ్చిన డబ్బును ఎక్కువ చేసి తీసుకురావాలి. తెలిసిందా? మీలో ఎవరు ఎన్ని రెట్లు ఎక్కువ డబ్బు తెస్తే వారు ఎక్కువ తెలివిగలవారన్నమాట. నెలరోజులకల్లా యిక్కడకు రావాలి. తక్షణమే బయలుదేరి వెళ్లండి."

తండ్రి ఆజ్ఞప్రకారము ముగ్గురూ బయలుదేరి తలొక వూరూ వెళ్లారు. రూపసింహుడు మాట్లాడే పామునూ, మాట్లాడే చేపనూ, మాట్లాడే కుక్కనూ, మాట్లాడే పిల్లినీ, సంపాదించాడు. రూపసింహుని అన్నలు వ్యాపారం చేసి డబ్బు సంపాదించారు. నెలరోజులకల్లా ముగ్గురూ ఇంటికి చేరుకున్నారు.

తండ్రి "ఎవరెవరు ఏమేమి సంపాదించారు?" అని అడిగాడు. రూపసింహుని అన్నలు తాము సంపాదించింది చెప్పారు. ఇక రూపసింహుని వంతు వచ్చింది. ఏమని చెబుతాడు తండ్రితో? తను కొన్న పాము, చేప, పిల్లి, కుక్కలను చూపించి "నేను ఇవి సంపాదించుకొచ్చాను, నాన్నగారూ" అన్నాడు.

వాటిని చూసేసరికి రాజుకు బలే కోపం వచ్చింది. "ఓరి దౌర్భాగ్యుడా? నీఅన్నలు డబ్బు సంపాదించుకువస్తే నీవు డబ్బుఖర్చుపెట్టుకొచ్చావా? పాము, చేప, కుక్క, పిల్లి దేనికి పనికివస్తాయి? నేను డబ్బు సంపాదించుకు రమ్మన్నాను గాని వీటిని కొనుక్కురమ్మనలేదు. నీవు నాయింట్లో ఉండదగవు. నీకు రాజ్యమేలే గీత లేదు. ఫో" అని రాజుగారు కోపంగా అనేసరికి, రూపసింహుడు నిర్ఘాంతపోయాడు. "సరే నాన్నగారూ 'మీ ఆజ్ఞ శిరసా వహిస్తున్నా" నని తండ్రికినమస్కారము చేసి, తల్లివద్ద సెలవు పుచ్చుకొని తల్లి రహస్యంగా యిచ్చిన డబ్బు పుచ్చుకొని బయలుదేరి పోయాడు.

పాము, చేప, కుక్క, పిల్లి, రూపసింహుడు పోయిపోయి ఒక అరణ్యం చేరారు. ఆ అడవిలో ఒక పెద్ద పుట్ట వుంది ఆ పుట్టవద్ద పాము ఆగి "రూపసింహా! ఈ పుట్టే



మా పుట్ట. నేను ఆడుకొనేటప్పుడు పాములవాడు నన్ను పట్టుకొని నీకు అమ్మాడు. నువ్వు నన్ను వాడి నించి రక్షించావు. నేను మా తండ్రి నాగరాజుతో చెప్పి, నీకు సహాయం చేస్తాను. నేను మళ్లా వస్తాను. నువ్విక్కడే వుండు." అని పాము పుట్టలోకి వెళ్ళింది.

పామును చూడగానే పాముతల్లి దండ్రులు చాలా సంతోషించారు. పాము తల్లిదండ్రులతో తన స్థితీ రాకుమారుని స్థితీ చెప్పి, అతనికి సహాయం తప్పక చేయాలంది. నాగరాజు తన తలపైగల ఒక వుంగరం తీసి కొడుకుచేతి కిచ్చి దానిమహిమ చెప్పి రాకుమారుని కివ్వమంది. పాము పుట్టపైకి వచ్చి రూపసింహునికి వుంగరం యిచ్చి "ఈ వుంగరం మహిమ ఏమిటంటే, నీకు ఏది జరగాలని వున్నా అది మనసులో తలచుకొని ఈ వుంగరాన్ని పాలలోనూ నేతిలోనూ ముంచి నమస్కారం చెయ్యి. అది వెంటనే జరుగుతుంది. నీకు ఏదన్నా సహాయం కావాలంటే ఈ పుట్ట వద్దకు వచ్చి నన్ను పిలు." అని తను పుట్టలోకి వెళ్ళిపోయింది.

రూపసింహుడు మరికొంతదూరం పోగా అక్కడ ఒక పెద్ద సముద్రం వుంది. అక్కడ చేప రూపసింహునితో ఇట్లా అంది. "స్నేహితుడా! నీవు మమ్ము ఎంతకాలం భరిస్తావు. నేను ఈ సముద్రంలో వుంటాను. నీకు అవసరం వున్నప్పు డిక్కడకు వచ్చి పిలు." అని చేప సెలవుతీసుకొని సముద్రంలోకి వెళ్ళిపోయింది.

కుక్కా, పిల్లీ, రూపసింహుడూ ఒకనూరు చేరారు. రూపసింహుడు ఆ వూళ్లో ఒక పేదరాసిపెద్దమ్మ యింటికి వెళ్లి అక్కడే వుంటున్నాడు. పెద్దమ్మ ఒక రోజున మాటల సందర్భంలో ఈ క్రింది విషయం చెప్పింది.

"నాయనా! ఈ వూరి రాజుగారికి రూపవతి అనే చక్కని కూతురుంది. ఆమె కోసం ఒక ఒంటి స్తంభపు మేడ కట్టించి ఆ మేడ ఎదుట గాజు స్తంభము కట్టించారు. ఆ స్తంభముమీద ఆముదము ఎల్లప్పుడూ పోస్తూ ఉంటారు. క్రింద కత్తులు నాటించాడు. స్తంభానికి పైన ఒక గంట వుంది. అది ఎవ్వరైతే మోగిస్తారో వారికి రూపవతి నిచ్చి పెండ్లి చేస్తాడు. రూపవతి అందానికి ఆశించి ఎంతోమంది రాకుమారులు వచ్చి జర్రున జారే ఆ స్తంభాన్ని ఎక్కలేక క్రింద పడి మరణించారు."

ఈ కథంతా విని రూపసింహుడు, "నాకు ఒక గిన్నెలో పాలు ఒక గిన్నెలో నెయ్యి వేసి ఇవ్వు" మనగా అల్లాగే పెద్దమ్మ ఇచ్చింది. అతను ఒక గదిలోకి వెళ్లి తలుపులన్నీ వేసుకొని ఉంగరం పాలలోనూ, నేతిలోనూ ముంచి "నేను రేపు రాజుగారి గాజు స్తంభాన్నెక్కి ఏ అపాయమూ లేకుండా గంట కొట్టి దిగిరావాలి" అని అనుకొని నమస్కారం చేశాడు.

తెల్లవారగానే రూపసింహుడు అలంకరించుకొని రాజుగారి కోటకు వెళ్లి స్తంభము ఎక్కి గంట గణగణా మ్రోగించాడు. ఎవ్వరూ కొట్టలేని గంటను ఇతను కొట్టాడే అని అంతా ఆశ్చర్యపోయారు. ఇన్నాళ్లకు తనకు చక్కని అల్లుడు దొరికాడు గదా అని రాజు చాలా సంతోషించాడు. ఒక రోజున మహావైభవంగా రూపవతి రూపసింహులకు వివాహం అయింది. సుఖంగా వుంటున్నారు.

ఆ వూరిలో ఒక కంసాలి ఉన్నాడు. వాడు రూపసింహుడు చేసిన దానిలో ఏదో కిటుకు వుందని, అది కనుక్కోవాలని, అనుకున్నాడు. ఒక రోజున రూపవతి అంతఃపురదాసికి చాలాడబ్బు ఆశ పెట్టి "ఆ రహస్యం కనుక్కొని చెప్ప" మన్నాడు. చెబుతా నంది దాసి. ఒకసారి రూపసింహుడు ఇంకొక కోరిక కోరుకోవాలని పాలూ, నెయ్యి తీసుకెళ్లి గదితలుపులన్నీ వేసుకున్నాడు. కాని పొరపాటున ఒక కిటికీ తలుపు వేయలేదు. ఇదే సందను కొని దాసి అంతా చూచింది. మర్నాడు కంసాలితో చెప్పింది. ఉంగర రహస్యం చెప్పినందుకు కంసాలి దాసీదానికి బహుమానం చేశాడు. ఒక రోజున రూపసింహుడు అడవికి వేటకు వెళ్లుతూ ఉంగరము భార్య చేతికి పెట్టి వెళ్లాడు. కాని ఉంగర రహస్యం చెప్పలేదు. ఈ సంగతి చూచి, దాసి వెళ్లి కంసాలితో చెప్పింది. కంసాలి పదిఉంగరాలు తీసుకొని రూపవతిభవనానికి వెళ్లాడు. రూపవతి ఆ వుంగరాలు చూస్తుండగా కంసాలి ఇల్లా అన్నాడు.

"అమ్మా! మీచేతికి కొత్తరకపు ఉంగరం ఉంది. అది నాకు మాదిరి కివ్వండి. నేను ఆవుంగరపు మాదిరివి చేసిన తరువాత మీ ఉంగరము తెచ్చిఇస్తాను." రూపవతి ఉంగరమును కంసాలికి ఇవ్వగా వాడు యింటికి వెళ్లిపోయాడు. ఆ రాత్రి వుంగరమును వాడు పాల

లోనూ, నేతిలోనూ ముంచి ఇలాగ అనుకున్నాడు. "తెల్లవారేసరికి సముద్రం అవతల మేడలో నేనూ, రాకుమార్తె, ఉంగర రహస్యం చెప్పిన దాసీదీ ఉండాలి. రాకుమారుడు వాళ్ల మేడప్రక్కన పడివుండాలి."

తెల్లవారేసరికి కంసాలి కోరుకున్నట్లు అన్నీ జరిగిపోయాయి. రాజుగారు నిద్ర లేచేసరికి అల్లుడు మేడపక్కన పడివుండటం కనిపించింది. వెంటనే రాజు వెళ్లి అల్లుణ్ణి లేపి "నాకుమార్తె ఏది, నువ్వు యిక్కడవున్నావు ఎందుకు" అని అడిగాడు. రూపసింహుడు ఎంతో దుఃఖించి "నాకు 10 రోజులు గడువు యివ్వండి." అని సెలవు తీసుకొని పోయాడు. పాము పుట్ట వద్దకు వెళ్లి, "చిన్నారిపామా" అని పిలిచాడు. పాము వెంటనే తండ్రితో సహా బయట కొచ్చింది. రూపసింహుడు వాళ్లతో జరిగినది చెప్పాడు. అప్పుడు నాగరాజిల్లా అన్నాడు. "రాకుమారా, నాకు దివ్యదృష్టి వుంది. అక్కడ వాళ్లు ఏం చేస్తున్నదీ చెబుతాను విను. కంసాలి నీ భార్యను వివాహం చేసుకోమని అడిగాడు. నీభార్య పతివ్రతగాబట్టి వాడినుండి తప్పించుకొందామని వాడితో "నాకు ఒక సంవత్సరము వ్రతమున్నది. ఆ వ్రతసమాప్తి అయినతరువాత ఈ మాట ఆలోచించి చెబుతాను." అని అన్నది. వాడు నిద్రపోయేటప్పుడు ఉంగరం నోట్లో పెట్టుకొని నిదపోతాడు. పగలల్లా ఉంగరాన్ని చేతికి పెట్టుకుంటాడు."అని ఈ మాటలు చెప్పి వెళ్లిపోయాయి.

రూపసింహుడు గబగబా కుక్క, పిల్లీ వద్దకు వెళ్లి జరిగినదంతా చెప్పాడు. ఓకుక్కా! నువ్వు సముద్రంలో ఈదుకుంటూ వెళ్లు. పిల్లీ! నువ్వు కుక్కవీపు మీద కూర్చొని వెళ్లు. కంసాలిమేడకు వెళ్ళి ఎలుకలతో స్నేహం చేసుకో. వాడు నిద్రపోయేటప్పుడు ఎలుకలను రెండు ముక్కులలోను తోకలను పెట్టమను. వాడు తుపుక్కున తుమ్ముతాడు. అప్పుడు నువ్వు ఉంగరము నోటకరచుకొనిరా. అని చెప్పాడు. రూపసింహుని సలహా ప్రకారము అవి బయలుదేరినవి.

రాజకుమారుడు చెప్పిన ప్రకారమే కుక్క, పిల్లి పని పూర్తిచేశాయి. పిల్లి ఉంగరమును నోట కరచుకొని కుక్క వీపు ఎక్కింది. సముద్రపు ఒడ్డు చేరేముందు, కుక్కవీపుమీదనుండి పిల్లి పాపం జారిపడింది. దాంతో వుంగరం కాస్తా సముద్రంలో పడింది. పిల్లిమాత్రం ఎల్లాగో కుక్కవీపును మళ్లీ ఎక్కింది. రెండూ ఒడ్డుకు వచ్చి సంగతంతా చెప్పి ఏడ్చాయి. రూపసింహుడు వాటిని ఓదార్చి, "ప్రియమైన చేపా! అని పిలిచాడు. చేప వచ్చింది. రూపసింహుడు జరిగినదంతా చెప్పి "ఆ వుంగరం ఎలాగైనా తేవాలి" అన్నాడు.

చేప సముద్రంలో బాగా వెదికి వుంగరం తెచ్చి రాకుమారునికి ఇచ్చి వెళ్లిపోయింది. రూపసింహుడు ఒకరి యింటికి వెళ్లి పాలూ నెయ్యీ. అడిగి తీసుకొని వుంగరాన్ని వాటిలోముంచి "తెల్లవారేసరికి కంసాలి, దాసీది, సముద్రంలోపడి చావాలి. నాభార్యా నేనూ మా మేడలో వుండాలి." అస నమస్కారం చేశాడు. తెల్లవారేసరికి అన్నీ జరిగాయి. రాజు కూతురునూ అల్లుడినీ చూసి సంతోషించి తన రాజ్యాన్ని అల్లుడికే పట్టంగట్టి తానూ వాళ్ల వద్దనే వుంటున్నాడు.

ఆ తరవాత కొన్నాళ్లకి రూపసింహుని తల్లిదండ్రులూ, అన్నలూ శత్రువుల చేతిలో ఓడిపోయి, రాజ్యము పోగొట్టుకుని దేశాలు తిరుగుతూ, రూపసింహుడున్న దేశం వచ్చారు. రూపసింహుడు వారిని గుర్తుపట్టి, తీసుకు వచ్చి ఆదరించాడు. తండ్రి తను చేసిన తప్పుకు క్షమాపణ కోరాడు. రూపసింహుడు తన ఉంగర ప్రభావంవల్ల తండ్రిరాజ్యాన్ని జయించి తండ్రికి, అన్నలకూ యిచ్చేశాడు. అక్కడ వాళ్లూ, ఇక్కడ రూపసింహుడూ అంతా సుఖంగా కాలం గడిపారు.

బొమ్మరిల్లు:

ప్రాంతి పార్టీ

ఇంతవరకూ జరిగిన కథ:— చుక్కూ, గెక్కూ అన్నదమ్ములు. వాళ్ల నాన్న ఎక్కడో దూరాన అడవిలో సర్కారుఉద్యోగం చేస్తున్నాడు. పిల్లలిద్దరూ మాస్కో పట్నంలో తల్లితో వున్నారు. వాళ్ల నాన్న వాళ్ల నొకసారి చూసిపొమ్మని వుత్తరం రాసి, తరవాత తనెక్కడికో పనిమీద వెడుతున్నానని, ఇప్పుడు రావద్దనీ టెలిగ్రాం యిచ్చాడు. పిల్లలు టెలిగ్రాం పారేసి ఆ సంగతిని తల్లితో చెప్పలేదు. తల్లీ పిల్లలూ రైలెక్కి బయలుదేరారు. తీరా వెడితే అక్కడ నాన్న లేడు.

ఒక బల్లచెక్కమీద వాలి, తీవ్రంగా ఆలోచించింది ఆమె. ఏమి జరిగుంటుంది? వాళ్ళంతా ఏమైపోయుంటారు? ఇప్పుడేం చెయ్యాలి? వెనక్కి వెళ్ళిపోవడమా?.. ఆమెదగ్గిర బండివాడి కివ్వడానికే ఉంది డబ్బు. కాపలావాడొచ్చేదాకా చూడాలి. రెండు మూడు గంటల్లో బండివాడు వెళ్ళి పోతాడు. కాపలావాడీ—లోపుగా రాకపోతే? రైల్వేస్టేషనూ, టెలిగ్రాముల ఆఫీసూ అరవైమైళ్ళలో ఎక్కడా లేవు.

బండివాడు లోపల కొచ్చి, వాసన పసికట్టి మా చుట్టూ చూశాడు. స్టవ్ దగ్గిర కెళ్ళి అందులో చూశాడు.

కాపలావాడినిఫీ రాత్రిలో వచ్చేస్తాడు. ఇదిగో ఇందులో కాబేజిపులుసుకుండ ఉంది. చాలా దూరం వెళ్ళుంటే అది నిప్పుమీద అట్టే పెట్టేవాడు కాదు. మీరు ఆలోచించుకోండి" అన్నాడతను ఆమెవంక చూసి. "ఇటువంటి పరిస్థితుల్లో, మిమ్మల్ని ఊరికేనే స్టేషన్ దగ్గిర తీసికెళ్ళి దిగబెట్టా-నాకేమీ ఇవ్వక్కర్లేదు-నేనంత జాలి లేనివాణ్ణి కాదు."

"అక్కర్లేదు-స్టేషన్ కెళ్ళి మేము చేసేదేమీ లేదు." అంది వాళ్ళమ్మ.

మళ్ళీ నీళ్ళకాగు పొయ్యిమీది కెక్కించారు. వెన్నపేరు తల్చుకుంటూ రొట్టె తిని, మంచినీళ్ళు తాగారు. వాళ్ళమ్మ వాళ్ళకి కావలసినవన్నీ బైటికి తీసింది. చుక్కూ గెక్కూ వెచ్చగా పొయ్యిపక్కనే పడుకున్నారు. ఏదో వాసన వాసనగా ఉంది - గొత్తాతో అంకోట్లూ అవీ. వాళ్ళిద్దరూ నీరసంగానే వున్నారు. ఎక్కువసేపు నిశ్శబ్దంగా ఉండడం కష్టం. వెంటనే నిద్రపోయారు వాళ్ళు!

బండివాడు వెళ్ళిపోవడం, వాళ్ళమ్మ వచ్చి పక్కనే పడుకోవడం తెలియనే తెలియదు వాళ్ళకి. గుడిసెలోకి చీకటి బాగా పాకిపోయినతర్వాత మెళుకువ వచ్చింది. మెట్లమీద అడుగుల చప్పుడవడంతో ముగ్గురూ లేచారు. ఏదో పెద్ద చప్పుడుతో కిందపడ్డది. తలుపు తోసుకుని చేతిలాంతరుతో కాపలావాడు లోపలి కొచ్చాడు. పెద్ద కుక్కొకటి వెనకాలే ఉంది. వీపు నున్న తుపాకి క్రిందికి జార్చి, చచ్చిన కుందేల్ని బల్లమీద పడేసి, లాంతరెత్తి పట్టుకుని చూస్తూ, పొయ్యిదగ్గిరికి వచ్చాడు. "ఎవరు మీరు? ఏంచేస్తున్నారిక్కడ?"

"నేను జియలాజికల్ పార్టీ ముఖ్యుడైన సెర్యోగిన్ గారి భార్యని. వీళ్ళు ఆయన పిల్లలు" అంది వాళ్ళమ్మ దగ్గిరగా వచ్చి. అతను పాలిపోయిన వాళ్ళ మొహాలకేసి తిప్పాడు లాంతరు. "అచ్చం ఆయన పోలికే-బాగుంది. ఈ అబ్బాయికి మరీనీ." అంటూ వేలు చుక్ వేపు చూపించాడు.

ఇద్దరికీ కోపం వచ్చింది-చుక్ కి తనని లావుగా ఉన్నాడన్నాడని. గెక్ ఎప్పుడూ చుక్ కంటె తనకే నాన్నపోలిక లెక్కువ వున్నాయి అనుకుంటూ ఉండేవాడు.

"ఎందుకంత తొందరపడి వచ్చారు మీరు? రావద్దని చెప్పారు కదా?" వాళ్ళమ్మ వేపు చూస్తూ అడిగాడతను.

"నువ్వు చెప్పేదేమిటో అర్థం కావటం లేదు. ఎవరు చెప్పారు మమ్మల్ని రావద్దని?"

"నేనే-నేనే ఆయనిచ్చిన టెలిగ్రాం తీసికెళ్ళి స్టేషన్ లో ఇచ్చాను. అందులో విశదంగా ఉంది-రెండు వారాలదాకా రావద్దు. మేము పని మీద వెళ్తున్నాము అని ఆయన

మూలం:
ఆర్కేడీ గైడర్

అనువాదం:
కృష్ణ ప్రసాద్

చెప్పినట్టెందుకు చెయ్యలేదూ?"

"ఏ టెలిగ్రాంసంగతి నువ్వంటున్నది?" వాళ్ళమ్మ మళ్ళీ అడిగింది. "మాకే టెలిగ్రామూ అందలేదే" అని, నిర్ధారణ చేసుకుంటున్నట్టు, చుక్ గెక్‌ల వైపు చూసింది.

ఒకరి మొహాలొకరు చూసుకుంటూ స్టవ్ ప్రక్క కెళ్ళి నిలబడ్డారు. అనుమానంతో ముందుకొచ్చిందావిడ. "నేను లేనప్పుడు టెలిగ్రామేదన్నా వచ్చిందిట్రా?" జవాబుమాత్రం రాలేదు. "జవాబు చెప్పండి! ఇంటికి టెలిగ్రాం వస్తే ఇవ్వడం మరిచిపోయారా?" రెట్టించింది వాళ్ళమ్మ.

కొన్ని క్షణాలు గడిచాయ్. ఇద్దరూ ఏడవడం మొదలెట్టారు. చుక్ తగ్గుస్థాయిలోను-గెక్ హెచ్చుస్థాయిలోనూ.

"వెధవల్లారా! నాకు చావొచ్చింది మీతో, ఏడుపు కట్టిపెట్టి అసలు జరిగిందేమిటో చెప్పండి." వాళ్ళమ్మ కడుపు మండిపోతోంది.

చావు అనేమాట వినేటప్పటికి ఇంకా గట్టిగా శోకాలు పెట్టడం మొదలెట్టారు. ఆ దుఃఖమంతా దిగమింగి కథ బైటికి కక్కేటప్పటికి చాలాసేపు పట్టింది. తప్పెవరిదో అన్నదాన్ని గురించి మాత్రం ఆట్టే దెబ్బలాడుకోలేదు.

అటువంటి పిల్లల్నేం చెయ్యాలి చెప్పండి. కట్టేసి కొట్టాలా? కొట్లో పెట్టాలా? ఇనపగుళ్ళు వీపుమీద పెట్టి, గొలుసుతో కాళ్ళూ చేతులూ బంధించి బరువుపనులు చేయించే చోటికి పంపాలా? ఊహు! వాళ్ళమ్మ ఇటువంటి వేమీ చేయ నిట్టూర్పు విడిచి, వాళ్ళని పొయ్యిదగ్గరనుంచి ఇవతలకి వచ్చి ముక్కులు తుడుచుకుని మొహాలు కడుక్కోండని ఆజ్ఞాపించి ఇప్పుడేం చేస్తే బావుంటుందని కాపలాఅతన్ని అడిగింది.

వాళ్ళ దేదో పెద్ద అగాధం పరీక్షించడానికి అవసరంగా వెళ్ళారట. కనిసం పదిరోజులన్నా అవందే రారని చెప్పాడు అతను.

"మరి ఈ పదిరోజు లెట్లా గడపటం? మాదగ్గిర ఆహారపదార్థాలు కూడా ఏమీ లేవే?" అంది వాళ్ళమ్మ.

"ఎట్లాగో అట్లా గడుపుకోవాలి. కొంత రొట్టె ఇస్తాను మీకు. చర్మం వలుచుకుని ఆ కుందేల్ని తినొచ్చు. రేపు నేను అడవిలో కెళ్ళి అక్కడ పెట్టిన బోనుల్లో ఏమన్నా పడ్డాయేమో చూడాలి" అని జవాబిచ్చాడతను.

వాళ్ళమ్మ ఖంగారెత్తిపోయింది." మేముక్కళ్ళం ఎట్లా ఉండమిక్కడ? ఈ చోటంతా మాకు కొత్త- ఎక్కడేదుంటుందో తెలియదు-చుట్టూరా అంతా అడివీ, మృగాలూ..."

"మీదగ్గి రొక రైఫిల్ ఉంచుకోండి. ఆ పంచలో కట్టెలున్నాయ్. కొండవెనక నీళ్ళున్నాయి. ఈ డబ్బాలో కొద్దిగా ఉప్పుంది. నేను అవసరంగా పోవాలి-తెలిసిందా?" అన్నాడతను.

"మురికివెధవ!" గెక్ చుక్‌తో అన్నాడు మెల్లిగా, "మాట్లాడకు! ఇప్పుడు మనల్ని బైటికి విసిరికొట్టకుండా ఉంటే అంతే చాలు. నాన్న వచ్చాక వాడిపని పడ్దాం" అన్నాడు చుక్.

"నాన్న వచ్చేదాకానా? అంతవరకూ వాడిక్కడుండడుగా? పాపం! అమ్మ ఎట్లా ఉందో చూడు" గెక్ వాళ్ళమ్మదగ్గిరి కెళ్ళి వళ్ళో కూచుని, కోపంగా చూశాడు కాపలావాడివంక.

అతను ఉన్నికోటు విప్పేసి దీపమున్న బల్లదగ్గరి కెళ్ళాడు. గెక్ అప్పుడే అతని కోటువెనక ఒక పెద్ద ముక్క-- భుజందగ్గిర్నుంచి నడుముదాకా- చిరిగి వేళ్ళాడుతూండడం చూశాడు.

"కాబేజిపులుసు పొయ్యిమీద ఉంది. అక్కడ అలమరలో చెంచాలు, గిన్నెలు ఉన్నాయి. మీరు భోంచెయ్యండి. ఈలోపల నా కోటు కాస్త కుట్టుకుంటాను.' అన్నాడతను. "నువ్వు వాటి సంగతి చూస్తూండు. నేను కుట్టిపెట్తాను నీ కోటు-నీకంటే కొంచెం బాగా చేయగల ననుకుంటా" అంది ఆమె. అతను ఆమెవే పొకసారి చూసి తీవ్రంగా చూస్తున్న గెక్ చూపుల్ని ఎదుర్కున్నాడు.

"గట్టివాడివేలే నువ్వు. తెలుస్తూనేఉంది" అనుకుంటూ కోటు ఆమెకి అందించి, అలమారలో పళ్ళాలు తీసుకురావడానికి వెళ్ళాడు.

"ఎట్లా చినిగిందది? "అని అడిగాడు చుక్ అతని కోటులో కన్నాలవేపు చూపిస్తూ.

"చిన్న దెబ్బలాట జరిగింది ఒక ఎలుగుబంటితో. అది గోళ్ళతో గీసింది" మెల్లిగా జవాబిచ్చాడు, పులుసుకుండ పొయ్యిమీంచి ఎత్తి బల్లమీద పెడుతూ.

అతను గదిలోంచి వెళ్ళిపోయాక అన్నాడు చుక్ "విన్నావట్రా గెక్! వాడు ఎలుగుబంటితో దెబ్బలాడా

(౩౮-వ పేజీ చూడుడు)

గొల్లవాడి ధనం

“పిన్నారి”

మగధదేశాన్ని పాలించే విక్రమవర్మ మహారాజు ఒకసారి అడవికి వేటకి వెళ్లాడు. అడవిలో ఒక మామిడిచెట్టుమీద పిల్లనగ్రోవి వూదుతూ గొర్రెలను కాచుకొంటున్న ఒక గొల్లకుర్రాడు కనిపించాడు.

ఆ కుర్రవాడి ముఖం, అతడు మాట్లాడే తీరు చూసి మహారాజు ఇతడు చాలా తెలివైనవాడనుకున్నాడు. రాజు అడిగిన ప్రశ్నలకు సరియైన సమాధానాలు నిర్భయంగా, వినయంగా చెప్పాడు ఆ గొల్లకుర్రవాడు. రాజుకు అతనిమీద ప్రేమ కలిగి తనతోకూడా మగధరాజ్యానికి తీసుకుపోయాడు.

ఆ కుర్రవాడి అసలు పేరును మార్చి, ‘సుబుద్ధి’ అని రాజు కొత్తపేరుపెట్టాడు. సుబుద్ధికి అన్ని విద్యలూ నేర్పించాడు. క్రమంగా సుబుద్ధి పెరిగి పెద్దవాడయ్యాడు. అతని మంచితనం, తెలివి తేటలు చూసి రాజు అతన్ని తన మంత్రిగా చేసుకున్నాడు. తన కోశాగారమును కూడా సుబుద్ధికే అప్పగించాడు. సుబుద్ధి ఎంతో ధర్మంగా ప్రవర్తించేవాడు.

కాని ఎవరో గొల్లకుర్రాడిని తీసుకువచ్చి అతనికి మంత్రిపదవి యివ్వటం, ఖజానాని అంతటినీ అతనికి అప్పగించటం మిగతా మంత్రులకూ, సేనాధిపతులకూ ఎవ్వరికీ యిష్టంలేదు. ఏమైనాసరే ఈ సుబుద్ధిని రాజ్యంలోంచి వెళ్లగొట్టెయ్యాలనుకున్నారు. సమయం చిక్కినప్పుడల్లా రాజుతో సుబుద్ధిమీద చాడీలు చెప్పారు. కాని విక్రమవర్మ సుబుద్ధిమీద అపరిమితమైన ప్రేమ, నమ్మకం ఉండటంచేత, అతడెప్పుడూ చెడ్డపనులు చెయ్యడని తలచి మరెవ్వరి మాటలూ వినేవాడు కాదు.

ఇల్లా వుండగా కొన్నాళ్లకి విక్రమవర్మ మహారాజు మరణించాడు. ఆయన స్థానంలో ఆయన అల్లుడు విజయసేనుడు రాజ్యానికి వచ్చాడు. ఇతడు విక్రమవర్మ అంత మంచివాడు కాదు. ఎవరేది చెబితే అది నమ్ముతూ, అందరిమీదా అనుమానపడేవాడు.

ఇక మంత్రులూ, సేనాపతులూ, కొత్తరాజుకు నూరి పొయ్యడం మొదలెట్టారు. “చూశారా! గోచి పెట్టుకుని రాజ్యంలోకి వచ్చిన గొల్లకుర్రాడు ఇవ్వాళ పెద్ద మేడ, కొండంత ఆస్తి సంపాదించాడు. ఈ ద్రవ్యంతా రాజుగారి ఖజానాలోనుంచి కాకపోతే ఎక్కడినించి వచ్చింది? ”అని సుబుద్ధిమీద ఎప్పుడూ చాడీలు కల్పించి చెప్పేవారు.

విజయసేనుడికికూడా సుబుద్ధిమీద అనుమానం కలిగింది. సుబుద్ధిని పిలిపించి “ఏమయ్యా సుబుద్ధీ! మా మామగారు నిన్ను నమ్మి చాలా మోసపోయాడు. నువ్వు మా ఖజానాని అంతా నెమ్మదిగా వశం చేసుకొని మేడలు, మిద్దెలు కట్టించుకొన్నావు. అవన్నీ నేను ఇవ్వాళనుంచి లాగివేసుకుంటున్నాను. నిన్ను మంత్రి ఉద్యోగంలోనుంచి తీసివేశాను.” అని చెప్పాడు.

చేతులు జోడించుకుని నిలబడ్డ సుబుద్ధి ధైర్యంగా ఇల్లాగ అన్నాడు.

(35-వ పేజీ చూడుడు)



మనంనివసించేభూమి ఎలా వచ్చింది?

వెన్నెల రాత్రిళ్లు ఆరుబయట పడుకుని ఆకాశంకేసి చూస్తుంటే అందరికి బోలెడు ఆలోచనలు వస్తాయి. మనం పుట్టినప్పటినుంచీ ఈభూమి, నక్షత్రాలు, సూర్యుడు, చంద్రుడు, అన్నిటినీ చూస్తూనే వున్నాము గదా? ఇవన్నీ ఎక్కడి నుంచి వచ్చాయి? వీటి నెవరు పుట్టించారు? ఎందుకు పుట్టించారు? అని ప్రశ్నలువస్తాయి.

భూమిమీద కొండలు, నదులు, అడవులు, సముద్రాలు, జంతువులు అనేక మున్నాయి. ఇవన్నీ ఎల్లా వచ్చాయి? అని కూడా ప్రశ్న వస్తుంది. ఈ ప్రశ్నలన్నిటికీ సమాధానం తెలుసుకోవాలని మీా కుంటుంది. ఆ సమాధానం కోసం వారం వారం యీ పత్రిక చదివి తెలుసుకోండి.

భూమి చాలా చిన్నది.

మనం రైళ్లలోనూ, ఓడల్లోనూ, విమానాల్లోనూ వందలకొద్దీ మైళ్లు ప్రయాణంచేస్తాము. కాని ఎంత దూరం పోయినా కనిపించే భూమికి ఆఖరంటూ వుండదు. అబ్బో! ఎంత పెద్దది ఈ భూమి; ఆసియా, ఆఫ్రికా, యూరపు, అమెరికా మొదలైన పెద్ద పెద్ద ఖండాలున్నాయి ఈ భూమిలో. ఈభూమి ముందు మినుకు మినుకు మంటూ కనిపించే ఆచుక్కలు, ఫుట్‌బాల్ మాదిరిగా ఆకాశంలో ఎగిరే సూర్యుడు ఏ మూలకి? అనుకుంటాము.

కాని, నిజం చెప్పాలంటే- ఇంత పెద్దగా కనిపించే ఈ భూమిని నక్షత్రాలతో పోల్చి చూస్తే కళ్లు చిట్టించుకు చూస్తేగాని కనిపించనంత నలక మల్లే వుంటుంది. భూమికంటే కొన్ని కోట్ల రెట్లు పెద్దవైన నక్షత్రాలున్నాయి. సూర్యుడు కూడా భూమికంటే 13లక్షల రెట్లు పెద్ద వాడు.

అబ్బో, ఎంతదూరం!

సరేనయ్యా, భూమికంటే నక్షత్రాలు పెద్దవంటున్నావు; పెద్దవైతే పెద్దవిగా కనిపించవద్దా, నలకల మల్లే కనిపించడం దేనికి? అని మీారడుగుతారు.

సముద్రం ఒడ్డున నుంచుని దూరాన్నుంచి వచ్చే ఓడను చూస్తూవుంటాము. మొదట్లో ఒక చిన్న వస్తువుమల్లే కనిపిస్తుంది. ఓడ దగ్గిరి కొస్తున్న కొద్దీ పెద్దదిగా కనిపిస్తుంది. అల్లాగే నక్షత్రాలుకూడా చాలా దూరాన వుండడంమూలాన అంత చిన్నవిగా కనిపిస్తున్నాయి. మనమే గనక ఏదనా ... గూన ఎక్కి కొన్ని లక్షల ... కాశం లోకి ఎగిరిపోగలిగితే నక్షత్రాలన్నీ క్రమంగా పెద్దవిగా కనిపిస్తాయి.

మనకి అన్నిటికంటే దగ్గరగా వున్న నక్షత్రం సూర్యుడే. దగ్గిర అంటే ఎంతో తెలుసా? 9కోట్ల 30లక్షల మైళ్లు. అన్నిటికంటే దగ్గిరగా వున్న సూర్యుడే యింత దూరంలో వుంటే, ఇక నక్షత్రాల మాట చెప్పే దేమిటి? కొన్ని కోట్ల కోట్లకోట్ల మైళ్ల దూరంలో వున్నాయి. ఎంతదూరంలో లేక పోతే అంత పెద్ద నక్షత్రాలు అంత చిన్నవిగా కనిపిస్తాయో ఆలోచించండి.

సూర్యుడికి కూతురు భూమి

అయితే సూర్యుడికీ, భూమికీ వున్న చుట్టరికం ఏమిటో తెలుసుకోవాల్సి వుంది. సూర్యుడు మన భూమికి తండ్రి. సూర్యుడికి చాల మంది పిల్లలు పుట్టారు. బుధుడు, శుక్రుడు, అంగారకుడు, బృహస్పతి మొదలైన గ్రహాలున్నాయే, అవన్నీ సూర్యుడికి కొడుకులే.

సూర్యుడు ఒక పెద్ద అగ్నిగోళం. అనేకరకాల వాయువులు కలిసి ఎప్పుడూ అక్కడ భగభగ మండుతూవుంటాయి. ఆ మంటవల్లనే భూమిమీద వున్న మనకి వేడి, వెలుతురు వస్తున్నాయి. ఆ అగ్ని

గోళంలోనుంచి ఎప్పుడో కొన్ని కోట్ల ఏళ్లకిందట కొన్ని ముక్కలు బద్దలై వూడిపడ్డాయి. ఆ ముక్కలు సూర్యుడికి దూరంగా పోయి గిర గిర సూర్యుడి చుట్టూ తిరగటం మొదలుపెట్టాయి. ఆ ముక్కల్లో ఒకటి భూమి. మిగతావి ఇందాక చెప్పినవాటిలాంటి గ్రహాలు. ఇవన్నీ అన్నేళ్లనించీ సూర్యుడిచుట్టూ తిరుగుతూనేవున్నాయి.

ఎందుకు అల్లా తిరగాలి అని ఒక ప్రశ్న వస్తుంది. సూర్యుడికి సూదంటు రాయికిమల్లే ఆకర్షించే శక్తి వుంది. అంటే ఏవస్తువైనా దగ్గిరికి వస్తే దాన్ని దగ్గిరికి లాకుంటాడు. ఆ శక్తితో ఒకవేపు సూర్యుడు భూమిని లాగుతూ వుంటాడు. మొదట్లో సూర్యుడి నుంచి భూమి మహావేగంగా విసిరి వేయబడిందికదూ. ఆ వేగం ఇంకా భూమికి వుండటంవల్ల భూమి సూర్యుడికి దూరంగా పారిపోదామని చూస్తుంది. అటు సూర్యుడి ఆకర్షణశక్తి, ఇటు భూమి పారిపోయే వేగమూ రెండూ పనిచేసి భూమిని మధ్య దోవ పట్టిస్తాయి. మధ్యదోవ అంటే, గుడిచుట్టూ భక్తులమల్లే సూర్యుడి చుట్టూ ప్రదక్షిణాలు తిరగటమే.

ఇదీ భూమి పుట్టుపూర్వోత్తరాల కథ. ఇక ఈ భూమి సూర్యుడి నుంచి వేరుపడినతర్వాత ఏవిధంగా మారుతూ వచ్చిందీ, దానిమీద జంతువులూ, మనుషులూ, కొండలూ, సముద్రాలూ రావటం ఎల్లా జరిగిందీ వచ్చేవారం తెలుసుకుందాం.

గొల్లవాడి ధనం

(32-వ పేజీ తరువాయి)

"రాజా! నేను విక్రమవర్మనిలాగానే నిన్నుకూడా సేవిస్తున్నాను. నువ్వు పొమ్మన్నావు కాబట్టి వెళ్లిపోతాను. కాని ఒకసారి మీరు ఖజానానికి వచ్చి చూడండి. ధనం నేను అపహరించినట్టు కనిపిస్తే మీరు నన్ను శిక్షించవచ్చును." అన్నాడు.

రాజు సరేనని, ఖజానాకు వెళ్లాడు అక్కడ ధనం ఏమీ తరగలేదు సరికదా, విక్రమవర్మ కాలంలో కంటే ఎక్కువ డబ్బు నిలవలో వుంది. రాజది చూసి ఇంకేమీ అనలేక పోయాడు. కాని ప్రక్కన వున్న ఒక మంత్రి "అయ్యా! ఇక్కడ కాదు. తన మేడలో దాచి వుంటాడు డబ్బు. అది వెదికి పట్టుకుందాం." అని చెవిలో చెప్పాడు.

రాజు వెంటనే సుబుద్ధిని వెంట బెట్టుకుని అతని యింటికి వెళ్లాడు. ఆ యింట్లో కూడా సుబుద్ధి డబ్బు దాచినట్టు లేదు. రాజు ఇక పోదామని వెనక్కి తిరిగాడు. అప్పుడు మరొక మంత్రి "రాజా! ఆ వెనకాలగది తాళం పెట్టివుంది. అది కూడా చూద్దాం." అన్నాడు.

రాజు ఆ గది తెరవమన్నాడు సుబుద్ధి సిగ్గుపడుతూ మాట్లాడకుండా నిలుచున్నాడు.

"మాట్లాడవేమయ్యా! ఆ గదిని కూడా మేము చూడాలి, అందులో ఏమన్నా దాచావేమో." అని గద్దించాడు రాజు.

"రాజా! అందులో నా ధనం దాచిన మాట నిజమే. కాని అది నా స్వంత ధనం. ఈ మేడ, ఈ ఐశ్వర్యం ఇదంతా విక్రమవర్మ చలవ. మీ చలవ. ఇది మీరు తీసుకోండి. కాని ఆ గదిలో ధనాన్ని మాత్రం మీరు ముట్టుకోవద్దు." అని సుబుద్ధి అన్నాడు.

"ఓయి దొంగా! నన్నే మోసం చేద్దామనుకుంటున్నావా? నీ మొహం, గోచీపాతరాయుడివి, నీకు సొంత డబ్బెక్కడిదీ? తియ్యి ఆ గది తాళం." అని రాజు మండిపడ్డాడు. మంత్రులూ వాళ్లూ యిష్టమొచ్చినట్టు సుబుద్ధిని తిట్టారు.

సుబుద్ధి ఏమీ కోపంగాని, భయంగాని చూపించకుండా ఆ మారుమూలగదిని కూడా తెరిచాడు. అందులో కూడా ఏమీ లేవు. ఒక అలమారలో మాత్రం ఒక గొల్ల కంబళీ, పిల్లనగ్రోవి, పాత చెప్పులు, చేతికర్ర కనిపించాయి. అంతా తెల్లబోయారు.

"రాజా! నలభైఏళ్ల కిందట నేను అడవుల్లో గొర్రెలు కాచుకుంటున్నప్పుడు విక్రమవర్మ నన్నీ వేషంలోనే చూశాడు. ఈ వస్తువులు, ఆ గొర్రెలే నా స్వంతధనం. అప్పటినుంచీ ఈ వస్తువులను జాగ్రత్తగా దాచిపెట్టాను, ఇదే నాకున్న ధనమంతా. నీ రాజ్యంలో ఐశ్వర్యం అనుభవించటంకంటే అడవుల్లో గొర్రెలను కాచుకుంటూ స్వేచ్ఛగా వుండటమే నా కిష్టం." అని రాజుకు నమస్కారం పెట్టి సుబుద్ధి తన వస్తువులు తీసుకుని వెళ్లిపోయాడు.

బుల్లి కథ:

పదివేల రత్నాలు

మాయింట్లో కామయ్య అనే ఒక పాలేరు ఇదివరకు పని చేసే వాడు. అతను మాకు బలేబలే కథలు చెప్పేవాడు. రాత్రి పక్కలు వేసిం తరవాత, మే మంతా అతన్ని పీక్కుతినేవాళ్లం కథలు చెప్పమని. తమాషాకథలు అప్పటి కప్పుడు కల్పించి చెప్పేవాడు. రోజూ ఒక కథ చెప్పి "ఇక నిద్రపొండి," అనే వాడు. మేము "ఇంకొక్క బుల్లికథ చెబితేనే గాని వీల్లే" దని మొండికెత్తేవాళ్లం.. సరే నని బుల్లికథ చెప్పే వాడు. అతన్ని కథల కామయ్య అని పిలిచేవాళ్లం.

కథల కామయ్య ఒక రాత్రి యీ కథ చెప్పాడు.

అనగనగా ఒక వూళ్లో ఒక బ్రాహ్మల అబ్బాయి వున్నాడు. అత డొక రోజున చెర్లో స్నానం చేసి వస్తుండగా గట్టుమీద ఒక చేప కనిపించింది. ఆ చేప పాపం గిలగిలా కొట్టుకుంటూ చావటానికి సిద్ధంగా వుంది. బ్రాహ్మణయువకుడు దయతలిచి ఆ చే.ని ఎత్తి నీళ్లలో వెయ్యబోయాడు. కాని ఆ చేప "వద్దు వ" ద్దంది. ఏమని అడిగాడు యువకుడు. "నన్ను మా చేపల రాజుగారు కోపమొచ్చి చెర్లోంచి తరిమేశారు. మళ్లీ అక్కడికి వెడితే ఆయన చంపేస్తారు." అన్నది చేప.

ఆ యువకుడు చేపని తన చెంబులో నీళ్లు పోసి అందులో వేసి ఇంటికి తీసుకు వెళ్ళాడు. రోజూ ఆ చెంబులో కొత్తనీళ్లు పోస్తూ చాలాకాలం ఇల్లా ఆ చేపని పోషించాడు. వాళ్లిద్దరూ బాగా స్నేహితులయ్యారు.

ఆ బ్రాహ్మణ యువకుడు ఆ వూళ్లోనే ఉన్న సుశీల అనే బ్రాహ్మణకన్యను ప్రేమించాడు. ఒక రోజున సుశీల తండ్రివద్దకు వెళ్లి "మీ అమ్మాయిని పెళ్లి చేసుకుంటా" నని అడిగాడు. కాని సుశీలతండ్రి "నువ్వు చిల్లిగవ్వ లేని దరిద్రుడివి. నీకు నా కూతురు నెల్లా యిస్తాను? 10వేల రత్నాలు నా కిస్తే సుశీల నిచ్చి పెళ్లి చేస్తాను" అన్నాడు.

పాపం ఆ యువకుడు విచారంగాయింటికివచ్చాడు. అతని ఆస్తినంతా అమ్మినా వందరూపాయలు; రావు. అతను విచారంగా ఉండటం చూసి చేప అడిగింది "ఏమిటి కారణ" మని. యువకుడు సంగతినంతా చెప్పాడు. అప్పుడు "అయ్యో, నా స్నేహితుడికి ఎంత కష్టం వచ్చింది." అని చేపకూడా ఏడ్చింది.

ఆశ్చర్యం! చేప ఏడవగానే ఒక్కొక్క కన్నీటి బొట్టూ ఒక్కొక్క రత్నమైంది. సంతోషంతో యువకుడు గబగబ ఆ రత్నాలన్నీ ఏరి లెక్కపెట్టాడు. అయిదు వేలే వచ్చాయి. అరెరే అనుకుని, "ఇంకాస్త ఏడవ్వే చేపా!" అన్నాడు.

చేపకి కోప మొచ్చి "భలే వాడివే. నీయిష్ట మొచ్చినప్పుడల్లా ఏడుస్తా ననుకున్నావా? నీమీద జాలిపుట్టి ఏడ్చానుగాని." అన్నది. మళ్లీ విచారంలో పడ్డాడు యువకుడు.

అప్పుడు చేప "పోనీ ఒక పని చెయ్యి. నన్ను మా చెరువుదగ్గిరికి తీసుకువెళ్లు. మా పాతయింటిని చూస్తే నాకు ఏడుపు వస్తుందేమో." అంది. సరేనని యువకుడు చేపని ఆ చెరువుకు తీసుకువెళ్లాడు. పాపం, తను పుట్టిపెరిగిన చెరువును చూడగానే చేప దుఃఖం ఆపుకోలేక భోళ్లున ఏడ్చింది. మళ్లీ రత్నాలు రాలాయి. ఈసారి చాల సేపు ఏడ్చిందేమో, ఒక్కసారే పదివేల రత్నాలు రాలాయి.

యువకుడు అవన్నీ ఏరుకుని సంతోషించాడు. ఇంతలోకే చెర్లోంచి చేపలరాజు తలెత్తి చూసి "నువ్వింక రావచ్చు. నిన్ను క్షమించాను." అంది చేపని పిలిచి. చేప సంతోషంతో యువకుడివద్ద

మనస్తత్వాలు:

భ్రమణం

భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుడుచుట్టూ తిరుగుతున్నదని మూడోక్లాసుపిల్లవాళ్ళు జాగ్రఫీపాఠంలో తెలుసుకుంటారు. ఈ మహాసత్యాన్ని ఒకప్పుడు చాలామంది ఎరగరు. అందుచేత వాళ్ళేమనుకునేవాళ్ళంటే భూమి కదలకుండా ఉన్నదనీ, దానిచుట్టూ సూర్యుడూ, చంద్రుడూ, ఇతర నక్షత్రాలూ తిరుగుతున్నాయనీ అనుకునేవాళ్ళు. నిజానికి, ఎన్ని జాగ్రఫీపుస్తకాలు చదివినా ఇవాళ మనకూ అట్లాగే తోస్తుంది. ఈ అపోహ ఫలితంగా ఏం జరిగిందంటే భూమి చరాచర సృష్టికి నడిబొడ్డనీ, దీని చుట్టూతా మిగిలిన సృష్టియావత్తూ పరిభ్రమిస్తున్నదనీ మనుషులనుకున్నారు. ఒక్క ధృవనక్షత్రం మాత్రమే ఏందుకో పెంకెదిరిగి భూమిచుట్టూ పరిభ్రమించ నిరాకరించింది. అయినా, ఇంత పెద్ద సూర్యచంద్రులూ, ఇన్ని కోట్ల నక్షత్రాలూ భూమికి ప్రదక్షిణం చేస్తుండగా లేంది ఒక్క ధృవనక్షత్రం మొండికేస్తేమటు కేం లెమ్మని మనుషులనుకున్నారు.

చివరకేం తేలింది? సృష్టికర్త అయినటువంటి ఆ చిదానందలీలామానుష నిర్వికారస్వరూపుడికి భూమిమీద ఏదో పక్షపాతం ఉందనీ, అటువంటి భూమిమీద ఉంటున్నటువంటి ప్రాణికోటికంటెల్లకీ మిన్న అయినటువంటి మానవులు భగవంతుడికి ప్రత్యేకప్రియులనీ తేలింది.

భూభ్రమణంవల్ల కలిగిన మానవుల ఈ భ్రమను మూడోక్లాసు జాగ్రఫీపుస్తకం తానుకొస్తా భగ్నంచేసి, భూమి తన చుట్టూ తాను తిరగటంవల్ల మిగిలిన నక్షత్రాదులు భూమిచుట్టూ తిరుగుతున్నట్టు కనిపిస్తున్నవనీ, భూమే సూర్యుడుచుట్టూ ప్రదక్షిణం చేసినట్టున్నదనీ. ఒక్క చంద్రుడు మినహాగా భూమిచుట్టూ తిరగడానికి పూనుకున్న గ్రహమే లేదనీ చెబుతున్నది.

భూమికీ, మానవులకూ కూడా నిజంగా ఇది తలవంపే. కాని జాగ్రఫీని కాదనడం ఎట్లా? గంపెడు అతిశయంకన్న గరిటెడు జ్ఞానం మేలాయె.

జాగ్రఫీకి అన్నో, తమ్ముడో అయిన హిస్టరీకూడా ఇటువంటి తలవంపులు తెచ్చిపెడుతూ ఉంటుంది. మహావీరులూ, మహాపురుషులూ, మహాత్ములూ అనుకున్న వాళ్ళను కొస్తా చరిత్ర మామూలుమనుషులేనని చెబుతుంది. ఇందువల్ల కొందరికి మనస్తాపాలు కలగవచ్చుగాక. కాని చరిత్రను మాత్రం కాదనటం ఎట్లా? వెల్స్ రాసిన చరిత్రలో పైగంబరునుగురించి ఘనంగా రాయలేదని సాయిబులు జంఝాటం తెంచుకుంటే ఏం ఫలించింది?

జాగ్రఫీలోనే కాక నిత్యజీవితంలో కూడా భ్రమణానికీ భ్రమకూ సన్నిహితసంబంధం కనిపిస్తుంది. చిన్నపిల్లలు సరదాకు గుడుగుడు గుంజం తిరిగితే, తిరగడం మానేసిన తరవాతకూడా ప్రపంచమంతా తిరుగుతున్నట్టు కొంతసేపు అనిపిస్తుంది. కొందరు పెద్దవాళ్ళకి తలతిరుగుడు జబ్బు వస్తుంది. అటువంటి జబ్బుగలవాళ్లు తల తిరుగుతున్నప్పుడు చప్పున కళ్లుమూసుని కూచుంటారు, లేదాపడుకుని మళ్లీ స్వస్థతచేకూరిన తరువాత లేచి తిరుగుతారు. ఈ పాటి జాగర్త తీసుకోకపోతే వాళ్లు నడుస్తూ తూలి కింద పడిపోగలరు. తలతిరుగుడు జబ్బుగల పైత్యశరీరులకు ప్రపంచం తమచుట్టూ పరిభ్రమిస్తున్నట్లు చూసే అదృష్టం ఉండికూడా అది చూసి ఆనందించే అవకాశం ఉండదు. కొద్దిమందికి ఏదన్నా కదిలేదాన్ని, రైలునో, నీళ్లనో, చూస్తే తల తిరుగుతుంది. ఎదురుగా వచ్చేవీ, దూరంగా పొయ్యేవీ వాళ్లకు పైత్యభ్రమకలిగించవు. ఒకపక్కనుంచి ఇంకోపక్కకుపొయ్యేవాటితోనే చిక్కు. ఎదురుగుండా కనిపిస్తూ అడ్డంగా కదిలేవాటితోనే చిక్కు. అట్లా కదిలేవే మనచుట్టూ ప్రద

(40-వ పేజీ చూడుడు)

సెలవు తీసుకుని చెంగున చెర్లోకి గెంతింది. యువకుడు రత్నాలు తీసుకుని పరుగెత్తాడు సుశీల తండ్రిదగ్గిరికి. పదివేల రత్నాలు ఆయనకిచ్చి మిగతా అయిదు వేలూ తెమ్చుకొని సుశీలతో పయనమైన [illegible] కాపురం చేశాడు.

తంతివార్త

(29-వ పేజీ తరువాయి)

డట? అందుకనే అంత కోపంగా ఉన్నాడనుకుంటా?" గెక్ విన్నాడది. ఎలుగ్గొడ్డుతో ఒంటరిగా దెబ్బలాడ గలిగినవాడైతే మాత్రం, వాళ్ళమ్మతో సరిగా ప్రవర్తించకపోతే ఎవ్వరినీ సహించ డతను.

ఉదయాన పొద్దుపొడవగానే అతను దుస్తులన్నీ మార్చుకుని, మంచుబోటు, తుపాకీ తీసుకుని, కుక్కతో గూడా అరణ్యంలోకి చొచ్చుకుపోయాడు. ఇంక వాళ్ళ సంగతి వాళ్ళే చూచుకోవాలి.

ముగ్గురూ కలిసెళ్ళారు నీళ్ళకోసం. క్రిందికి దొర్లిపడుతూన్నట్టున్న ఒక పెద్దరాయి అడుగునుంచి, చిన్న నీటిప్రవాహం వస్తూవుంది మంచునేలమీదకి. వేడినీటి పాత్రలోంచి వస్తున్నట్టు ఆవిరిలాంటి పొగ ఎగజిమ్ముతున్నాయి నీళ్ళు. గెక్ చెయ్యిపెట్టి చూశాడు నీళ్ళలో. మంచుకంటె చల్లగా ఉన్నాయి.

తరవాత కర్రలు తెచ్చుకున్నారు. ఆ స్టవ్ ఎట్లా వెలిగించాలో వాళ్ళమ్మకి తెలియదు. చాలాసేపటివరకు అసలు కట్టెకి మంట అంటుకోనే లేదు. ఎట్లాగో మండటం మొదలుపెట్టేటప్పటికి అవతలవైపు గోడకిటికీకున్న మంచు పలకలు, దెబ్బకి కరిగి నీరయిపోయినాయి. అందులోంచి, అడవి పైభాగమూ, ఒక మొక్కమీం చోకమొక్క మీది కెగురుతున్న శీతాకోకచిలుకలూ, దూరాన నీలపు కొండల నల్లరాళ్ళూ, కనిపిస్తున్నాయి.

కోడిపిల్ల ఈకలు తీసి వండడమైతే వాళ్ళమ్మకి తెలుసు గాని, కుందేలు చర్మమెప్పుడూ వలిచి ఎరగదు. చాలాసేపు పట్టింది అది అయ్యేటప్పటికి.

చుక్ కూడా ఆమెకి సహాయం చేశాడు. అందుకు దాని తోకచర్మం బహుమతిగా తీసుకున్నాడు కూడా. అది చాలా తేలిగ్గావుంది. గాలిలో పైనుంచి వదిలిపెడ్తే గాలి గొడుగులా మెల్లిగా క్రిందికి దిగేది.

భోజనంచేసి ముగ్గురూ అట్లా షికారుకి బయలుదేరారు.

చుక్ వాళ్ళమ్మని పొడుగుతువాకైనా, కనీసం కొన్ని తూటాలైనా తీసుకోమని గోల చేశాడు. అన్నిటికంటె ఎత్తుగా ఉన్న కొక్కానికి తుపాకి తగిలించి, స్టూలుమీద నుంచుని అన్నిటికంటె పైనున్న అలమార అరలో తూటాలు పెట్టేసి, "తూటాలు తీశావంటేనా, ఎరగవా?" అంటూ బెదిరించింది చుక్‌ని.

చుక్ మొహం ఎఱ్ఱగా పెట్టి విసురుగా వెళ్ళిపోయాడు. అప్పటికే ఒక తూటా జేబులో పెట్టి దాచేశాడు.

అయితే బలేషికారది. నీళ్ళఊట దగ్గిరికి ఆ సన్నటి దారిలో వరసగా నడిచారు. నెత్తిమీద ఆకాశం ముదురు నీలంరంగుతో మెరుస్తోంది. చిన్నచిన్న పక్షులు రొదచేస్తున్నాయి.

అదివరకు మా సోక్కలో ఉండగా గెక్, ప్రపంచమంతా మా సోక్కయే అనుకునేవాడు—దాని రోడ్లు, ఇళ్లు, దీపపు స్తంభాలు, కార్లు, ట్రాములు-అన్నీ. ఇప్పుడు ప్రపంచమంతా ఒక పెద్ద అడివే నేమో ననిపిస్తోంది.

రెండు రోజులు గడిచిపోయినాయి. అది మూడవరోజు. అడివిలోంచి ఇంకా కాపలా అతను రాలేదు. ఆ చిన్న మంచుకప్పు గుడిసెలో ఆందోళన ప్రారంభమైంది.

పొద్దు గూకుతున్నప్పటినించీ రాత్రంతా ఎంతో భయంకరంగా ఉండేది. లోపల తలుపులన్నీ బిడాయించి తాళాలు పెట్టుకునేవారు. కిటికీలకి చాపలు అడ్డం కట్టేవారు — లోపల దీపపు వెలుతురు అడివిలో మృగాలకి కనుపించకుండా. అసలు దానికి వ్యతిరేకంగా చేయాల్సింది వాళ్ళు. మృగాలు మనుషుల మల్లే కాదుగా? వెలుతురంటేనే భయం వాటికి.

మామూలుగా గాలి, పొగగొట్టంలోంచి, ఈలవేసుకుంటూ లోపలికి వస్తోంది. బైట పెద్దగాలి వీచినప్పుడల్లా, సూది ఆకులు గోడకేసీ తలుపులకేసీ రాచుకునేవి. వినేవాళ్ళకెవరో తలుపు గీకుతున్నట్టు, తలుపు కొట్టున్నట్టు ఉండేది.

పొయ్యి పక్క జేరేవారంతా. వాళ్ళమ్మ ఏవేవో దేవతల కథలు చెప్తూ చెప్తూనే నిద్రపోయేది. "అరేయి చుక్!" అన్నాడు గెక్. "మాంత్రికులు కథల్లోనే ఉంటమేమిటి, నిజంగా మాత్రం ఎందుకుండగూడదు?"

"రాక్షసులూ రాకాసులూ అనా నువ్వనేది?" అన్నాడు చుక్.

"కాదురా!" విసుగ్గుతో తల

తిప్పాడు గెక్. "రాకాసుల సంగతెవడికి కావాలి. ఎవరైనా మంచి మాంత్రికుడి నొకణ్ణి పిలవగలిగితే—నాన్న దగ్గిరికెళ్ళి మనం చాలా రోజుల క్రితమే వచ్చేశామని చెప్పమని చెప్పవచ్చు."

"దేనిమీద ఎగురుతాడు మరి వాడు?"

"ఎగరడమా? ఎందుకు? చేతులు రెండూ చాచి, ఇంకేదో చేశాడంటే—అతనికి దారి తెలుస్తుందిలే, భయపడబోకు"

"ఇప్పుడు చేతులు చాచడానికి వీల్లేనంత చలిగా ఉంది చూడు నా చేతులకి మేజోళ్ళు, పైన తోలు తొడుగు ఉన్నా, కొయ్యముక్కల్లా ఎట్లా బిగుసుకుపోతున్నాయో?" అన్నాడు చుక్.

"అయితే నిజం చెప్పు చుక్! నువ్వవన్నీ అబద్ధాలనుకుంటున్నావ్ కదూ?"

"నాకేం తెల్సు? మనదొడ్డి వెనక ఒక కుంటాయనుండే వాడు గుర్తుందా? వాడన్ని రకాల తాయత్తులు, కొమ్ములు అమ్ముతుండేవాడు. చాలా మంది ముసలమ్మలతని చుట్టూ చేరి అదృష్టం చెప్పమంటూ వుండేవారు. ఎవరదృష్టం ఎలా ఉంటుందో ఎవరు చెప్పగలరు?" గొణిగాడు చుక్.

"మరి, చెప్పినట్లుగా జరిగేవా?"

"నాకు తెలియదు! ఒకసారి పోలీసులొచ్చి లాక్కుపోయారు వాణ్ణి. వాడి దగ్గర దొంగసొమ్ము చాలా దొరికిందట."

"ఆ వాడు మాంత్రికుడెట్లా అవుతాడు. ఎవరో దొంగవెధవ. ఏమంటావ్?"

"అంతే అవచ్చు - అయితే నేననేదేమిటంటే, మాంత్రికులంతా అటువంటి దొంగవెధవలే నని" అన్నాడు చుక్. "ఏది కావాలంటే అది కోరికే వళ్ళో వచ్చిపడ్తుండే, ఇక పని చేయాల్సిన అవసరమేముంటుంది? అయితే నువ్వింక నిద్రపో- నీతో ఇంక మాట్లాడలేను నేను."

"ఎందుకని?"

"ఎందుకనంటే-వెధవ సంగతులేవేవో మాట్లాడి, ఆ తరవాత రాత్రి పీడకలలు కని, నాడొక్కల్లో మోకాళ్ళు దూర్చి పొడుస్తావ్! రాత్రి పొట్టలో కుమ్మలా అంతగట్టిగా?"

నాలుగో రోజు పొద్దున వాళ్ళమ్మే కట్టెలు కొట్టుకోవలసి వచ్చింది. ఆ కుందేలు నప్పుడే తినేశారు వాళ్ళు. బైట పారేసిన బొమికలు కూడా శుభ్రంగా నాకేశాయి పురుగులు. మధ్యాహ్నం భోజనానికున్నదల్లా కాసిని ఉల్లిపాయలు. రొట్టె అంతా అయిపోయింది. వాళ్ళమ్మ ఎక్కడో పిండి ఉంటే కొన్ని బిస్కట్లు తయారు చేసింది వాళ్ళకోసం.

వాటితో భోజనం పూర్తి చేసేటప్పటికి, చాలా నీరసం అనిపించింది గెక్‌కి. జ్వరమొస్తుందేమోనని భయపడ్డది వాళ్ళమ్మ.

అతన్ని ఇంట్లోంచి కదలొద్దని చెప్పిందామె. చుక్‌ని తీసుకుని, ఒక రేకుడబ్బా భుజాన పెట్టుకుని వెళ్ళింది నీళ్ళు తేవడానికి. కొద్దిగా అడవి దాకా కూడా వెళ్ళారు మర్నాటికి కట్టెలు తెచ్చుకోడానికి.

చుక్కూ వాళ్ళమ్మా చాలాసేపటివరకు రాలేదు. ఒకసారి నీళ్ళ డబ్బా తిరగబడిపోయి నీళ్ళన్నీ పోయినాయి. మళ్ళీ నీటిప్రవాహం దగ్గిరకెళ్లాల్సొచ్చింది. మళ్ళీ సగం దూరం వచ్చేసింతర్వాత, చుక్ చేతి తోలుతొడుగు అడవి మొదట్లో వదలిపెట్టేసినట్టు గుర్తొచ్చింది. మళ్ళీ వెనక్కి తిరిగారు ఈలోగా చీకటి పడ్డది.

ఎట్లాగో ఇంటికి చేరుకునేటప్పటికి గెక్ ఎక్కడా కనపడలేదు. మొదట స్టవ్ వెనక గొర్రెచర్మం కప్పుకుని దాక్కున్నాడేమో అనుకున్నారు. అక్కడా లేడు.

చుక్ నవ్వి వాళ్ళమ్మ చెవిలో మెల్లిగా చెప్పాడు, స్టవ్ అడుగున దూరుంటాడని. ఆమె కోపంతో కేక పెట్టింది బైటికి రమ్మని. గెక్ మాటాడలేదు.

అప్పుడు చుక్ పొడుగాటి ఇనపకడ్డీ తీసుకుని పొడవడం మొదలుపెట్టాడు. ఊహు! గెక్ లేడక్కడ.

ఇప్పుడు వాళ్ళమ్మకి చాలా ఆతురత కలిగింది. తలుపు దగ్గర మేకువంక చూసింది. గెక్ కోటు, టోపీ కనుపించలేదు.

బైటికొచ్చి ఇంటి చుట్టూ కలయజూసింది. మళ్ళీ లోపలకొచ్చి లాంతరు వెలిగించింది. అది పట్టుకుని పశువులగది, కట్టెలదొడ్డి చూసింది,

గెక్‌ని పేరుపెట్టి పిలిచింది. అరిచింది-తిట్టింది. సమాధానం రాలేదు.

మళ్ళీ ఇంట్లోకి పరుగెత్తుకొచ్చింది. వేకు ఊడిపోయేట్టు లాగింది తుపాకి. చేతికందిన నన్నె తోటాలు తీసుకుని, చుక్‌తో ఇల్లు కదలొద్దని చెప్పి, లాంతరు పుచ్చుకుని దొడ్లోకి పరిగెత్తింది.

భ్రమణం

(37-వ పేజీ తరువాయి)

క్షీణం చేస్తున్న భ్రమ కలిగిస్తాయి.

తలతిరుగుడువ్యాధిలో రెండు రకా లున్నట్టు దీన్నిబట్టి స్పష్టమవుతున్నది. తల తిరగడంవల్ల చుట్టూ ప్రపంచం తిరుగుతున్న దనిపించటం ఒకటి ఎదురుగా ఏవో కదలడంవల్ల తలతిరగడం మరొకటీని అయితే రెండు రకాల వ్యాధుల్లోనూ సామ్యం ఏమిటంటే భ్రమ

కొందరు కొందరిలో ఈ భ్రమ వ్యాధి లేకుండానే కలగడం కద్దు మాటవరసకి ఏ పెద్దమనిషి అయినా దొంగవ్యాపారం చేసి ఒక లకారం చేపట్టేసరికి ప్రపంచం తన చుట్టూ తిరుగుతున్నదన్న భ్రమ ఏర్పడుతుంది' నిజంగా చుట్టూ తిరిగే ఉపగ్రహాలు —భూమికి చంద్రుడులాగ—కొన్ని ఏర్పడడంమూలాన ఈ భ్రమ మరింత అవుతుంది. కాంగ్రెసు మంత్రిపదవులూ, పత్రికాసంపాదకత్వమూ, సినిమాతారత్వమూ, డిటో దర్శకత్వమూ మొదలైనవికూడా ఇటువంటి భ్రమకు దారితీయడం లేకపోలేదు

ఈ డబ్బు వగైరాలుకూడా జబ్బులేనని కొందరు శాస్త్రవేత్తల వాదం, కాదని మరికొందరు శాస్త్రవేత్తల వాదం రెండు వాదాలలోనూ చెరిసగం నిజమున్నది డబ్బూ, మంత్రిత్వమూ, తారత్వమూ, కవిత్వమూ మొదలైనవాటిల్లో స్వతహాగా వ్యాధిలక్షణాలు లేవు కొన్ని కొన్ని తత్వాలకు అవి అలవాటు లేకా, పడకా పైత్యప్రకోపన కలుగుతుంది

దీన్ని అనేకఉదాహరణలతో రుజువు చెయ్యవచ్చు ఉదయం ఇరవైమూడు ఇడ్డెనులు ఫలహారం చేసి మధ్యాహ్నానికల్లా నిష్పూచీగా విందుఆరగించగలవాళ్లున్నారు నాలుగు ఇడ్డెనలకే ఉదాత్తమైపోయి ఒక భోజనం ఎగగొట్టేవాళ్లూ ఉన్నారు కను రెప్పవంత్రుక చలించకుండా ఇంపీరియల్ బాంకునుంచి ఇరవై ఎనిమిదివేలు "డ్రా" చేసి వాటిని కారులో పెట్టించుకుని వెళ్ళిపోయిన వాణ్ణి నేను స్వయంగా చూశాను పదవులైనా అంతే పదవి నిర్వహించేవాడే పదవికన్న చిన్నవాడైతే "చక్కర్' ప్రారంభ మవుతుంది చిన్నపామునన్నా పెద్దకర్రతో కొట్టమన్న సామెతగా చీప్రాసీ ఉద్యోగానికైనా కాస్త పెద్దవాణ్ణే నియమిస్తే తలతిరుగుడు వ్యాధికి తావుండదు

అధికారాంధకారానికి, పాపం, అల్పత్వంవల్ల నే తలతిరుగుడు కలుగుతుందనడం అన్యాయం. కొంతమంది అధికార్ల చుట్టూ కొందరు ప్రదక్షిణాలు చేసి చేసి వాళ్ళకు తలతిరుగుడు తెప్పిస్తారు కొందరు సినిమాప్రొడ్యూసర్లకు తాము సృష్టిస్తున్నదే ఉత్తమకళ అని భ్రమ కలిగినా, కొందరు మంత్రులకు తాము కవులకన్నా, నటులకన్నా గొప్పవాళ్ళమని భ్రమకలిగినా, కొందరు గాంధీటోపీవ్యాపారస్తులకు దొంగమార్కెట్టు చెయ్యడమే దేశోపకార మన్న భ్రమ కలిగినా మనం వెంటనే వాళ్ళను విమర్శించరాదు

మంత్రాలకి చింతకాయలు రాలుతాయనే భ్రమగలవాళ్ళు కొందరు అధికార్ల తలతిరుగుడుగురించి ఉపన్యాసాలిస్తారు దీనివల్ల ఫలితం లేకపోగా అతిగా మాట్లాడడంవల్ల ఉపన్యాసకులకు పైత్యం కలిగే అవకాశం ఉన్నది

అందుచేత రాజకీయ, సాంఘిక, ఆర్థిక పైత్యాన్ని, దానివల్ల కలిగే తలతిరుగుడునూ తుదముట్టించాలంటే రాజకీయ, సాంఘిక ఆర్థికసత్యాలనుగురించి పుస్తకాలు రాసి అవి మూడోక్లాసువిద్యార్థుల చేత చదివించటం చాలా మంచిది

[జయ]

దాగిన ద్వేషం

(18-వ పేజీ తరువాయి)

నా ఆస్తిని పూర్తిగా ఇవ్వదల్చుకోలేదు. డబ్బు పాపిష్ఠిది. డబ్బు దగ్గరకొచ్చేసరికి అది అన్నదమ్ములూ, తల్లీపిల్లలూ అనేది లేకుండా మనుషుల్ని రాక్షసులుగా మార్చేస్తుంది ఈ డబ్బువల్లే నాకు సుఖం లేకుండా పోయింది కావలసినవాళ్లు కూడా దేవిరించేవాళ్లే కాని నాసుఖం చూసేవాళ్ళొక్కళ్లు లేరు నా ఆస్తినంతా చేర్చి ఒక ధర్మసంస్థ స్థాపించాలనుంది ఆ మాట వాళ్లందరికీ చెప్పేశాను. ఇంక వాళ్లెవరినీ నాఆస్తిమీద ఆశపెట్టుకోవద్దని చెప్పేశాను అయినా సరే పాపం కమల ఒక్కత్తే నన్ను అంటిపెట్టుకుని వుంది"

"సరే ఇప్పుడు నన్నేం చెయ్యమన్నారు?"

"నా వ్యాపారంలో వాటాదారొచ్చాడు. ఒక ప్లీడర్ని తీసుకుని వాడితో మాట్లాడి నా వ్యాపారంలోంచి వాణ్ణి విరగడ చెయ్యాలి నా భార్యతో రాజీ ఏర్పాటు చెయ్యాలి"

"అంటే మీవూరు బెజవాడ కూడా రావాలన్నమాట నేను"

"అవునండి ఖర్చులన్నీ నేనే భరిస్తాను"

"నా ఫీజు తెలుసుగా మీకు? రోజుకి రెండు వందలు, పైన ఖర్చులన్నీ మీవి"

"అలాగే" అంటూ దుర్గయ్య కుర్చీలోనుంచి లేచాడు మెల్లిగా నడిచి హాల్లోకి వెళ్లాడు మాధవరావూ, రంగారావూ పరీక్షగా అతన్ని చూశారు అతని కుడిచెయ్యి మాటిమాటికీ దేన్నో గట్టిగా పట్టుకున్నట్టు పిడికిలి బిగించాడు గడపదాటి నిలబడి దుర్గయ్య పిడికిలి చూసుకున్నాడు. చేతిలో ఏమీ లేదు అయినా కత్తిపట్టుకున్నట్టు, ఆ అంచూ, ఈ అంచూ చూస్తూ తిప్పుతున్నట్టు, ముడిచిన పిడికిలి తిప్పుతూ చూశాడు ఘటాలున చెయ్యిలాల్చి జేబులోదాక్కుంది అదిరిపడి వెనక్కు చూశాడు వెనక ఇద్దరూ తన్ని గమనిస్తున్నట్టు చూశాడు తొట్రుపడి గబగబా నడిచి వెళ్లిపోయాడు.

[సశేషం]

[ఇందులోని భావాలన్నీ కల్పితాలు]



గాంధీమహాత్ముని

ఆత్మకథ

ప్రథమ, ద్వితీయ సంపుటములు

[చతుర్థముద్రణము]

శతావధాని వేలూరి శివరామశాస్త్రిగారి అనువాదము

ఖద్దరు బైండు

ప్రతి సంపుటము పోస్టేజితో సహా వెల రూ. 5-9-0

ఒకేసారి 2 సంపుటములు పోస్టేజితో రు. 10-12-0

ఆంధ్రగ్రంథమాల

పోస్టుబాక్సు నెం. 212, మద్రాసు.

Edited, Printed & Published by S Sambhu Prasad, at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., Madras